

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 356

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఈడీ కస్టడీకి కవిత

ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన తెలంగాణ ఎమ్మెల్సీ కవితను ప్రత్యేక కోర్టు 7 రోజులు ఈడీ కస్టడీకి అప్పగించింది.

వివరాలు 15లో ▸



నేడే గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 301 కేంద్రాల్లో గ్రూప్‌-1 (ప్రిలిమ్స్‌) జరగనుంది. 1,48,881 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

వివరాలు 12లో ▸


ఆంధ్రప్రదేశ్‌లో

మే 13న పోలింగ్‌

175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు అదే రోజు ఎన్నికలు

- 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ విడుదల
- లోక్‌సభతో పాటు 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు
- నాలుగో దశలో ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్‌
- ఏప్రిల్‌ 18న ఏపీ ఎన్నికల నోటిఫికేషన్‌
- జూన్‌ 4న కౌంటింగ్‌.. అదే రోజు ఫలితాలు

12లో



ఏపీ అసెంబ్లీ, లోక్‌సభ, తెలంగాణ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌

ఎన్నికల నోటిఫికేషన్‌	నామినేషన్లకు చివరి తేదీ	నామినేషన్ల పరిశీలన
ఏప్రిల్‌ 18	ఏప్రిల్‌ 25	ఏప్రిల్‌ 26
నామినేషన్ల ఉపసంహరణ	పోలింగ్‌	ఫలితాలు
ఏప్రిల్‌ 29	మే 13	జూన్‌ 4

సార్వత్రిక సమరం

దేశవ్యాప్తంగా ఏప్రిల్‌ 19 నుంచి జూన్‌ 1 దాకా 7 విడతల్లో పోలింగ్‌

6లో

దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల దశలు

దశ	సీట్లు	రాష్ట్రాలు	పోలింగ్‌
తొలి దశ	102	21	19-04-2024
2వ దశ	89	13	26-04-2024
3వ దశ	94	12	07-05-2024
4వ దశ	96	10	13-05-2024
5వ దశ	49	08	20-05-2024
6వ దశ	57	07	25-05-2024
7వ దశ	57	08	01-06-2024

పవన్‌.. ఆ ఐదేళ్లూ ఏ మడుగులో దాక్కున్నావు?

- కాపు ఉద్యమం కోసం ఒక్క సానుభూతి లేఖ అయినా రాశావా?.. కేవలం 21 సీట్లతో ఏం చేద్దామని?
- పవన్‌ సినిమాల్లో హీరో అయితే నేను రాజకీయాల్లో హీరోని
- జనసేన అధినేత పవన్‌పై కాపు ఉద్యమ నేత ముద్రగడ ఫైర్‌

3లో



వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల జాబితా ప్రకటన సందర్భంగా మాట్లాడుతున్న సీఎం వైఎస్‌ జగన్‌, చిత్రంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ నందిగం సురేశ్‌



సగర్వంగా ఎగిరిన సామాజిక జెండా

అజెండాను అమలు చేసి చూపించిన సీఎం జగన్‌

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సరిగ్గా సగం సీట్లు

- ఒకేసారి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- దేశ చరిత్రలోనే సీఎం జగన్‌ సరికొత్త రికార్డు.. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ అభ్యర్థుల ఎంపిక
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్‌ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్‌ చేస్తూ చట్టం
- ఇప్పుడు అదే రీతిలో శాసనసభ, లోక్‌సభ స్థానాల్లో మొత్తంగా సగం స్థానాలు ఆ వర్గాలకే
- గత ఎన్నికల్లో 89 స్థానాలు.. ఇప్పుడు 100 స్థానాలు కేటాయింపు
- ఈ స్థాయిలో సామాజిక న్యాయం చేసిన దాఖలాలు లేవంటోన్న రాజకీయ పరిశీలకులు
- ఎన్నికల్లో సామాజిక విప్లవానికి నాంది.. ఇప్పుడు సామాజిక మహా విప్లవం ఆవిష్కరణ

2లో

- అసెంబ్లీ సీట్లలో ఎస్సీలకు 29, ఎస్టీలకు 7, బీసీలకు 48 కేటాయింపు.. ఇందులో మైనార్టీలకు 7 స్థానాలు
- మహిళలకు 19 స్థానాల్లో అవకాశం
- టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి 135 స్థానాల్లో బీసీలకు కేవలం 25 సీట్లే
- మరోసారి బీసీ వర్గాలకు ద్రోహం చేసిన చంద్రబాబు, పవన్‌ కళ్యాణ్‌
- గత ఎన్నికల్లో ఎస్సీలకు 29, ఎస్టీలకు 7, మైనార్టీలకు 5.. బీసీలకు 41 శాసనసభ స్థానాల్లో అవకాశం
- ఈ ఎన్నికల్లో మహిళలకు 4, మైనార్టీలకు 2 స్థానాలు అదనంగా కేటాయింపు
- గత ఎన్నికల్లో ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, బీసీలకు 7 లోక్‌సభ స్థానాల్లో అవకాశం
- ఈ దఫా ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, బీసీలకు 11 స్థానాల్లో అవకాశం
- గత ఎన్నికల్లో మహిళలకు నాలుగు చోట్ల అవకాశం.. ఇప్పుడు ఐదు సీట్లు

ఇదీ సామాజిక న్యాయం

- ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌
- ఐదేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు
- మహిళా సాధికారతకు బాసట
- నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు
- 50 శాతం సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే
- 77% అభ్యర్థులు గ్రాడ్యుయేట్లు
- ఈ మార్పులన్నింటి వల్ల 2-3 నెలల్లో మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం

2లో

విద్యావంతులకు పెద్దపీట

2లో

వైఎస్సార్‌సీపీ గెలుపు గుర్రాలివే..

11లో

‘జగనైక’ విజయం 2.0

రేసుగుర్రాలు ‘సిద్ధం’

జనబలమే గీటురాయిగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపిక

- సామాజిక న్యాయమే లక్ష్యంగా సమతూకం
- మెరుగైన ఫలితాల సాధన దిశగా ముందడుగు
- ఒకేసారి 175 శాసనసభ, 24 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన
- రాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టి బీసీల కోసం నిలబడిన నేత సీఎం జగన్
- పెట్టుబడి పార్టీలకు ముఖ్యమంత్రి నిర్ణయం గొడ్డలిపెట్టు
- చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణపైనా పోటీ చేసేది బీసీలే



సాక్షి,అమరావతి: సామాజిక న్యాయాన్ని కేవలం మాటల్లోనే కాక చేతల్లోనూ చేసి చూపారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అంటూ పదేపదే స్పష్టం చేసిన ఆయన అదే నినాదాన్ని అక్షరసత్యం చేశారు. 50 శాతం సీట్లు బడుగు బలహీనవర్గాలకు కేటాయించారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాలు కలిపి 200 మొత్తం సీట్లకు 100 సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చి తాను విశ్వసనీయతకు మారుపేరని మరోమారు చాటుకున్నారు. ఈ నిర్ణయం అనన్య సామాన్యం.. అనితర సాధ్యం. ఇది ఇప్పటివరకు ఎవరూ సాహసించని అరుదైన ఘట్టంగా చరిత్రలో నిలిచిపోతోంది. ఒక్క అనకాపల్లి పార్లమెంట్ స్థానం మినహా రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు శనివారం ఇడుపులపాయ వేదికగా, వైఎస్ రాజశేఖరరెడ్డి పవిత్ర సమాధి సాక్షిగా వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థులను ప్రకటించారు. జనబలమే గీటురాయిగా అభ్యర్థులను ఎంపిక చేశారు. సామాజిక సమతూకం పాటించారు. బీసీలకు, మహిళలకు అగ్రతాంబూలం ఇచ్చారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వెనుకబడిన వర్గాల వారి కోసం ఒక అడుగు ముందుకు వేస్తే తాను మరో నాలుగు అడుగులు ముందుకు వేస్తానని చెప్పిన మాటను సీఎం జగన్ నిలబెట్టుకున్నారు. మొత్తం 175 శాసనసభా స్థానాల్లో 48 మంది బీసీలకు అవకాశం కల్పించారు. మొత్తం 25 లోక్‌సభ సీట్లలో బీసీలకు 11 సీట్లు ఇచ్చారు. భవిష్యత్తులోనూ తాను బడుగు, బలహీనవర్గాల వెన్నంటే ఉంటానని, వారే నా బలం.. నా బలగం అని చాటిచెప్పారు.

టీడీపీ అగ్రజులపై బీసీల పోటీ

కుప్పంలో చంద్రబాబుపై వన్నికుల క్షత్రియకు చెందిన కేఆర్‌జే భరత్, మంగళగిరిలో నారా లోకేశ్‌పై పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన మురుగుడు లావణ్య పోటీ చేస్తున్నారు. నందమూరి బాలకృష్ణపై కురుబ సామాజిక వర్గానికి చెందిన టీజీఎన్ దీపిక పోటీకి దిగుతున్నారు. వీరు ముగ్గురూ బీసీలే కావటం విశేషం.

గత ఎన్నికల్లోనూ బడుగు, బలహీనవర్గాలకు ప్రాధాన్యం

గత ఎన్నికల్లోనూ ప్రాధాన్యం వైఎస్సార్ సీపీ బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు ప్రాధాన్యం ఇచ్చింది. ఎస్సీలకు 29, ఎస్టీలకు 7, బీసీలకు 41 శాసనసభ స్థానాల్లో అవకాశం కల్పించింది. ఇందులో మహిళలకు 15, మైనార్టీలకు 5 స్థానాల్లో అవకాశం ఇచ్చింది. 2019 ఎన్నికల కంటే ఇప్పుడు శాసనసభ స్థానాల్లో మహిళలకు నాలుగు, మైనార్టీలకు రెండు స్థానాలు అదనంగా కేటాయించింది. పార్లమెంటు స్థానాల విషయానికి వస్తే గత ఎన్నికల్లో ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, బీసీలకు 7 లోక్‌సభ స్థానాల్లో సీఎం జగన్ అవకాశం ఇచ్చారు. గత ఎన్నికల్లో లోక్‌సభ స్థానాల్లో మహిళలకు నాలుగు చోట్ల అవకాశం కల్పిస్తే ఇప్పుడు ఐదు నియోజకవర్గాలు కేటాయించారు. సామాజిక న్యాయం, జనులకు సుపరిపాలనే లక్ష్యంగా సీఎం జగన్ అభ్యర్థులను ఎంపిక చేశారని రాజకీయ విశ్లేషకులు సైతం ప్రశంసిస్తున్నారు. తన రాజకీయ భవిష్యత్తునూ పణంగా పెట్టి ఇంతలా బీసీల కోసం నిలబడిన నేత మరొకరు లేరని శ్లాఘిస్తున్నారు. డబ్బు, పొత్తులు, ఎత్తులను నమ్ముకొని ఎన్నికల క్షేత్రానికి వచ్చే టీడీపీ, బీజేపీ, జనసేన లాంటి పెట్టుబడి పార్టీలకు సీఎం జగన్ నిర్ణయం గొడ్డలిపెట్టు అని మేధావులు అభివర్ణిస్తున్నారు.

సీఎం చెప్పారంటే.. చేస్తారంతే..

సీఎం జగన్ చెప్పారంటే ... చేస్తారంతే అనే నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఓ సభలో మాట్లాడుతూ ‘‘సీఎం జగన్ తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సమస్యలు ఏవైనా ఉంటే తక్షణం పరిష్కారానికి పూనుకునే వారు. ఇప్పుడు సీఎం జగన్ కూడా బీసీలు, మహిళలు, పేదల ఉజ్వల భవిత కోసం పరితపిస్తున్నారు. బడుగు, బలహీనవర్గాల సాధికారత దిశగా కృషి చేస్తున్నారు. ఆయన చెప్పిందే చేస్తున్నారు. ఆయన వెంట నడవాల్సిన బాధ్యత మన బీసీలతోపాటు అన్ని కులాలు, అన్నివర్గాలపైనా ఉంది. 2024 ఎన్నికల్లో చంద్రబాబు, పవన్, బీజేపీ ప్రలోభాలకు లొంగవద్దు’’ అన్నారు. ఇప్పుడు కృష్ణయ్య మాటలను నిజం చేస్తూ సీఎం జగన్ అభ్యర్థుల ప్రకటనల్లో బీసీలకు, మహిళలకు పూర్తి న్యాయం చేశారు. కనుక ఇక వైఎస్సార్‌సీపీకి మద్దతునిచ్చే బాధ్యత బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపైనే ఉందనే అభిప్రాయం సర్వత్రా వెల్లడవుతోంది.

వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన స్థానాలు ఇలా..

	ఎస్సీలు	ఎస్టీలు	బీసీలు
అసెంబ్లీ	29	07	48
లోక్‌సభ	04	01	11

(అసెంబ్లీ స్థానాల్లో 19 మంది మహిళలు, ఏడుగురు మైనార్టీలకు అవకాశం కల్పించారు. లోక్‌సభ స్థానాల్లో ఐదుగురు వనితలు పోటీ చేస్తున్నారు.)

ప్రతిపక్ష కూటమి బీసీలకు ఇచ్చింది 25 సీట్లే

వైఎస్సార్ సీపీ బీసీలకు 48 సీట్లు కేటాయిస్తే ఇప్పటివరకు ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 135 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా, అందులో బీసీలకు కేవలం 25 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు.



పొట్టిశ్రీరాములుకు సీఎం జగన్ ఘన నివాళులు

సాక్షి,అమరావతి: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యావంతులకు పెద్దపీట

సాక్షి, అమరావతి: 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో విద్యావంతులకు పెద్దపీట వేశారు. వీరిలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారు, డాక్టర్లు, లాయర్లు, టీచర్లు, ఇంజినీర్లు, సివిల్ సర్వెంటు, జర్నలిస్టు ఇలా అన్ని రకాల విద్యావంతులకు జాబితాలో సీఎం జగన్ చోటు కల్పించారు. ఈ జాబితాలో మొత్తం 200 మందికి గాను 77 శాతం మంది ఉన్నత విద్యావంతులున్నారు. 175 శాసనసభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ ప్రకటించిన అభ్యర్థుల్లో 131 మంది గ్రాడ్యుయేషన్, ఆపై చదవులు చదివిన వారు ఉన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల్లో 47 మంది పోస్టు గ్రాడ్యుయేషన్, డాక్టరేట్ చేసిన వారున్నారు. 13 మంది డాక్టర్లు, 11 మంది లాయర్లు, 34 మంది ఇంజినీర్లు, ఐదుగురు టీచర్లు, ఇద్దరు సివిల్ సర్వెంట్లు(ఎ.ముహ్మద్ ఇంతియాజ్, ఆదిమూలపు సురేష్), ఒకరు డిఫెన్స్‌లో చేసినవారు (వాసుపల్లి గణేష్‌కుమార్), ఒక జర్నలిస్టు(కురసాల కన్నబాబు) ఉన్నారు.

ఎంపీ అభ్యర్థుల్లో 88 శాతం డిగ్రీ, ఆపై చదివినవారే..

25 లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ ప్రకటించిన అభ్యర్థుల్లో 22 మంది (88 శాతం) డిగ్రీ, ఆపై చదువులు చదివిన వారు ఉన్నారు. ఇందులో 11 మంది పోస్టు గ్రాడ్యుయేషన్, ఇద్దరు డాక్టరేట్ చేసిన వారు ఉన్నారు. లోక్‌సభ అభ్యర్థుల్లో సింహాద్రి చంద్రశేఖర రావు, గూడురి శ్రీనివాసులు, మద్దుల గురుమూర్తి, పి.అనిల్‌కుమార్ యాదవ్‌లు డాక్టర్లు కాగా.. నలుగురు లాయర్లు, చార్టెడ్ అకౌంటెంట్(వి.విజయ సాయిరెడ్డి), ఒక మెడికల్ ప్రాక్టిషనర్ ఉన్నారు.

స్థానిక సంస్థల ప్రతినిధులకు అవకాశం

ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న పలువురికి వైఎస్సార్‌సీపీ టికెట్లు కేటాయించింది. మేయర్లు, జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కార్యకర్తల్లో 13 మందికి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీకి అవకాశం కల్పించింది. కర్నూలు మేయర్ బీవై రామయ్యకు కర్నూలు ఎంపీగా, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడుకి చిలకలూరిపేట ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. శ్రీకాకుళం జెడ్పీ చైర్మన్ పిరియ విజయకు ఇచ్ఛాపురం నుంచి అవకాశం కల్పించారు. సాధారణ కార్యకర్తలు లక్కప్ప, వీరాంజనేయులుకు మడకశిర, శింగనమల నుంచి పోటీకి అవకాశం కల్పించారు. పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేసిన గూడూరి ఉమాబాలకు నరసాపురం ఎంపీ సీటు కేటాయించారు. కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి రాజంపేట్ అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్నారు. జెడ్పీటీసీ సర్నల తిరుపతిరావుకు మైలవరం టికెట్ కేటాయించారు. వైఎస్సార్‌సీపీ నేత బలసాని కిరణ్‌కుమార్ ప్రత్తిపాడు నుంచి, గృహిణి మురుగుడు లావణ్య మంగళగిరి నుంచి పోటీపడుతున్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తిరుపతి నుంచి, నెల్లూరు సిటీ డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ నెల్లూరు నుంచి, జెడ్పీటీసీ బూసినే విరూపాక్ష ఆలూరు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఇదీ సామాజిక న్యాయం

చేతల్లో చూపిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- అభ్యర్థుల ప్రకటన సందర్భంగా సీఎం వైఎస్ జగన్
- ఐదేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు • మహిళా సాధికారతకు బాసట
- నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు
- 50 శాతం సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే
- బీసీలకు 48 ఎమ్మెల్యే, 11 ఎంపీ స్థానాలు • 7 సీట్లు ముస్లిం మైనార్టీలకు కేటాయింపు
- 12 శాతం సీట్లు మహిళలకు కేటాయింపు • 77 శాతం అభ్యర్థులు గ్రాడ్యుయేట్లు
- ఈ మార్పులన్నింటి వల్ల 2–3 నెలల్లో మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం



వైఎస్సార్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: సామాజిక న్యాయం అనేది మాటలకే పరిమితం కాదని, మొట్టమొదటిసారిగా సాధ్యమే అని ఆచరించి చూపిన చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ ఐదేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో శనివారం దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్ ఎంపీ అభ్యర్థులను, రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ మాట్లాడారు. ఒక్క అనకాపల్లి పార్లమెంట్ స్థానం మినహా 25 ఎంపీ, 175 అసెంబ్లీ సీట్లు కేటాయించామని చెప్పారు. 50 శాతం సీట్లను కచ్చితంగా నా.. నా.. నా.. అని సంబోధిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కచ్చితంగా అమలయ్యేలా ఏకంగా చట్టం చేసిన ప్రభుత్వం మనదన్నారు. ఇది నామినేటెడ్ పదవుల్లోనూ, నామినేషన్‌పై ఇచ్చే కాంట్రాక్టుల్లోనూ అమలు చేశామని చెప్పారు. దాన్ని మనస్ఫూర్తిగా... స్ఫూర్తిగా తీసుకుంటూ ఈ రోజు 50 శాతం అంటే 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలు.. మొత్తం 200 స్థానాలకు గాను 100 స్థానాల్లో ఈ వర్గాల వారికే సీట్లు ఇవ్వగలగడం చరిత్రలో ఎప్పుడూ కనీవినీ ఎరుగని ఘట్టం అని తెలిపారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఆ ధైర్యం

ఈ ఎన్నికల్లో దాదాపు 81 స్థానాల్లో ఎమ్మెల్యేల మార్పు, 18 ఎంపీ స్థానాల్లో మార్పులు చేశాం. దాదాపు 99 స్థానాలు అంటే 50 శాతం స్థానాల్లో మార్పులు చేశాం. ఇది కూడా చరిత్రలో నిలిచిపోయే ఘట్టమే. ఈ స్థాయిలో మార్పులు చేయగలిగిన ధైర్యం ఎవరికీ ఉండకపోవచ్చేమో. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఈ ధైర్యం ఉందని, ప్రజల మీద ఆ మేరకు నమ్మకం ఉందని కూడా చెప్పడానికి సంతోషిస్తున్నాం. రాబోయే రోజుల్లో దేవుడి దయతో, ప్రజలందరి ఆశీస్సులతో మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టికెట్ రాని వాళ్లందరికీ సముచిత స్థానం ఇస్తూ ఏదో ఒక రూపంలో దగ్గరకు తీసుకునే కార్యక్రమం కచ్చితంగా జరుగుతుందని భరోసా ఇస్తున్నా.

విప్లవాత్మక మార్పులు..

కనీవినీ ఎరుగని విప్లవాత్మక మార్పులతో ఐదేళ్ల పాలన సాగింది. రూ.2.70 లక్షల కోట్లు నేరుగా బటన్ నొక్కడం ద్వారా ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లింది. ఇలా రాష్ట్ర చరిత్రలో ఇదివరకెన్నడూ చూడలేదు. ఎప్పుడూ జరగని ఘట్టం. లంచాలు లేకుండా ఇవ్వడం సాధ్యమేనా? వివక్ష లేకుండా ఇవ్వగలుగుతారా? అనే పరిస్థితి నుంచి.. ఇది సాధ్యమే అని ఐదేళ్ల పరిపాలనలో చూపించాం. గ్రామ స్థాయిలో గ్రామ సచివాలయాలు, 50–60 ఇళ్లకు ఒక వలంటీర్ వ్యవస్థ తీసుకుని రావడం, వీటన్నిటి ద్వారా పారదర్శకత, లంచాలు లేని వ్యవస్థ, వివక్షకు చోటు లేని వ్యవస్థ ద్వారా రూ.2.70 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి వెయ్యడం అనేది దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయంగా గుర్తుండిపోతుంది. గ్రామాలు మారాయి, గ్రామాల్లో పరిస్థితులు మారాయి, స్కూళ్లు, ఆస్పత్రులు బాగుపడ్డాయి.. ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయం బాగు పడింది. మహిళా సాధికారత సాధ్యమైంది. సామాజిక న్యాయం అన్నది మాటలకు కాదు.. మొట్టమొదటిసారిగా సాధ్యమే అని చేసి చూపించిన ప్రభుత్వంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడగలిగిందని చెప్పడానికి గర్వపడుతున్నా. వీటన్నింటి వల్ల ప్రస్ఫుటమైన మార్పులు ప్రతి గ్రామంలో కనిపిస్తున్నాయి. ఈ మార్పులన్నింటి వల్ల దేవుడి ఆశీస్సులతో మళ్లీ 2–3 నెలల్లో కచ్చితంగా ప్రమాణ స్వీకారం చేస్తాం. ఈ సందర్భంగా సామాజిక న్యాయం అన్నది ఇంకా గొప్ప స్థాయిలోకి తీసుకుపోయేలా అడుగులు వేస్తాం.



సీఎం జగన్ సమక్షంలో అభ్యర్థులను ప్రకటిస్తున్న, మంత్రి ధర్మాన, ఎంపీ నందిగం సురేష్

59 స్థానాలు బీసీ అభ్యర్థులకే..

మొత్తం 200 స్థానాల్లో ఏకంగా 59 స్థానాలు బీసీలకే కేటాయించాం. 175 అసెంబ్లీ స్థానాలకు 48 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలకు 11 స్థానాలు వీరికి కేటాయించాం. మహిళలకు ఇంతకు ముందుకన్నా బెటర్‌గా చేశాం. ఇది కూడా నాకు సంతృప్తిని కలిగించడం లేదు. వచ్చే ఎన్నికలకి ఇంకా వేగంగా అడుగులు వేయించే కార్యక్రమం చేస్తున్నాం. 200 స్థానాలకు 24 స్థానాలు అంటే 12 శాతం అక్కచెల్లెమ్మలకు ఇవ్వగలిగాం. ఇది పూర్తిగా సంతృప్తి కలిగించే అంశం కాకపోయినప్పటికీ లాస్ట్ టైమ్ కన్నా బెటర్‌గా చేశాం. బహుశా ఏ ఇతర పార్టీ కన్నా బెటర్‌గానే ఉంటుందనుకుంటున్నాం. గతంలో 19 సీట్లు ఇస్తే ఈసారి 24దాకా తీసుకుపోగలిగాం. ఇది కూడా ఒక విశేషమే. వచ్చే ఎన్నికలకి ఇంకా పెద్ద సంఖ్యలో ఇచ్చేలా అడుగులు ముందుకు వేస్తాం. ఇవాళ విడుదల చేసిన జాబితా 200 మందిలో 77 శాతం మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు.. గ్రాడ్యుయేట్లు, ఆపై చదువులు చదివిన వారు. ఎమ్మెల్యేలకు సంబంధించి 175 మందిలో 75 శాతం గ్రాడ్యుయేట్లు, ఆపై చదువులు చదివిన వారిని మనం ఎంపిక చేశాం. మైనార్టీలకు ఇంతకు ముందు 5 స్థానాలిస్తే ఇవాళ 7 స్థానాలకు పెంచగలిగాం. మొత్తం మీద 50 శాతం నా.. నా.. నా.. అని పిలుచుకుంటూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇవ్వడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టం.

సగర్వంగా ఎగిరిన సామాజిక జెండా

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో 175 శాసనసభ, 25 లోక్‌సభ మొత్తం 200 స్థానాలకుగాను సరిగ్గా సగం అంటే 100 స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యర్థులను బరిలోకి దించుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ సామాజిక న్యాయ పతాకాన్ని ఎగరేశారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. గత ఎన్నికల తరహాలోనే శనివారం వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని మహానేత వైఎస్సార్ సమాధి వద్ద నివాళులు అర్పించిన సీఎం జగన్.. మంత్రి ధర్మాన, ఎంపీ నందిగం సురేష్‌లతో ఒకేసారి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటింపజేశారు.

సామాజిక మహా విప్లవం

➡ నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ ఆ వర్గాలను అక్కున చేర్చుకుంటూ వారి సాధికారతకు బాటలు వేసిన సీఎం జగన్.. సార్వత్రిక ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాలకుగాను 29 స్థానాల్లో ఎస్సీ, 7 స్థానాల్లో ఎస్టీ, 48 స్థానాల్లో బీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులను బరిలోకి దించారు. మొత్తం 84 శాసనసభ స్థానాలను ఆ వర్గాలకు కేటాయించారు. ఇందులో 7 స్థానాల్లో మైనార్టీలకు, మొత్తంగా మహిళలకు 19 స్థానాల్లో అవకాశం ఇచ్చారు. గత ఎన్నికల్లో ఎస్సీలకు 29, ఎస్టీలకు 7, బీసీలకు 41 స్థానాలు వెరసి ఆ వర్గాలకు 77 స్థానాలను కేటాయించారు. వీటిని పరిశీలిస్తే గత ఎన్నికల కంటే ఇప్పుడు 7 స్థానాలు అధికంగా ఆ వర్గాలకు కేటాయించారు. గత ఎన్నికల కంటే ఇప్పుడు మహిళలకు అదనంగా 4 స్థానాలు, మైనార్టీలకు అదనంగా 2 స్థానాలు కేటాయించారు.

➡ 25 ఎంపీ స్థానాలకుగాను 4 స్థానాల్లో ఎస్సీ, ఒక స్థానంలో ఎస్టీ, 11 స్థానాల్లో బీసీ వర్గాలకు చెందిన వారిని అభ్యర్థులుగా ఎంపిక చేశారు. అంటే.. మొత్తం 16 లోక్‌సభ స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించినట్లు స్పష్టమవుతోంది. గత ఎన్నికల్లో ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, బీసీలకు ఏడు వెరసి 12 స్థానాలను ఆ వర్గాలకు కేటాయించారు. వీటిని పరిశీలిస్తే గత ఎన్నికల కంటే ఇప్పుడు ఆ వర్గాలకు అదనంగా 4 స్థానాలు కేటాయించారు. గత ఎన్నికల్లో లోక్‌సభ అభ్యర్థినులుగా 4 చోట్ల మహిళలకు అవకాశం కల్పిస్తే.. ఇప్పుడు 5 స్థానాలను కేటాయించారు. కాగా, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓసీలకు 91(వైశ్య 3, బ్రాహ్మణ 1, బలిజ 1, క్షత్రియ 5, వెలమ 1, కమ్మ 9, కాపు 22, రెడ్డి 49) సీట్లు, లోక్‌సభ స్థానాల్లో ఓసీలకు 9(కాపు 3, కమ్మ 1, రెడ్డి 5) స్థానాల్లో అవకాశం కల్పించారు.

చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవులు ఇచ్చిన తరహాలోనే..


మంత్రివర్గం కూర్పుతోనే సామాజిక న్యాయానికి నాంది పలికిన సీఎం జగన్.. కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, మహిళలకు పెద్దపీట వేసి, పరిపాలనలో భాగస్వామ్యం కల్పిస్తూ సామాజిక విప్లవాన్ని ఆవిష్కరించారు. నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో 50 శాతం రిజర్వేషన్ చేస్తూ చట్టం చేయడం దేశ చరిత్రలోనే ప్రథమం. నా నా అంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు.. మహిళలకు పదవులు, పనులు ఇచ్చారు. ఇప్పుడు 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలు కలిపి 200 స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి 50 శాతం కేటాయించి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించారు. దేశ చరిత్రలో ఎన్నడూ కనివిని ఎరుగని రీతిలో సీఎం జగన్ సామాజిక న్యాయం చేశారని రాజకీయ పరిశీలకులు ప్రశంసిస్తున్నారు.


చంద్రబాబు, పవన్ సామాజిక ద్రోహం


సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోవడానికి చంద్రబాబు భయపడి జనసేనతో జట్టుకట్టారు. అయినా ఘోర పరాజయం తప్పదని గ్రహించి.. అవినీతి కేసుల నుంచి బయటపడొచ్చనే వ్యూహంతో బీజేపీ పెద్దల కాళ్లావేళ్లాపడి వార్డితో పొత్తు పెట్టుకుని జనసేనకు 21, బీజేపీకి పది శాసనసభ స్థానాలు కేటాయించారు. 144 స్థానాల్లో టీడీపీ పోటీ చేసేలా లెక్క తేల్చారు. ఈ కూటమి ఇప్పటి దాకా 135 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేస్తే అందులో బీసీలు కేవలం 25 (టీడీపీ 24, జనసేన 1) మంది, మైనార్టీలు కేవలం ముగ్గురే ఉండటం గమనార్హం. ఆ మూడు పార్టీలు ఖరారు చేయాల్సిన స్థానాలు ఇంకా 40 మాత్రమే మిగిలాయి. వాటిలో ఒకట్రెండు స్థానాలు మాత్రమే బీసీలకు కేటాయించే అవకాశం ఉంది. దీన్ని బట్టి చూస్తే చంద్రబాబు, పవన్ మరోసారి బీసీలకు వెన్నుపోటు పొడిచి, ఆ వర్గాలకు ద్రోహం చేసినట్లు స్పష్టమవుతోంది.


అన్ని వర్గాలకు ఊతం.. అందుకే గెలుపు ఖాయం


గత 58 నెలలుగా అర్హతే ప్రామాణికంగా.. వివక్ష, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో అన్ని వర్గాల పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లను సీఎం జగన్ జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్లు.. వెరసి రూ.4.49 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చడం ద్వారా అన్ని వర్గాల పేదల అభివృద్ధికి ఊతమిచ్చారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక మార్పులతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటే.. అందులో 2.13 లక్షల ఉద్యోగులను గత 58 నెలల్లోనే నియమించారు. గత 58 నెలల పాలనలో ప్రతి ఇంట్లో ప్రతి గ్రామంలో, ప్రతి నియోజకవర్గంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నాయి. మీ బిడ్డ పాలనలో మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డను ఆశీర్వదించండి అంటూ వినమ్రంగా కోరుతూ సార్వత్రిక ఎన్నికల్లో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా సీఎం జగన్ సమర భేరి మోగించారు. ఇందులో భాగంగా భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలు ఒకదానికి మించి మరొకటి విజయవంతమయ్యాయి. టీడీపీ–జనసేన తొలిసారిగా తాడేపల్లిగూడెంలో ఉమ్మడిగా నిర్వహించిన జెండా సభ జనం లేక అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్–మాట్రిజ్ వంటి దజనుకుపైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థల సర్వేలు తేల్చి చెబుతున్న నేపథ్యంలో ఎన్నికల్లో జగన్ ఎగరేసిన సామాజిక న్యాయ పతాకం రెపరెపలాడటం ఖాయమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.











క్లుప్తంగా...

బడుగు, బలహీనవర్గాలకు సీఎం జగన్ పెద్దపీట

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలబడిన ఒకే ఒక్క సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆయన శనివారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50శాతానికి పైగా సీట్లు ప్రకటించి సీఎం జగన్ ఆయా వర్గాలపై తనకున్న ప్రేమాభిమానాలను చాటుకున్నారని చెప్పారు. బీసీ ముఖ్యమంత్రులు ఉన్న రాష్ట్రాల్లో కూడా బీసీలకు ఏపీలో మాదిరిగా న్యాయం చేయలేకపోయారన్నారు. కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే సామాజికన్యాయం జరిగిందని స్పష్టంచేశారు. తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఏలూరు ఎంపీ అభ్యర్థిగా తన కుమారుడు కారుమూరి సునీల్‌కుమార్‌కు అవకాశం ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తన తుదిశ్వాస వరకు రుణపడి ఉంటానని ఆయన చెప్పారు. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు అహర్నిశలూ శ్రమిస్తానని తెలిపారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలతోపాటు తమను పార్టీ శ్రేణులు, తణుకు నియోజకవర్గ ప్రజలు, అక్కచెల్లెమ్మలు గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తారని కారుమూరి చెప్పారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా వెంకటలక్ష్మి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తానని చెప్పారు. చైర్‌పర్సన్‌గా నియమితులైన వెంకటలక్ష్మి మంగళగిరిలోని మహిళా కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సాధికారత, భద్రత, మహిళాభ్యున్నతికి పాటుపడతానన్నారు.

బాబు జిమ్మిక్కులను జనం నమ్మరు

- ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



సాక్షి, అమరావతి: చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలు నమ్మబోరని, ఈ ఎన్నికల్లో మరోసారి ఆయనకు ఘోర ఓటమి తప్పదని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకుని వచ్చినా, ఎన్ని హామీలు ఇచ్చినా, లోపాయికారి సర్వేలు చేయించుకున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 2014 ఎన్నికల్లో 600కు పైగా హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, వాటిలో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ చెప్పాడంటే.. చేస్తాడంతే.. అనే నమ్మకాన్ని ప్రజల్లో పొందారని తెలిపారు. అంబేడ్కర్, పూలే వంటి మహనీయుల స్ఫూర్తితో పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి జనం సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు.

బొండా ఉమాపై కేసు నమోదు



అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడసెంట్రల్): తన కుమారుడి మృతిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఆయన అనుచరులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇటీవల మరణించిన నగరంలోని రామకృష్ణాపురానికి చెందిన యువకుడు కై కాల శరణ్ తల్లి అంజలీదేవి శనివారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడు గుండెపోటుతో మృతిచెందాడని ఆమె తెలిపారు. తన కుమారుడి మృతికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే వెలంపల్లి శ్రీనివాసరావు ఒత్తిడి చేయటం వల్ల తన కుమారుడు మృతిచెందాడని బొండా ఉమా, ఆయన అనుచరులు స్థానికంగా, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తమ స్వార్థం కోసం కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించారని పేర్కొన్నారు. తన కుమారుడి మృతిపై తప్పుడు ప్రచారం చేయడంతోపాటు తమ మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రవర్తించిన బొండా ఉమా, బేతు రామ్మోహన్‌రావు, ఆల తారక రామారావు, పైడి శ్రీను, చలమలశెట్టి శ్రీను, హనుమంతరావు, విజయ్‌కుమార్‌లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమె తన ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పవన్.. ఆ ఐదేళ్లూ ఏ మడుగులో దాక్కున్నావు..?

- ఉద్యమం కోసం ఒక్క సానుభూతి లేఖ అయినా రాశావా?
- ఏ పార్టీలోకి వెళ్లాలనేది చెప్పడానికి మీరెవరు?
- సినిమా వాళ్లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- భూస్థాపితం అయిన టీడీపీ గ్రాఫ్ పెంచావు
- పవన్ సినిమాల్లో హీరో అయితే నేను రాజకీయాల్లో హీరోని
- రెండేళ్లు సీఎం పదవి, 70–80 సీట్లయినా అడగాలి కదా..
- కేవలం 21 సీట్లతో ఏం చేద్దామని?
- 30 ఏళ్లు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఖాయం
- జనసేన అధినేత పవన్‌పై కాపు ఉద్యమ నేత ముద్రగడ ఫైర్



మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పవన్‌కళ్యాణ్ ఏ మడుగులో దాక్కున్నారని మాజీమంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ప్రశ్నించారు. తనకు వృద్ధాప్యం వచ్చేసిందనుకున్నప్పుడు ఉద్యమం కోసం ఆయనెందుకు రోడ్డుపైకి రాలేదన్నారు. కాపుల రిజర్వేషన్ కోసం పోరాడుతున్నప్పుడు ఒక్కసారి కూడా పవన్ సానుభూతి లేఖ రాయలేదన్నారు. ఆ ఐదేళ్లూ ఎక్కడున్నారో పవన్ చెప్పాలి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరి తిరిగి వచ్చిన ముద్రగడ కాకినాడ జిల్లా కిర్లంపూడిలో శనివారం మీడియాతో మాట్లాడారు. కాపు జాతిని, తన కుటుంబాన్ని లాఠీలతో కొట్టినప్పుడు, బూటు కాలితో తన్నినప్పుడు, రోడ్డు మీదకు ఈడ్చినప్పుడు కలుగులో దాక్కున్నారా అని పవన్‌ను ముద్రగడ ప్రశ్నించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

నేను ఏ పార్టీలోకి వెళ్లాలో మీరు చెప్తారా? కాపు ఉద్యమం కోసం పోరాడుతున్న నన్ను, నా కుటుంబాన్ని 14రోజులపాటు ఆసుపత్రిపాల్జేసి, చంద్రబాబు చిత్రహింసలకు గురిచేశారు. మా కుటుంబమంతా ఆత్మహత్యే శరణ్యం అనే స్థితిలోకి తీసుకెళ్లాడు. చంద్రబాబు పతనం చూడాలనే అప్పటి నుంచీ మా కుటుంబం ఏ పండగలూ చేసుకోలేదు. 2019లో ఆయన్ను ప్రజలు సాగనంపడంతో చంద్రగ్రహణం వీడింది. ప్రజలకు దేశ చరిత్రలో ఎవ్వరూ చేయనంత మేలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారు. ఆయన 30 సంవత్సరాలు సీఎంగా ఉంటారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలుపొందుతుంది. ఇక ముందు కూడా సంక్షేమ పథకాలు అమలుచేయడం ద్వారా నిరుపేదలకు మరింత మేలు చేయాలని కోరుకుంటున్నా.

వైఎస్సార్‌సీపీని గెలిపించడమే నా కోరిక..

సీఎం వైఎస్ జగన్ పిలుపుతో వైఎస్సార్‌సీపీలో చేరడం ఆనందంగా ఉంది. ఎంపీ, ఎమ్మెల్యే సీటు ఆశించకుండా పార్టీకి సేవ చేయడానికి చేరాను. పార్టీని గెలిపించి, మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రి పీఠంపై జగన్‌మోహన్‌రెడ్డిని కూర్చోబెట్టాలనేదే నా కోరిక. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏ పదవిచ్చినా తీసుకుంటా. నేను ఏ పార్టీలోకి వెళ్లాలనే దానిపై ఎవరి అభిప్రాయం తీసుకోవాల్సిన అవసరంలేదు. పవన్ సినిమాలో హీరో అయితే నేను రాజకీయాల్లో హీరోని. ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా వాళ్లను ప్రజలు నమ్మే అవకాశంలేదు. గతంలో ఒక్క ఎన్టీఆర్, తమిళనాడులో ఎంజీఆర్‌లను మాత్రమే నమ్మారు.

బీజేపీ కూడా ఆహ్వానించింది..

ఇదిలా ఉంటే.. చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు టీడీపీ గ్రాఫ్ పూర్తిగా పడిపోయి భూ స్థాపితం అయిపోయింది. ఆ సమయంలో పవన్‌కళ్యాణ్ జైలుకెళ్లి బాబుకి భరోసా ఇచ్చాక టీడీపీ గ్రాఫ్ పెరిగింది. ఇందుకు కృతజ్ఞతగా చంద్రబాబు పవన్‌కు రెండేళ్లు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాల్సి ఉన్నా అది చేయలేదు. పవన్ అయినా అడగాలి కదా.. మరోవైపు.. మిథున్‌రెడ్డి మా ఇంటికి వస్తున్నారని తెలిసి బీజేపీ నన్ను ఆహ్వానించింది. దీంతో నేను స్టీల్‌ప్లాంటును ప్రభుత్వపరం చేయడం, కేంద్ర ప్రభుత్వమే పోలవరం ప్రాజెక్టును చేపట్టడం, ప్రత్యేక హోదాను అడిగాను. అంతేకాక.. రాష్ట్రంలోని 175 స్థానాల్లో పోటీచేస్తే బీజేపీ విజయానికి కృషిచేస్తానని కూడా చెప్పాను. మరోవైపు.. విశాఖ ఉక్కు ఉద్యమ సందర్భంగా తమనంపల్లి అమృతరావు ఆమరణ దీక్ష చేస్తున్నప్పుడు అప్పట్లో స్వతంత్ర ఎమ్మెల్యే అయిన మా నాన్న ఆ దీక్షలో ఒకరోజు కూర్చున్నారు. ఇలా ఎప్పటి నుంచో మా కుటుంబం రాజకీయాల్లో ఉంది. అది తెలుసుకుని అనవసర పోస్టింగులు ఆపాలి. ఈ సమావేశంలో ముద్రగడ గిరిబాబు, గణేశుల రాంబాబు, గణేశుల లచ్చబాబు పాల్గొన్నారు.

పవన్ నన్ను తీవ్రంగా అవమానించారు..

ముఖ్యమంత్రి దగ్గరకు ఎందుకు వెళ్లారు.. మా నాయకుడి వద్దకు ఎందుకు రాలేదని సోషల్ మీడియాలో నాపై విమర్శలు చేస్తున్నారు. సీఎం జగన్ కుటుంబానికి ఒక చరిత్ర ఉంది. ఆయన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, ముఖ్యమంత్రిగా చేశారు. జగన్ ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేసి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీఎం జగన్ పార్టీ పెద్దలను నా ఇంటికి పంపించి ఆహ్వానించడంతో నేను సంతోషంగా అంగీకరించి, వైఎస్సార్‌సీపీలో చేరాను. అంతకుముందు.. జనసేన పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాస్ మా ఇంటికొచ్చి జనవరి 10 దాటిన తరువాత పవన్ వస్తారని చెప్పారు. ఆ సమయంలో వారికి 70–80 సీట్లు, రెండేళ్లు సీఎం పదవి అడగాల్సిందిగా చెప్పాను. ఆ తర్వాత పవన్ రాకుండా నన్ను తీవ్రంగా అవమానించారు. తీరా 21 సీట్లు తీసుకుంటే ఇక నేనెందుకు సాయం చేయడం?

ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉన్నాం

వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్‌కు వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి నగరంలోని డీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా వద్దని, ప్యాకేజీ కావాలని అడిగిన చంద్రబాబు ఏపీకి తీవ్ర అన్యాయం చేశారన్నారు. నెల్లూరు పార్లమెంటరీ పరిధిలో దేశంలోనే మిన్నగా ప్రత్యేక ప్రణాళికతో మేనిఫెస్టో తయారు చేస్తున్నట్టు తెలిపారు. నగరంలో ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు కృష్ణపట్నం పోర్టుతో సమాంతరంగా రామాయపట్నం పోర్టును అభివృద్ధి చేసుకుని వాటితో పాటు దగదర్తి ఎయిర్‌పోర్టును పటిష్టంగా, వేగవంతంగా నిర్మించుకుని కార్గో రవాణాను మరింత అభివృద్ధి చేసి జిల్లాను తలసరి ఆదాయంలో అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. జిల్లాలో పచ్చదనం విరాజిల్లేలా ఏడాది పొడవునా రోడ్లకు ఇరువైపులా చెట్లకు ప్రత్యేక నీటి వసతి కల్పించేలా పథకాలు రూపొందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి బయటకుపోయిన వారి విమర్శల్ని ప్రజలు మన్నించరన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ద్రోహం చేసిన వారికి రాజకీయ భవిష్యత్ ఉండదన్నారు. 2029 ఎన్నికల్లో ప్రతి ముగ్గురిలో ఒక మహిళకు చట్టసభలో స్థానం ఇచ్చేలా తమ నాయకుడు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, విజయా డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల సంగ్రామంలో పేదలదే విజయం

1,266వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు




రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పేదలకు, పెత్తందారులకు మధ్య జరగబోతున్న ఎన్నికల సంగ్రామంలో పేదలనే విజయం వరిస్తుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధీమా వ్యక్తంచేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 1,266వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ కులవాదులంతా చేరి అమరావతే ఏకైక రాజధాని అంటూ రూ.400 కోట్లు ఎన్ఆర్ఐలు, బాబు అండ్ కో పెట్టుబడులు పెట్టి నడిపించిన హైటెక్ ఉద్యమం ఇప్పటికే చతికిలపడి పత్తా లేకుండా పోయిందన్నారు. బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి అమరావతిలోని అవినీతి అనకొండల బాగోతాన్ని ప్రజలకు తెలియజేస్తామన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, బేతపూడి రాజేంద్ర, పెద్దింటి విజయ్, బి.సలోమీ, పులి దాసు, కుమ్మరవల్లి కిషోర్‌బాబు, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజు, బి.సౌమ్య, పల్లె బాబు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దుచేస్తాం

టీడీపీ లీగల్ సెల్ సదస్సులో చంద్రబాబు



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ రావడంతో రాష్ట్ర ప్రజలు స్వాతంత్ర్యం వచ్చినంత ఆనందంగా పండుగ చేసుకుంటున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. విజయవాడలో శనివారం టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు రాబోతున్నాయని చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఎందుకు తెచ్చారో తనకు అర్థంకావడంలేదని.. అధికారంలోకి వచ్చాక దానిని రద్దుచేస్తామన్నారు. అలాగే, న్యాయమిత్ర పేరుతో జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.7వేలు గౌరవ వేతనం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. లా నేస్తం పేరుతో జగన్ కేవలం 2,670 మందికే గౌరవ వేతనం ఇస్తున్నారని.. తమ ప్రభుత్వం వచ్చాక దానిని 3,500 మంది దాకా పెంచుతామన్నారు.

టీడీపీలో చేరిన 'మాగుంట'..

మరోవైపు.. ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాచిన గరటయ్య, బాచిన కృష్ణచైతన్య, కావలి మాజీ ఎమ్మెల్యే ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డి తదతరులు టీడీపీలో చేరారు. తన నివాసంలో చంద్రబాబు వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బాబుపై తిరుగుబావుటా

- టీడీపీలో చల్లారని టికెట్ మంటలు
- చంద్రబాబు బుజ్జగించినా ససేమిరా అంటూ పోటీకి సిద్ధం
- తనకి తప్ప ఎవరికీ సీటిచ్చినా ఓడిస్తానంటున్న బోడె ప్రసాద్
- త్రిశంకు స్వర్గంలో కళా వెంకట్రావు, గంటా, బండారు
- అమలాపురంలో జనసేన నాయకుడు ఆత్మహత్యాయత్నం



వెన్నలపాలెంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో ధర్నా చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: టీడీపీ టికెట్ల మంటలు ఇప్పట్లో చల్లారేలా లేవు. టికెట్లు రాని టీడీపీ సీనియర్లు రగిలిపోతున్నారు. చంద్రబాబుపై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. పొత్తులు, సామాజిక సమీకరణాల పేరుతో తమ గొంతు కోశారని మండిపడుతున్నారు. పలు నియోజకవర్గాల్లో ఆందోళనలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. చంద్రబాబు తన వద్దకు పిలిపించుకుని బుజ్జగించినా వారు వినడంలేదు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మాజీ ఎమ్మెల్యే కలవపూడి శివరామరాజు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనకు సర్దిచెప్పేందుకు టీడీపీ ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. కృష్ణా జిల్లా పెడన సీటును ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో ఉన్న మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్ తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. ఉత్తరాంధ్రలో కళా వెంకట్రావు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తిలు సీటు దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పెందుర్తి సీటును జనసేనకు కేటాయించడాన్ని తప్పుపడుతూ బండారు సత్యనారాయణమూర్తి ఎవరికీ అందుబాటులోకి లేకుండాపోయారు. ఎచ్చెర్ల సీటును కళా వెంకట్రావుకు ఇవ్వడానికి అంగీకరించకపోవడంతో ఆయన భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. గంటా శ్రీనివాసరావు అడుగుతున్న సీటును ఇవ్వకపోవడంతో ఆయన ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు. కళా వెంకట్రావు, గంటాను విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని చంద్రబాబు చెప్పగా.. ఆ సీటు ఆశిస్తున్న కిమిడి నాగార్జున అసంతృప్తితో రగిలిపోతున్నారు.

మైలవరం, పెనమలూరులో తేలని పంచాయితీ

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పెనమలూరు, మైలవరం సీట్లు కాకరేపుతున్నాయి. పెనమలూరు సీటు ఇవ్వడంలేదని చెప్పడంతో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు ప్రచారం కూడా ప్రారంభించారు. ఆ సీటు దేవినేనికి ఇస్తారని ప్రచారం జరుగుతుండడంతో ఆయన మండిపడుతున్నారు. మైలవరం వసంత కృష్ణప్రసాద్‌కి ఇస్తానని చెప్పినా ఖరారు చేయకపోవడం, దేవినేని, వసంత మధ్య పోటీ పెట్టడంతో అక్కడ గందరగోళం నెలకొంది. అనంతపురం జిల్లా ధర్మవరం సీటును బీజేపీకి ఇవ్వడాన్ని పరిటాల శ్రీరామ్ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. వరదాపురం సూరికి తన సీటు ఇవ్వడాన్ని శ్రీరామ్ తప్పుపడుతున్నారు.

టీడీపీ, జనసేన మధ్య తేలని పంచాయితీ

అమలాపురం నియోజకవర్గంలో టీడీపీ–జనసేన మధ్య వివాదం రోడ్డున పడింది. టికెట్ జనసేనకే ఇవ్వాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు రెండు రోజులుగా అమలాపురంలో ఆందోళన చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా అయితాబత్తుల ఆనందరావు, మాజీ ఎంపీ బుచ్చి మహేశ్వరరావు కుమార్తె పాము సత్యశ్రీ పేరుపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. మరోవైపు సీటు తమకే ఇవ్వాలంటూ జనసేన నేతలు, కార్యకర్తలు అమలాపురంలో రోడ్డెక్కారు. అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో జరిగిన ధర్నాలో పార్టీ అల్లవరం మండల అధ్యక్షుడు బాలయోగి ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అప్రమత్తమైన తోటి నాయకులు, కార్యకర్తలు బాలయోగిని అడ్డుకున్నారు.



అమలాపురంలో పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న జనసేన నేత

రాజోలులో రోడ్డెక్కిన జనసేన

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో జనసేన పార్టీ శనివారం రోడ్డెక్కింది. పార్టీ టికెట్ దేవ వరప్రసాద్‌కు ఇస్తారనే ప్రచారంతో ఆందోళన నిర్వహించారు. స్థానికుడు కాని వరప్రసాద్‌కు టికెట్టు ఇస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. బొంతు రాజేశ్వరరావుకే టికెట్టు ఇవ్వాలని నినాదాలు చేశారు. పార్టీ నాయకులు మలికిపురం కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు.

బండారుకు టికెట్ ఇవ్వాల్సిందే..

పెందుర్తి టికెట్‌ను టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించాలని పార్టీ కార్యకర్తలు శనివారం వెన్నలపాలెంలో నిరసన చేపట్టారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద బండారుకు అనుకూలంగా నినాదాలు చేశారు.

గౌరవం లేని చోట ఉండను

గౌరవం లేనిచోటు ఉండకూడదని నిర్ణయించుకున్నానని, అవమానాల మీద అవమానాలు భరించలేనని సూళ్లూరుపేట టీడీపీ నేత వేనాటి రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో లోకేశ్ జోక్యం పెరిగాక తన సొంత సామాజికవర్గాన్ని పెంచుకునేందుకు తమను అవమానాలకు గురి చేస్తున్నారని అన్నారు. శనివారం సూళ్లూరుపేట టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 42 ఏళ్లుగా టీడీపీకి సేవచేశామన్నారు. టీడీపీలో కులపిచ్చి పెరగడం వల్ల ఇమడలేని పరిస్థితుల్లో పార్టీని వీడుతున్నట్లు చెప్పారు.

గుమ్మనూరుకు టికెట్ ఇస్తే సహించేది లేదు: జితేంద్రగౌడ్



మాట్లాడుతున్న జితేంద్రగౌడ్

ఎక్కడి నుంచో వచ్చి నియోజకవర్గంలో పెత్తనం చెలాయిస్తామంటే సహించబోమని, మాజీ మంత్రి గుమ్మనూరుకు టికెట్ ఇస్తే ఊరుకునేది లేదని అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ హెచ్చరించారు. శనివారం గుంతకల్లులో మాట్లాడుతూ.. ఈ ఐదేళ్లు టీడీపీ కోసం కష్టపడ్డామని, ఇందుకు గుర్తింపుగా గుంతకల్లు అసెంబ్లీ టికెట్ ఇస్తారన్న ఆశాభావంతో ఉన్నానన్నారు.

చేనేతలకు అన్యాయం: నిమ్మల



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప

చేనేతలకు సీట్ల కేటాయింపులో చంద్రబాబు అన్యాయం చేశారని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లలో హిందూపురం పార్లమెంట్ పరిధిలోని పలు మండలాలకు చెందిన టీడీపీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. నిమ్మలకు టికెట్ నిరాకరించడాన్ని నాయకులు తప్పుబట్టారు. టికెట్ ఇవ్వని పక్షంలో పార్టీకి రాజీనామా చేసి.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కోరారు.

ప్రస్తుతం టీడీపీ లోఫర్‌గాళ్లతో నిండిపోయింది

- ఇప్పుడు టీడీపీలో ఎన్టీఆర్ ఐడియాలజీ లేదు
- ఎవరెన్ని కూటములు కట్టినా, కుట్రలు చేసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభంజనం ఖాయం
- విజయవాడ ఎంపీ కేశినేని నాని



విజయవాడ స్పోర్ట్స్: చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రస్తుతం లోఫర్‌గాళ్లతో నిండిపోయిందని విజయవాడ ఎంపీ కేశినేని నాని ధ్వజమెత్తారు. ఎవరెన్ని కూటములు కట్టినా, కుట్రలు, కుతంత్రాలు చేసినా రాష్ట్రంలో మరోసారి సీఎం వైఎస్ జగన్ ప్రభంజనం రానుందని ధీమా వ్యక్తంచేశారు. విజయవాడలోని కేశినేని భవన్‌లో శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన తిరువూరు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాలకు చెందిన పలువురికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కేశినేని నాని విలేకరులతో మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి పట్ల సీఎం జగన్ చూపుతున్న ప్రత్యేక చొరవ ఫలితంగా రాష్ట్రం పేదరిక నిర్మూలన వైపు పయనిస్తుందన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ముగ్ధుడనై తాను వైఎస్సార్‌సీపీలో చేరానని స్పష్టంచేశారు. ఎంతో ఉన్నతమైన ఆశయాలతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, ఇప్పుడు ఎన్టీఆర్ ఐడియాలజీ టీడీపీలో లేదన్నారు. మోసగాళ్లు, దగాకోరులు, భూ కబ్జాదారులు, లోఫర్‌గాళ్లతో ప్రస్తుతం టీడీపీ నిండిపోయిందన్నారు. ఎన్నికల ముందే అభ్యర్థులను జాబితాను సీఎం జగన్ విడుదల చేసి ధైర్యంగా ఎన్నికలకు వెళ్తుంటే.. టీడీపీకి అభ్యర్థులే కరువయ్యారని ఎద్దేవా చేశారు. జిల్లాలో టీడీపీ ఖాళీ అయ్యే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. తనకు పార్లమెంట్ స్థానం కేటాయించిన సీఎం జగన్‌కు ఈ సందర్భంగా కేశినేని నాని కృతజ్ఞతలు తెలిపారు.



> గాలి తన కిష్టమైన చోటను విసరును ; నీవు దాని శబ్దము విందువేగాని
> అది యెక్కడనుండి వచ్చునో యెక్కడికి పోవునో నీకు తెలియదు.
> ఆత్మమూలముగా జన్మించిన ప్రతివాడును ఆలాగే యున్నాడు.
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం. **తిథి:** శు.అష్టమి రా.2.24 వరకు, తదుపరి నవమి.
నక్షత్రం: మృగశిర రా.9.15 వరకు, తదుపరి ఆరుద్ర. **వర్జ్యం:** తె.5.51 నుండి 7.31 వరకు (తెల్లవారితే సోమవారం). **దుర్ముహూర్తం:** సా.4.31 నుండి 5.17 వరకు.
అమృతఘడియలు: ప.12.22 నుండి 2.01 వరకు

సూర్యోదయం : 6.12
సూర్యాస్తమయం : 6.06
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఎం.కె. స్టాలిన్ (తమిళనాడు సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

దేశం మోయలేని సమస్య.. 'దేశభక్తి'!

జనాభా పెరిగితే తగ్గించుకోవచ్చు, ఆహారం తగ్గితే పండించుకోవచ్చు, శత్రువు పేట్రేగితే శతఘ్నులతో గర్జించవచ్చు. ధరలు మిన్నంటితే కడుపులోకి కాళ్లు ముడుచుకోవచ్చు, నిరుద్యోగం కన్నురిమితే తల తాకట్టు పెట్టొచ్చు, ఎలాగైనా బతికేయొచ్చు.

కానీ దేశభక్తి పెచ్చరిల్లితే ఏమీ చేయలేం. చేసే ప్రయత్నం చేసినా అది దేశద్రోహం అవుతుంది. అప్పుడు శ్రీ నరేంద్ర మోదీ నర నారాయణుల అంశతో సహస్ర దేశద్రోహ కవచాలను ఛేదించటానికి ఢిల్లీ నుంచి సుడిగాలి పర్యటనలకు బయలుదేరి వస్తారు. కోయంబత్తూరులో, కన్యాకుమారిలో రోడ్డు షోలు నిర్వహిస్తారు.

"దేశద్రోహి అయిన మీ ముఖ్యమంత్రితో జాగ్రత్త" అని ప్రజల్ని హెచ్చరించి వెళతారు. ఆ వచ్చి వెళ్లటం ఎన్నికల ప్రచారంలా ఉండదు. తనవి కాని రాష్ట్రాలకు గొప్ప ఔదార్యంతో తన



దేదో దోచి పెట్టటానికే వచ్చినట్లుంటుంది!

దేశాన్ని మనం శ్రీ నరేంద్రమోదీ చూపించిన దిక్కునే చూడాలి. నక్షత్రం కనిపించిందా మనం దేశభక్తులం. "అబ్బే... కనిపించడం లేదు." అన్నామా మనం దేశద్రోహులం. విభజించి చూడటం ఆయన దేశభక్తి. విభజన తగదనటం మన దేశద్రోహం!

దేశభక్త ప్రధానికి కశ్మీర్, కన్యాకుమారి ఒకేలా కనిపిస్తాయి. కశ్మీర్‌ని, కన్యాకుమారిని ఒకేలా వారు అభివృద్ధి చేయాలనుకుంటారు.

"కన్యాకుమారిలో అంతా బాగుంది కదా! బాగున్న దానిని మళ్లీ బాగు చేసే శ్రమ మీకెందుకు?" అంటే ఊరుకోరు.

"నాకు కాక వేరెవరికి?" అంటారు! "నేను కాక మరెవరు?" అంటారు!

"అలాగైతే మాకు రావలసింది మాకు ఇచ్చేస్తే సరిపోతుంది కదా.." అంటే... "మాకు, మేము ఏంటి?! దేశాన్ని కశ్మీర్‌గా, కన్యాకుమారిగా విడగొడతారా? దేశద్రోహులు మీరు!" అంటారు.

1991లో కన్యాకుమారి నుంచి కశ్మీర్‌కు 'ఏక్తా యాత్ర' చేశానని, ఇప్పుడు కశ్మీర్ నుంచే డైరెక్టుగా కన్యాకుమారి వచ్చానని చెప్పుకుంటున్న మోదీకి... కశ్మీర్ ఎటువైపో, కన్యాకుమారి ఏవైపో తెలియదా?

డీఎంకే నాయకులు దేశభక్తులు కారంటున్నారు మోదీ! కేంద్రానికి తమిళనాడు నుంచే ఎక్కువ వసూళ్లు వెళుతున్నాయి. అదేమిటి మరి? దేశభక్తి కాదా?

కేంద్రం నుంచి తమిళనాడుకు తిరిగి ఏమీ రాకపోయినా... మోదీని కన్యాకుమారి వరకు రానిస్తున్నాం. అది దేశభక్తి కాదా?

ఇండో–పాక్ యుద్ధానికి రాష్ట్రాలన్నీ కలిసి 25 కోట్ల విరాళం ఇస్తే ఒక్క తమిళనాడే ఆరు కోట్లు ఇచ్చింది. అది దేశభక్తి కాదా?!

కార్గిల్ యుద్ధానికి తమిళనాడు 50 కోట్ల రూపాయలను దేశ ప్రధాని వాజ్ పేయికి విరాళంగా ఇచ్చింది. అది దేశభక్తి కాదా?!

ఆ రెండు యుద్ధాలలో తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న ఎం. కరుణానిధి డీఎంకే నాయకుడు కారా?

గుజరాత్‌లో వరదలు వస్తే ఒక్క గెంతులో వెళ్లి ఒక్కరోజులో నిధుల గేట్లు తెరిచిన మోదీ... తమిళనాడుకు వరదలొస్తే కనీసం రానన్నా వచ్చారా? చూశారా? ఇప్పుడొచ్చి "స్టాలిన్‌కి దేశభక్తి లేదు", "డీఎంకే నాయకులంతా విభజన శక్తులు" అని అంటున్నారు!!

దేశభక్తి ఉండటం లేకపోవటం కాదు దేశానికి సమస్య. దేశభక్తులు కాని వాళ్లను నిందిస్తున్నవారే సమస్య.

మోదీ అనే మహా దేశభక్తుడితో సమస్యేమిటంటే... ఆయన తనను తను భక్తుడు అనుకోరు! తనకై తానొక సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశం అనుకుంటారు!! తన పట్ల దేశమే భక్తితో ఉండాలనుకుంటారు. లేకుంటే – "మమ్మల్ని గెలిపించండి" అని చేతులు జోడించి అడుగుతారు కానీ, "దేశాన్ని గెలిపించండి" అని విజ్ఞాపనగా ఆజ్ఞాపిస్తారా?!

విలన్ డెన్‌లో విదూషకుడు!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

శంఖం మోగింది. యుద్ధం మొదలైంది. ఎన్నికల ప్రకటనకు కొన్ని గంటల ముందుగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను పూర్తిగా ప్రకటించింది. జాతీయ స్థాయిలోనే ఈ ఘనత సాధించిన మొదటి పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఒక్క అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థిని మాత్రమే పెండింగ్‌లో పెట్టింది. ఈ దూకుడు వల్ల పోల్ పొజిషన్‌లో దానికి అడ్వాంటేజ్ దక్కినట్టే. విప్లవాత్మక ఆలోచనలతో మరో ఘనతను కూడా అది సొంతం చేసుకున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలున్నాయి. ఈ రెండొందల స్థానాల్లో వంద స్థానాలను బలహీనవర్గాలకు కేటాయించి రాజకీయ ప్రపంచాన్ని వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆశ్చర్యంలో ముంచెత్తారు. సామాజిక న్యాయం తమ నినాదం మాత్రమే కాదు, విధానం కూడానని ఆయన చేతల ద్వారా మరోసారి నిరూపించుకున్నారు.

బీసీ వర్గాలకు 48 శాసనసభ స్థానాలు, 11 లోక్‌సభ స్థానాలను వైసీపీ కేటాయించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 అసెంబ్లీ సీట్లు, 42 లోక్‌సభ సీట్లు ఉన్నప్పుడు కూడా బీసీలకు ఈ సంఖ్యలో సీట్ల కేటాయింపు ఎప్పుడూ జరగలేదు. బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు, బ్యాక్ బోన్ క్లాసని తరుచూ జగన్ మోహన్ రెడ్డి చెప్పే మాట. ఆ మాటను చేతల్లో చూపించారు. తెలుగుదేశం పార్టీ పొత్తులో భాగంగా తన కోటాలో ఉన్న 144 సీట్లలో 128 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అందులో 24 స్థానాలు మాత్రమే బీసీలకు దక్కాయి. ఆ పార్టీ కోటాలో ఇంకో 16 స్థానాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. జనసేన పోటీ చేసే 21 స్థానాల్లో ఏడుగురు అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించారు. ఇందులో ఒక్క బీసీకే చోటు దక్కింది. మిగిలిన పద్నాలుగులో ఇదే నిష్పత్తి కొనసాగుతుందో, పెరుగుతుందో వేచిచూడాలి. బీజేపీకి కేటాయించిన 10 సీట్ల అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు.

కూటమి తరఫున ఇంకో నలభై సీట్లకు అభ్యర్థులను ఎంపిక చేయవలసి ఉన్నది. ఇందులో 23 స్థానాలను బీసీలకు కేటాయించగలిగితేనే వైసీపీ బీసీ స్కోర్‌ను అది చేరుకోగలుగుతుంది. బ్రహ్మాండం బద్దలైతే తప్ప అది సాధ్యమయ్యే పనికాదు. ముస్లిం మైనారిటీలకు వైసీపీ 7 అసెంబ్లీ సీట్లను కేటాయించింది. కూటమి తరఫున ఇప్పటికి ముగ్గురే ఎంపికయ్యారు. మిగిలిన 40లో నాలుగు స్థానాలు దక్కే అవకాశాలు మృగ్యం. ఏకంగా 11 లోక్‌సభ స్థానాలకు బీసీ అభ్యర్థులనే వైసీపీ ఎంపిక చేసింది. ఈ రికార్డును అందుకోవడం కూడా సాధ్యమయ్యే పని కాదు.

కూటమి కట్టిన తర్వాత ప్రచారాన్ని పరుగెత్తించగల ఒక శుభ శకునం కోసం బాబు ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న తాడేపల్లిగూడెం సభ అట్టర్‌ఫ్లాప్ కావడంతో తెలుగుదేశం శిబిరం డీలా పడిపోయింది. ఇప్పుడు ప్రధానమంత్రి పేరుతోనైనా చిలకలూరిపేట సభ సక్సెస్ చేయాలని ఆ పార్టీ శ్రేణులు చెమటోడ్చుతున్నాయి. మొత్తం 175 నియోజక వర్గాల నుంచి జనసమీకరణ చేస్తున్నారు. 'సిద్ధం' పేరిట వైసీపీ నిర్వహించిన నాలుగు ప్రాంతీయ సభలు చరిత్ర సృష్టించడం టీడీపీ కూటమికి పెనుసవాల్‌గా మారింది. ఒక్కో సభకు యాభై కంటే తక్కువ నియోజకవర్గాల నుంచే అభిమానుల సమీకరణ జరిగింది. మొదటి రెండు సభలు ఐదు లక్షల మార్కును దాటితే, చివరి రెండు సభలు పది లక్షల మార్కును దాటాయి. జాతీయ స్థాయిలోనే ఇదొక రికార్డు. రాష్ట్రవ్యాప్త సమీకరణ చేస్తే తప్ప గతంలో ఎన్నడూ కూడా ఐదు లక్షల పైచిలుకు జనసమీకరణ జరగలేదు.

ఇప్పుడు ప్రధాని సభ టీడీపీ కూటమికి జీవన్మరణ సమస్యగా మారింది. అందుకే రాష్ట్రవ్యాప్త సమీకరణకు టార్గెట్లు పెట్టారు. రెండు మూడు లక్షలమంది హాజరైనా సరే యెల్లో మీడియా సహకారంతో సభ విజయవంతమైనట్టు ప్రకటించుకోవచ్చని ప్రయాసపడుతున్నారు. నరేంద్రమోదీ రూపంలో ఓ శుభశకునం కోసం ఎదురుచూస్తున్న కూటమికి అమిత్ షా రూపంలో అపశకునం ఎదురైంది. అది కూడా సరిగ్గా ఎన్నికల ప్రకటనకు ఒకరోజు ముందు! శుక్రవారం నాడు ఢిల్లీలో జరిగిన 'ఇండియా టుడే' కాన్‌క్లేవ్‌లో అమిత్ షా పాల్గొన్నారు. 'ప్రధానిని టెర్రరిస్టని విమర్శించిన చంద్రబాబుతో మీరెలా పొత్తుపెట్టుకున్నార'న్న ప్రశ్నకు అమిత్ షా బదులిచ్చారు. 'అలా అని ఆయనే ఎన్డీయే నుంచి వెళ్లిపోయారు. ఎన్నికల్లో ఓడిపోయారు. ఇప్పుడు బుద్ధొచ్చింది. మళ్లీ మా దగ్గరకు వచ్చాడు' అనగానే అక్కడున్న అతిథులందరూ పడిపడి నవ్వడం కనిపించింది. ఢిల్లీ కేంద్రంగా చంద్రబాబు పరువుపై పంచనామా జరిగింది.

ఇదే కాన్‌క్లేవ్‌లో జగన్‌మోహన్ రెడ్డి ప్రస్తావన వచ్చినప్పుడు అమిత్ షా హుందాగా మాట్లాడారు. ఒక వ్యక్తి ఇతరుల నుంచి గౌరవాన్ని పొందాలంటే ఆ వ్యక్తికి నిబద్ధత, క్యారెక్టర్ ఎంత ముఖ్యమో ఈ ఘటన ఎత్తిచూపింది. 'పార్లమెంట్‌లో కొన్ని బిల్లులకు వైసీపీ మద్దతు ఇచ్చింది కదా... మరి ఆ పార్టీతో ఎందుకు పొత్తు పెట్టుకోలేద'ని అమిత్ షాను యాంకర్ ప్రశ్నించారు. "మేం పెట్టిన ప్రతి బిల్లుకూ ఆ పార్టీ మద్దతు ఇవ్వలేదు. కొన్నిటికి మాత్రమే ఇచ్చింది. అది కూడా ఆ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉంటేనే ఇచ్చింది తప్ప బీజేపీ కోసం కాద"ని అమిత్ షా చెప్పారు. అమిత్ షా మాటల సారాంశాన్ని విడమర్చి చెప్పుకుంటే చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డిల వ్యక్తిత్వం మధ్యన ఉన్న తేడా స్పష్టంగా అర్థమవుతుంది.

చంద్రబాబుకు సిద్ధాంతాలతో, రాద్ధాంతాలతో సంబంధం

> ఇప్పుడు ప్రధాని సభ టీడీపీ కూటమికి జీవన్మరణ సమస్యగా మారింది. అందుకే రాష్ట్రవ్యాప్త సమీకరణకు టార్గెట్లు పెట్టారు. రెండు మూడు లక్షల మంది హాజరైనా సరే యెల్లో మీడియా సహకారంతో సభ విజయవంతమైనట్టు ప్రకటించుకోవచ్చని ప్రయాసపడుతున్నారు. నరేంద్రమోదీ రూపంలో ఓ శుభశకునం కోసం ఎదురుచూస్తున్న కూటమికి అమిత్ షా రూపంలో అపశకునం ఎదురైంది. అది కూడా సరిగ్గా ఎన్నికల ప్రకటనకు ఒకరోజు ముందు! శుక్రవారం నాడు ఢిల్లీలో జరిగిన 'ఇండియా టుడే' కాన్‌క్లేవ్‌లో అమిత్ షా పాల్గొన్నారు. 'ప్రధానిని టెర్రరిస్టని విమర్శించిన చంద్రబాబుతో మీరెలా పొత్తుపెట్టుకున్నార'న్న ప్రశ్నకు అమిత్ షా బదులిచ్చారు. 'అలా అని ఆయనే ఎన్డీయే నుంచి వెళ్లిపోయారు. ఎన్నికల్లో ఓడిపోయారు. ఇప్పుడు బుద్ధొచ్చింది. మళ్లీ మా దగ్గరకు వచ్చాడు' అనగానే అక్కడున్న అతిథులందరూ పడిపడి నవ్వడం కనిపించింది. ఢిల్లీ కేంద్రంగా చంద్రబాబు పరువుపై పంచనామా జరిగింది.
>
> ఇదే కాన్‌క్లేవ్‌లో జగన్‌మోహన్ రెడ్డి ప్రస్తావన వచ్చినప్పుడు అమిత్ షా హుందాగా మాట్లాడారు. ఒక వ్యక్తి ఇతరుల నుంచి గౌరవాన్ని పొందాలంటే ఆ వ్యక్తికి నిబద్ధత, క్యారెక్టర్ ఎంత ముఖ్యమో ఈ ఘటన ఎత్తిచూపింది.

లేదు. అవకాశవాది! అవసరం ఉంటే వస్తాడు. లేకపోతే వెళ్లిపోతాడని అమిత్ షా భావన. జగన్‌మోహన్ రెడ్డికి సైద్ధాంతిక నిబద్ధత ఉన్నది. ఆ పార్టీ విధానాలకు అనుగుణమైతే మద్దతు ఇస్తారు. లేకపోతే లేదు. సిద్ధాంతపరంగా ఆయన పార్టీకీ, మాకూ పొత్తు పొసగదని కూడా ఆయన పరోక్షంగా చెప్పినట్టు! మనం సినిమాల్లో చూస్తూ వుంటాం, విలన్ డెన్‌లో ఉండే విదూషక క్యారెక్టర్‌కు ఆ డెన్‌లోనే ఏపాటి గౌరవం ఉంటుందో! చంద్రబాబు పరిస్థితి కూడా అంతే! ఎన్డీఏ కూటమిలో చేరినా, కూటమి సభ్యుల దృష్టిలో ఆయనో విదూషకుడు, అసందర్భ ప్రేలాపి, అవకాశవాది.

అవకాశవాదంతో అటూ ఇటూ తిరిగినా, బీజేపీ ప్రవచించే పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనాతో చంద్రబాబుకు కెమిస్ట్రీ బాగానే కుదురుతుంది. ఈ నమూనా వ్యవస్థలో అధికారంలో ఉన్నవాడు పెత్తందారీ శక్తుల భజంత్రీగా మారితే భారీగా వెనకేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ వెసులుబాటును పద్నాలుగేళ్లపాటు బాబు బాగానే ఒడిసిపట్టుకున్నాడు. కొద్దిమంది పెట్టుబడిదారుల అభివృద్ధే దేశాభివృద్ధిగా, వారి పెరుగుదలే దేశ ఆర్థిక వ్యవస్థ పెరుగుదలగా పరిగణించే బీజేపీ శిబిరమే చంద్రబాబుకు సహజ ఆవాసం.

అందుకే మూడుసార్లు విడాకులు తీసుకున్నా మళ్లీ నాలుగోసారి అదే పార్టీని మనువాడేందుకు ఆయన ఏమాత్రం సిగ్గుపడలేదు. పైగా వాజ్‌పేయి కార్గిల్ ఊపుమీద ఉన్నప్పుడు, మోదీ గుజరాత్ మోడల్ ఊపుమీద ఉన్నప్పుడు వారి గాలితో గెలిచిన అనుభవం బాబుది. ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి బలహీనంగా కన్పిస్తున్నందువల్ల మళ్లీ మోదీ గాలివాటు బాబుకు అవసరమైంది. అన్నిటినీ మించి తరుముకొస్తున్న అవినీతి కేసుల నుంచి రాబోయే కేంద్ర ప్రభుత్వం ఆయన్ను కాపాడాలి. ఆ రాబోయే ప్రభుత్వం మోదీ సర్కారేనని బాబు నమ్ముతున్నారు.

దేశంలో చాలామందికి బాబుకున్న అభిప్రాయమే ఉండవచ్చు. ప్రతిపక్ష శిబిరం బాగా బలహీనంగా కనిపించడం అందుకు ఒక కారణం కావచ్చు. స్వతంత్ర మీడియా సంపూర్ణంగా అంతర్ధానం కావడం మరో కారణం కావచ్చు. ఈ కారణాల వల్ల, దేశానికి అన్నంపెట్టే రైతు తన పంటకు చట్టబద్ధమైన మద్దతు ధర కావాలని ఎలుగెత్తడం మనకు న్యాయమైన కోర్కెగా కనిపించడం లేదు. రోజురోజుకూ వేలాదిమంది యువకులు నిరుద్యోగ సైన్యంలో చేరిపోతున్నా మన కళ్లకు వికసిత భారత విశ్వరూపమే కనిపిస్తున్నది. తరతరాలుగా ఈ నేల పైనే పుట్టి ఈ నేలపైనే శ్వాసిస్తున్న కోట్లాదిమంది 'మైనారిటీ' ముద్రకు భయపడి వణికిపోతుంటే విజయోద్వేగంతో మన హృదయాలు ఉప్పొంగుతున్నవి.

కనుక చాలామంది మళ్లీ మోదీయే గెలుస్తాడని అనుకుంటే అనుకోవచ్చు. వారికా స్వేచ్ఛ ఉన్నది. మన బాబు కూడా ఆ గుంపులోని గోవిందుడే! ఉత్తరాది మోదీ గాలి అంతో ఇంతో దండకారణ్యాన్ని దాటుకుని రాకపోతుందా, తనను కరుణించకపోతుందా అనే ఆశ ఆయనలో మిణుకుమిణుకుమంటూ ఉండవచ్చు. కానీ తూరుపు కనుమలది తలలు వంచే నైజం కాదు. ఉత్తరాదిలో లేనిదీ... ఏపీలో ఉన్నదీ ఒక ప్రత్యామ్నాయ కార్యక్రమం.

> మూడుసార్లు విడాకులు తీసుకున్నా మళ్లీ నాలుగోసారి అదే పార్టీని మనువాడేందుకు చంద్రబాబు ఏమాత్రం సిగ్గుపడలేదు. పైగా వాజ్‌పేయి కార్గిల్ ఊపుమీద ఉన్నప్పుడు, మోదీ గుజరాత్ మోడల్ ఊపుమీద ఉన్నప్పుడు వారి గాలితో గెలిచిన అనుభవం బాబుది. ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి బలహీనంగా కన్పిస్తున్నందువల్ల మళ్లీ మోదీ గాలి వాటు బాబుకు అవసరమైంది. అన్నిటినీ మించి తరుముకొస్తున్న అవినీతి కేసుల నుంచి రాబోయే కేంద్ర ప్రభుత్వం ఆయన్ను కాపాడాలి. ఆ రాబోయే ప్రభుత్వం మోదీ సర్కారేనని బాబు నమ్ముతున్నారు.
>
> దేశంలో చాలామందికి బాబుకున్న అభిప్రాయమే ఉండవచ్చు. ప్రతిపక్ష శిబిరం బాగా బలహీనంగా కనిపించడం అందుకు ఒక కారణం కావచ్చు. స్వతంత్ర మీడియా సంపూర్ణంగా అంతర్ధానం కావడం మరో కారణం కావచ్చు. ఈ కారణాల వల్ల, దేశానికి అన్నంపెట్టే రైతు తన పంటకు చట్టబద్ధమైన మద్దతు ధర కావాలని ఎలుగెత్తడం మనకు న్యాయమైన కోర్కెగా కనిపించడం లేదు. రోజురోజుకూ వేలాదిమంది యువకులు నిరుద్యోగ సైన్యంలో చేరిపోతున్నా మన కళ్లకు వికసిత భారత విశ్వరూపమే కనిపిస్తున్నది. తరతరాలుగా ఈ నేల పైనే పుట్టి ఈ నేలపైనే శ్వాసిస్తున్న కోట్లాదిమంది 'మైనారిటీ' ముద్రకు భయపడి వణికిపోతుంటే విజయోద్వేగంతో మన హృదయాలు ఉప్పొంగుతున్నవి.

పేదల సాధికారతే తారకమంత్రంగా సాగుతున్న ప్రభుత్వ ప్రాయోజిత విప్లవోద్యమం. భారత రాజ్యాంగ స్ఫూర్తిని తు.చ. తప్పకుండా అమలుచేస్తూ, ఆ రాజ్యాంగ కర్తను నగరం నడిబొడ్డున విశ్వరూపంతో నిలబెట్టిన రాష్ట్రమిది. ఆ భారత రాజ్యాంగాన్ని మార్చాలంటే కేంద్రానికి పెద్ద ఎత్తున సీట్లు కావాలి. అందుకు కూటములు కావాలి. రాజ్యాంగ రక్షణ కవచంతో సాధికారత సంతరించుకుంటున్న ప్రజలు ఈ ప్రయత్నాలను ఓడిస్తారు. ఆ కూటములనూ ఓడిస్తారు.

భారతదేశ ఉజ్వల భవిష్యత్తును గానం చేసిన విశ్వకవి రవీంద్రుని కవిత అందరికీ తెలిసిందే. "ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో, ఎక్కడ మనుషులు తలెత్తుకుని తిరుగుతారో, ఎక్కడ విజ్ఞానం స్వేచ్ఛగా ఉంటుందో, ఎక్కడ సంకుచిత భావాలతో సమాజం ముక్కలుగా విడిపోదో... ఓ తండ్రీ! అటువంటి స్వర్గసీమకు నా దేశాన్ని తీసుకుని వెళ్లు". కవీంద్రుని కలను నిజం చేసే శక్తి మన రాజ్యాంగానికి ఉన్నది. అటువంటి రాజ్యాంగాన్ని మార్చి అసమానతలకు, భయం బతుకులకు బాటలు వేసే ప్రయత్నాలను ఇక్కడి ప్రజలు సహించే పరిస్థితి ఉండదు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుకు మార్గదర్శకాలను విడుదల చేసిన నేపథ్యంలో రాజ్యాంగ మార్పుల చర్చ మళ్లీ ముందుకొచ్చింది. భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్నే మార్చే సవరణలు చెల్లబోవని గతంలోనే సుప్రీంకోర్టు చాటి చెప్పింది. ప్రస్తుత చట్టం (సీఏఏ) పౌరసత్వానికి మత ప్రాతిపదికను రుద్దుతున్నదని విమర్శకులు గట్టిగా భావిస్తున్నారు. ఇది రాజ్యాంగ లౌకిక స్వభావానికి విరుద్ధం కనుక చెల్లదని వారి వాదన. ఈ వ్యాజ్యం సుప్రీంకోర్టు విచారణకు రాబోతున్నది.

ఒకవేళ న్యాయస్థానం కొట్టివేస్తే భారీ మెజారిటీతో వచ్చే ప్రభుత్వం కొత్త రాజ్యాంగాన్ని ముందుకు తేబోతున్నదని విమర్శకులు అనుమానిస్తున్నారు. మన దేశంలోనే కాదు, ప్రపంచమంతటా దీనిపై విస్తృతమైన చర్చ జరుగుతున్నది. ఇంత గంభీరమైన అంశంపై నాలుగోసారి బీజేపీతో జతకట్టిన చంద్రబాబు ఎంత సింపుల్‌గా సమాధానం చెబుతున్నారో చూడండి. "ఏ దేశానికి వెళ్లినా సిటిజన్‌షిప్ అనేది పారదర్శకంగా ఉంటుంది. అక్కడి నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాల"ని తేల్చేశారు. కానీ, మత ప్రాతిపదిక అవసరమా అనే కీలక విషయం జోలికి వెళ్లలేదు. పోనీ, ఈ ప్రాతిపదిక చట్టంలో చెప్పినట్టు మూడు దేశాలకూ, నిర్ణీత కాలానికే పరిమితం కావాలి. అంతకు మించి అనుమతించేది లేదని చెప్పినా అదొక లెక్క. కానీ మన నాయకుడు బ్లాంక్ చెక్ ఇచ్చేశాడు. అంతే మరి! విలన్ డెన్‌లో చేరిన విదూషకుల పరిస్థితి ఇలాగే ఉంటుంది.

vardhelli1959@gmail.com

అంత ఎత్తు ఎలా అయ్యాయి?

విశ్లేషణ



కె.బి. గోపాలం

హిమాలయాలు ప్రపంచంలోనే ఎత్తైన కొండలని అందరికీ తెలుసు. అందులోని ఎవరెస్టు శిఖరం ప్రపంచంలోనే ఎత్తైనదని అందరూ అనుకుంటారు. అది నిజమా, కాదా అన్న చర్చ ఇప్పుడు మనకు అప్రస్తుతం. ఇంతకు హిమాలయాలు అంత ఎత్తుకు ఏ రకంగా ఎదిగాయి అన్న ప్రశ్నకు కూడా చాలా రోజులుగా ఒక జవాబు ఉంది. అదీ నిజమా, కాదా అన్న సంగతి మామూలు మనుషులకే కాదు పరిశోధకులకు కూడా తెలియదు. అయినా మనం పట్టించుకోవాల్సిన అవసరం లేదు. సంగతి ఏమిటంటే ఇప్పటివరకు హిమాలయాలు అంత ఎత్తుకు చేరడానికి గల కారణం గురించి తెలిసిన సంగతులు అంతగా నిజం కాదని!

భూమి ఉపరితలం టెక్టానిక్ ప్లేట్స్ అనే విడిభాగాల రూపంలో ఉంది. ఆ భాగాలు కదులుతూ ఉంటాయి. అలా కదిలే ఒక భాగం వచ్చి తగిలినందుకు హిమాలయాలు అంత ఎత్తుకు ఎగిశాయని అందరూ అనుకుంటున్నారు. హిమాలయాలలో అన్నిటికంటే ఎత్తైన శిఖరం ఎవరెస్ట్ ప్రస్తుతం 8,849 మీటర్ల ఎత్తు ఉన్నది.

కొత్తగా జరిగిన పరిశోధనల ప్రకారం, హిమాలయాలు కానీ, అందులోని ఎవరెస్టు కానీ అంత ఎత్తుకు చేరడానికి టెక్టానిక్ ప్లేట్లు ఒకదాన్ని ఒకటి గుద్దుకోవడం కారణం కానే కాదనీ, అంతకుముందే అవి దాదాపు అంత ఎత్తుగా ఉన్నాయనీ తెలిసింది. ప్లేట్‌లు గుద్దుకున్నందుకు హిమాలయాల ఎత్తు పెరగడం నిజమే, కానీ అప్పటికే అవి ఎంతో ఎత్తుగా ఉన్నాయి, అందుకు కారణం ఏమిటి అన్నది ఎవరికీ తెలియదంటున్నారు పరిశోధకులు. ఒక ఖండం ముక్క వచ్చి ఇంకొక ఖండం ముక్కకు తగిలితేనే ఇటువంటి మార్పులు కలుగుతాయని చాలాకాలం వరకు పరిశోధకులు అనుకున్నారు. అప్పుడు మాత్రమే రెండు ముక్కలు తగిలిన ప్రాంతం మరీ ఎత్తుకు చేరుకుంటుందని కూడా అనుకున్నారు.

యూఎస్‌లోని 'బ్రౌన్ విశ్వవిద్యాలయం'లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న డేనియల్ ఇబారా బృందం వారు ఈ మధ్యన ఈ అంశాన్ని గురించి ఒక వైజ్ఞానిక పత్రాన్ని వెలువరించారు. 'నేచర్ జియోసైన్సెస్' అనే ప్రఖ్యాత వైజ్ఞానిక పత్రికలో ఆ పత్రం ప్రచురించబడింది. ఈ పత్రం కారణంగా ఆ



రంగంలోనే కొత్త మలుపులు వచ్చాయనీ, పరిశోధన మరొక మార్గంలో సాగుతుందనీ ప్రపంచమంతటా నిపుణులు అంటున్నారు. అమెరికా విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుల బృందానికి చైనాలోని 'యూనివర్సిటీ ఆఫ్ జియో సైన్సెస్' వారు కూడా ఈ పరిశోధనలో సహకరించారు. 'సెడిమెంటరీ శిలల' నిర్మాణాల ఎత్తు గతంలో ఉండిన తీరు గురించి పరీక్షించడానికి వీరంతా కలిసి ఒక కొత్త పద్ధతిని రూపొందించారు. అంగారక శిలలను పరిశీలించడంలో వాడుతున్న ఒక పద్ధతిని ఈ పరిశోధకులు ఇక్కడ కొత్తగా ప్రవేశపెట్టారు. హిమాలయాలలోని శిలల్లో ఉన్న ఐసోటోపుల కొలతలు తీసి వాటి ప్రకారం శిలల కాలం ఎప్పటిది అని వారు నిర్ణయించారు. ఐసోటోపులు అంటే ఒకే రసాయనం తాలూకు వేరు వేరు రకాలు.

ఈ పద్ధతి గురించి మరింత చెబితే అది చాలా సాంకేతికంగా ఉండవచ్చు. కొండకు వెచ్చని గాలి తగిలి అది పైకి లేచి కొండకు ఆవలి భాగంలోకి ప్రవేశించి చల్లబడుతుంది. అప్పుడది వర్షం గానూ, మంచు గానూ కిందకు రాలుతుంది. గాలి పైకి వెళ్ళిన కొద్దీ అందులోని రసాయనాల తీరు మారుతుంది. ఎక్కువ న్యూట్రాన్లు గల ఆక్సిజన్ వంటి రసాయనాలు, అంటే ఐసోటోపులు బరువుగా ఉండి, మేఘాల నుంచి ముందే కిందకు జారుతాయి. ఇక తేలిక ఐసోటోపులు కొండపై కొమ్ము మీద ఆ తరువాత వచ్చి రాలుతాయి. మూడు సంవత్సరాల పాటు ఈ ఐసోటోపులను పరిశీలించిన తరువాత టెక్టానిక్ ప్లేట్ అంచులో ఉన్న హిమాలయ పర్వతాలు అప్పటికే 3,500 మీటర్ల కన్నా ఎత్తు లేదా ఇంచుమించు అంత ఎత్తులో ఉన్నాయని గమనించారు. అంటే ప్రస్తుతం ఉన్న ఎత్తులో ఇది 60 శాతం కన్నా ఎక్కువన్నమాట.


ఈ రకంగా చూస్తే హిమాలయాల చుట్టుపక్కల గల పాతకాలపు వాతావరణ వివరాలు మరొకసారి పరిశీలించవలసిన అవసరం ఉన్నట్టు పరిశోధకులు భావిస్తున్నారు. దక్షిణ టిబెట్‌లోని ప్రాచీన కాలపు శీతోష్ణస్థితి గురించి కొత్త సిద్ధాంతాలు ఈ రకంగా అందుబాటులోకి రానున్నాయి.

ఇదే పద్ధతిలో ఆండీస్, సియెరా నెవాడా పర్వతశ్రేణులనూ, అక్కడి ప్రాచీన వాతావరణ పరిస్థితులనూ మరొకసారి విశ్లేషించే అవకాశం కూడా ఉంది. గతంలోని శీతోష్ణస్థితులను గురించి ఉన్న సిద్ధాంతాల తీరు మారనుందనీ, ఆ యా ప్రాంతాలలోని గత కాలపు శీతోష్ణస్థితులను గురించిన సిద్ధాంతాలూ, ఆలోచనలూ కొత్తదారి పట్టే పద్ధతి కనబడుతున్నదనీ, అక్కడి జీవవైవిధ్యం గురించి కూడా అవగాహనలు మారుతాయనీ అంటారు ఇబారా.

కొన్ని విషయాలు తెలుసుకున్నందుకు తక్షణం ఏ ప్రయోజనం ఉండకపోవచ్చు. కానీ ప్రపంచం, దాని గురించి అవగాహన కలిగించే సైన్సు క్రమంగా మారుతున్నాయని అర్థం కావడం మాత్రం అసలైన నిజం!

వ్యాసకర్త సైన్స్ రచయిత

మన ఆలోచనే...



అరణ్యవాసంలో ఉన్న పంచపాండవుల యోగ క్షేమాలు తెలుసుకోవడానికి వెళ్లాడు కృష్ణుడు. వారితో ఒక రాత్రి గడిపాడు. పాండవులు వంతుల వారీగా గంటకొకరు చొప్పున తామున్న కుటీరాన్ని ఆ రాత్రి కాపలా కాయసాగారు. ఒకరు కాపలా కాసేటప్పుడు మిగిలినవారు నిద్రిస్తున్నారు. అయితే వీరిలో ప్రతి ఒక్కరికీ ఒక భూతం కనిపించింది. అది క్రమంగా తన ఆకారాన్ని పెంచుకోవడం చూశారు. ఒక్కొక్కరూ దానిని హతమార్చడానికి ప్రయత్నించారు. కానీ ఎవరూ దాన్ని కనీసం అక్కడి నుంచి తరమలేకపోయారు. కాపలా కాస్తున్న ధర్మరాజుతో 'నన్నూ కాపలా కాయనివ్వరా బావా' అన్నాడు కృష్ణుడు. అంతట ధర్మరాజు, 'ఈ ప్రపంచాన్నంతా కాపాడేది మీరే కదా! మమ్మల్ని కాపాడేదీ మీరేగా! అటువంటి మీరు కాపలా ఉంటానంటే వద్దని చెప్పడానికి మేమెవరం?' అన్నాడు.

పాండవుల వంతు ముగిసిన తర్వాత కృష్ణుడు తన వంతుగా కాపలా కాశాడు. అప్పుడు ధర్మరాజు 'కృష్ణా! ఈ అడవిలో పెనుభూతం ఉంది. అది క్రమంగా పెద్దదవుతోంది. అది మీకేమన్నా తలనొప్పిగా మారుతుందేమో అని ఆందోళనగా ఉంది' అన్నాడు. అంతట కృష్ణుడు 'ధర్మా! నీకు నా మీద సందేహం రావచ్చా? అది నీ బలహీనత. నేను నా వంతుగా కాపలా కాస్తాను' అన్నాడు. అర్ధరాత్రి దాటింది. ఓ గంటపాటు కృష్ణుడు కాపలా కాసిన తర్వాత అర్జునుడు వచ్చాడు. 'బావా కృష్ణా! నువ్వు ఆ భూతాన్ని లేకుండా చేసేశావే' అన్నాడు. అందుకు కృష్ణుడు 'అర్జునా, నేను ఏ భూతాన్నీ, పిశాచాన్నీ నాశనం చేయలేదు. నా కంటికి అలా ఏదీ కనిపించలేదు. ఏదైనా మనం చూసే తీరులో ఉంటుంది. మనలో ఏ ఆలోచనలో ఉంటే ఆ దృశ్యం మదిలో మెదులుతుంది. అదే దర్శనమిస్తుంది. అది ద్వేషమైనా కావచ్చు. కోపమైనా కావచ్చు. ఆనందమైనా కావచ్చు. ద్వేషమనేది లేకుండా ప్రేమతో మనసును నింపితే, మన ముందు ప్రేమే కనిపిస్తుంది. భూతం కనిపించదు' అన్నాడు. ఇది అర్థమైతే అందరూ ఆనందంగా జీవించవచ్చు అన్నాడు. మన ఆలోచనలే మనకు కనిపించే భూతాలు!

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

తిరుమలలో సిఫార్సు లేఖలు స్వీకరించరు

టీటీడీ సీపీఆర్వో విభాగం

తిరుమల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమలలో వసతి, శ్రీవారి దర్శనానికి సిఫార్సు లేఖలు స్వీకరించడంలేదని టీటీడీ సీపీఆర్వో విభాగం తెలిపింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయం మేరకు శనివారం నుంచి తిరుమలలో వసతి, శ్రీవారి దర్శనానికి సిఫార్సు లేఖలను రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు, వారి కుటుంబ సభ్యులకు నిర్దేశించిన విధివిధానాల మేరకు దర్శనం, వసతి కల్పిస్తామని తెలిపింది.

శ్రీకాళహస్తిలో ఆర్జిత సేవలు పునఃప్రారంభం

శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభించనున్నట్లు ఈవో నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 16వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలోని అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో ఆర్జిత సేవలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో దస్తగిరి దాదాగిరి



పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ నాగస్వామితో మాట్లాడుతున్న దస్తగిరి

తాడిమర్రి: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఓ భూమి విషయంలో మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు ముద్దాయి దస్తగిరి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. తాడిమర్రి మండలం నిడిగల్లు గ్రామానికి చెందిన దేవరకొండ నాగమ్మకు చెందిన 3.84 ఎకరాల భూమిని ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లికి చెందిన రామ్‌నాయక్ తన భార్య శివాబాయి పేరున రూ.29 లక్షలకు కొనుగోలు చేశాడు. ఇటీవల రామ్‌నాయక్ ఆ భూమి పక్కనున్న శివాయి సాగు భూమి రెండెకరాలు కూడా చదును చేస్తుండగా నాగమ్మ, కుమారులు అడ్డుకున్నారు. దాన్ని విక్రయించనందున ఆ భూమి జోలికి రావొద్దని, అలాగే తమకు ఇవ్వాల్సిన రూ.3 లక్షలు చెల్లించాలని అడిగారు. అయితే, రామ్‌నాయక్ శివాయి సాగు భూమి కూడా తనకే చెందుతుందనడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో.. దస్తగిరి శనివారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ నజ్మాబానుతో మాట్లాడారు. నిడిగల్లు గ్రామంలో రామ్ నాయక్ కొనుగోలు చేసిన పొలంపై స్టేటస్‌కో ఉందని, ఆ పొలం వద్దకు వీఆర్‌ఓను గానీ.. ఎస్‌ఐ, పోలీసులనుగానీ పంపవద్దని బెదిరించాడు. అలాగే, పోలీసుస్టేషన్‌కు వెళ్లి నాగమ్మ, ఆమె కుమారులు, అల్లుడు కలిసి రామ్‌నాయక్‌ను కొట్టారని, వారిపై కేసు నమోదు చేయాలని ఎస్‌ఐ నాగస్వామిని డిమాండ్ చేశాడు. ఫిర్యాదు లేనప్పుడు కేసు ఎలా పెడతామని ఎస్‌ఐ ప్రశ్నించారు. ఇలా దస్తగిరి ఆగడాలు పెరిగిపోయాయని సామాన్య ప్రజలు వాపోతున్నారు.

బడి తెరిచిన మొదటి రోజే పుస్తకాలు

42 లక్షల మంది విద్యార్థులకు పుస్తకాలు సిద్ధం చేస్తున్న అధికారులు

- 2024–25 విద్యా సంవత్సరానికి 4.55 కోట్ల పుస్తకాలు
- 1 నుంచి 5, 7 తరగతుల పుస్తకాల ముద్రణ బిడ్ దక్కించుకున్న పితాంబరా ప్రెస్‌కు
- మిగతా తరగతుల పుస్తకాల ముద్రణ స్థానిక ఎంఎస్‌ఎంఈలకు
- గతేడాది పేపర్ నాణ్యత, ప్రమాణాలతో పాటు అదే ధరకు ముద్రణ
- ఈసారి పదో తరగతికీ ఇంగ్లిష్ మీడియం విస్తరణ
- 1 నుంచి 7 వరకు స్టేట్, 8 నుంచి 10 వరకు ఎన్సీఈఆర్టీ సిలబస్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులందరికీ పాఠశాలలు తెరిచే నాటికల్లా పాఠ్య పుస్తకాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. 1 నుంచి 10వ తరగతి వరకు అందరికీ బైలింగ్యువల్ పుస్తకాల ముద్రణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 42 లక్షల మంది విద్యార్థుల కోసం 4.55 కోట్ల పుస్తకాలను సిద్ధం చేస్తోంది. గతేడాది దాదాపు 27 లక్షల పుస్తకాలు మిగలడంతో మిగిలిన 4.28 కోట్ల పుస్తకాలు ముద్రిస్తున్నారు. ఈసారి పాఠ్యపుస్తకాల ముద్రణ బిడ్‌ను ఉత్తరప్రదేశ్‌కు చెందిన పితాంబరా ప్రెస్ పొందింది. 25 శాతం ముద్రణను స్థానిక ఎంఎస్‌ఎంఈలకు అప్పగిస్తారు. గత ఏడాది పుస్తకాల ముద్రణకు అత్యంత నాణ్యమైన 70 జీఎస్‌ఎం పేపర్‌ను వినియోగించారు. ఈ ఏడాది కూడా ఇదే నాణ్యత ఉండేలా ముద్రణ సంస్థకు నిబంధనలు విధించారు. పదో తరగతి ఫిజిక్స్ పుస్తకాలకు ప్రత్యేకంగా అత్యంత నాణ్యమైన 80 జీఎస్‌ఎం ఆర్ట్ పేపర్‌ను వినియోగిస్తున్నారు. స్కూళ్లు తెరిచేనాటికే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక కింద అందించే కిట్లలో ఇతర వస్తువులతో పాటు అన్ని పుస్తకాలు అందిస్తారు. ఇందుకోసం మే 31 నాటికి మొదటి సెమిస్టర్ పుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు చేరతాయి. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక ప్రభుత్వ పాఠశాలల్లో చేరే అదనపు విద్యార్థులకు కూడా పుస్తకాలను అందించేందుకు 5 శాతం పాఠ్య పుస్తకాలను బఫర్ స్టాక్‌గా ఉంచుతారు.

అన్ని మాధ్యమాలకూ ద్విభాషా పుస్తకాలు

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియంతో పాటు ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, కన్నడ మాధ్యమం స్కూళ్లు కూడా ఉన్నాయి. తెలుగు మాధ్యమం విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ ద్విభాషా పుస్తకాలు ఇస్తారు. ఇతర మీడియం విద్యార్థులకు కూడా ఇంగ్లిష్‌తోపాటు వారు ఎంచుకున్న భాష ఉన్న ద్విభాషా పుస్తకాలు అందిస్తారు. దీంతోపాటు సవర, కొండ, కోయ, సుగాలి వంటి గిరిజన విద్యార్థులకు కూడా ఇదే విధానంలో పుస్తకాలు ముద్రిస్తున్నారు. ఇప్పటికే 1 నుంచి 9 తరగతులు ఇంగ్లిస్ మీడియంలోకి మారాయి. 2024–25 విద్యా సంవత్సరం నుంచి 10వ తరగతి కూడా ఇంగ్లిష్ మీడియంలోకి వస్తుంది. దీంతో 1 నుంచి 10 వరకు నూరు శాతం ఇంగ్లిష్ మీడియం బోధనలోకి వస్తుంది. విద్యార్థులకు స్థానిక సంస్కృతులు, జాతీయ అంశాలపై అవగాహన ఉండేలా తరగతులను మూడు కేటగిరీలుగా విభజించి సిలబస్ రూపొందించారు. 1 నుంచి 5 తరగతులకు 100 శాతం ఎన్సీఈఆర్టీ సిలబస్ ఉంటుంది. 6, 7 తరగతులకు ఇంగ్లిష్, సైన్సు, లెక్కల్లో ఎన్సీఈఆర్టీ సిలబస్, తెలుగు, హిందీ, సోషల్ స్టేట్ సిలబస్ ఉంటాయి. 8, 9, 10 తరగతులకు ఫస్ట్, సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు, హిందీ) మినహా మిగతా సబ్జెక్టులన్నీ ఎన్సీఈఆర్టీ సిలబస్ ఉంటాయి.

స్థానిక ముద్రణ సంస్థలకు 25%అవకాశం

పాఠ్య పుస్తకాల ముద్రణ బిడ్‌ను ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీకి చెందిన పితాంబరా ప్రెస్ దక్కించు కుంది. ఈ సంస్థ 1 నుంచి 5, 7 తరగతుల పుస్తకాలు ముద్రిస్తుంది. పేజీకి రూ.0.33 ధర నిర్ణయించారు. స్థానిక ఎంఎస్‌ఎంఈలకు కూడా అవకాశం కల్పించడానికి 6, 8, 9, 10 తరగతుల పుస్తకాల ముద్రణ అప్పగిస్తారు. ఈ మేరకు ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించారు.

శ్రీవారి సేవలో జస్టిస్ శ్యాంసుందర్



కుటుంబ సభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా..టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో మ్యూజిక్ డైరెక్టర్ తమన్, సినీ నటుడు అశ్విన్, సినీ నిర్మాత అశ్వినీదత్ ఉన్నారు.

మోపిదేవిలో జస్టిస్ గోపాలకృష్ణారావు



జస్టిస్ గోపాలకృష్ణారావుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్

మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ ప్రకాష్ పాల్గొన్నారు.

పండ్ల ఉత్పత్తిలో దేశంలోనే ఏపీ అగ్రగామి

- రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్
- 2023–24లో ఏపీలో 1,81,11,600 టన్నుల పండ్ల ఉత్పత్తి
- కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తొలి ముందస్తు అంచనాల్లో వెల్లడి

ఉద్యాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుండటంతో పండ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ రూపాల్లో సాయం అందిస్తుండటంతో పండ్ల రైతులు ఈ ఘనత సాధించారు. దేశవ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 11,20,77,190 టన్నుల పండ్లు ఉత్పత్తి కాగా.. ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటా అత్యధికంగా 16.16 శాతంగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వారీగా పండ్ల ఉత్పత్తి, సాగు విస్తీర్ణంపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ తొలి ముందస్తు అంచనాలను సోమవారం వెల్లడించింది.

సాక్షి, అమరావతి



1.81 కోట్ల టన్నులతో మనమే టాప్


2023–24 ఆర్థిక ఏడాదిలో 1,81,11,600 టన్నుల పండ్ల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ తరువాత మహారాష్ట్ర 1,42,78,250 టన్నుల పండ్లు ఉత్పత్తితో రెండో స్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్ 1,27,02,060 టన్నుల పండ్ల ఉత్పత్తితో మూడో స్థానంలో నిలిచింది. అరటి ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానంలో ఉండగా.. తమిళనాడు రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్ మూడో స్థానంలో నిలిచాయి. బత్తాయి ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో తెలంగాణ నిలిచాయి. నిమ్మ ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానంలో కొనసాగుతుండగా.. రెండో స్థానంలో గుజరాత్, మూడో స్థానంలో మధ్యప్రదేశ్ నిలిచాయి. మామిడి ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. బొప్పాయి ఉత్పత్తిలో గుజరాత్ మొదటి స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం మహారాష్ట్రలో ఎక్కువగా ఉన్నప్పటికీ.. తక్కువ విస్తీర్ణమే ఉన్నా పండ్ల ఉత్పత్తిలో మాత్రం ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన ఉండటం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లో పండ్లు సాగు విస్తీర్ణం 7,80,310 హెక్టార్లు ఉండగా.. మహారాష్ట్రలో 8,48,370 హెక్టార్లలో పండ్ల సాగు విస్తీర్ణం ఉంది.

2023-24లో దేశంలో అత్యధికంగా పండ్లు ఉత్పత్తి చేసిన టాప్-3 రాష్ట్రాలు

రాష్ట్రం	ఉత్పత్తి (టన్నుల్లో)
ఆంధ్రప్రదేశ్	1,81,11,600
మహారాష్ట్ర	1,42,78,250
ఉత్తరప్రదేశ్	1,27,02,060
బత్తాయి పండ్ల ఉత్పత్తిలో టాప్-3 రాష్ట్రాలు	
ఆంధ్రప్రదేశ్	22,57,420
మహారాష్ట్ర	8,10,600
తెలంగాణ	5,59,030
అరటి పండ్ల ఉత్పత్తిలో టాప్-3 రాష్ట్రాలు	
ఆంధ్రప్రదేశ్	61,16,940
తమిళనాడు	48,20,560
ఉత్తరప్రదేశ్	41,64,340
నిమ్మ ఉత్పత్తిలో టాప్-3 రాష్ట్రాలు	
ఆంధ్రప్రదేశ్	9,05,260
గుజరాత్	6,37,090
మధ్యప్రదేశ్	4,05,830
మామిడి ఉత్పత్తిలో టాప్-2 రాష్ట్రాలు	
ఉత్తరప్రదేశ్	53,84,900
ఆంధ్రప్రదేశ్	49,85,280
బొప్పాయి ఉత్పత్తిలో టాప్-2 రాష్ట్రాలు	
గుజరాత్	11,05,520
ఆంధ్రప్రదేశ్	9,77,780

పిల్లల సంరక్షణ సెలవుపై నిబంధన తొలగింపు

- మహిళా ఉద్యోగి రిటైరయ్యేలోగా 180 రోజులు వినియోగించుకోవచ్చు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవుపై గతంలో విధించిన నిబంధనను ప్రభుత్వం తొలగించింది. మహిళా ఉద్యోగుల పిల్లల వయసు 18 ఏళ్లలోపే ఈ సెలవులను వినియోగించుకోవాలనే నిబంధన ఉంది. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు పిల్లల సంరక్షణ సెలవు వినియోగంపై విధించిన నిబంధనను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా ఉద్యోగులు రిటైరయ్యేలోపు ఎప్పుడైనా పిల్లల సంరక్షణకు సంబంధించిన 180 రోజుల సెలవును వినియోగించుకోవచ్చని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

అసెంబ్లీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు

ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు అసెంబ్లీ ఉద్యోగులకు ఏపీ సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్ శ్రీలక్ష్మి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ సూచన మేరకు పిచ్చుకలపాలెంలో అసెంబ్లీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించినట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 2019 జనవరి, ఫిబ్రవరి నెలల్లో జారీ చేసిన జీవోల ప్రకారం ప్లాట్ సైజు, చదరపు గజం ధరను సీఆర్‌డీఏ కమిషనర్ నిర్ణయించి తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా ఉత్తర్వుల్లో సూచించారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవు వినియోగంపై నిబంధనను తొలగిస్తూ, అసెంబ్లీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీకి 11.536 ఎకరాలు.. తెలంగాణకు 8.245 ఎకరాలు



ఏపీ భవన్..



తెలంగాణ భవన్..

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ విభజన పూర్తయింది. ఏపీకి 11.536 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలను కేటాయిస్తూ శనివారం కేంద్ర హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన జరగలేదు. ఇటీవల రెండు రాష్ట్రాల ప్రభుత్వాల అధికారుల సమన్వయంతో విభజన పూర్తయింది. ఢిల్లీలోని అశోకా రోడ్‌లోని ఆంధ్రప్రదేశ్ భవన్ 19.781 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం దీని విలువ రూ.9,913.505 కోట్లు ఉన్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. పంపకాల్లో భాగంగా ఏపీకి 58.32 శాతం వాటా దక్కగా, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు దక్కాయి.

ఏపీ భవన్‌కు ఇలా

19.781 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భవన్‌ను రెండు భాగాలుగా విభజించారు. విభజనలో భాగంగా ఏపీకి 11.536 ఎకరాలను అప్పగించారు. దీనిలో 5.781 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఏపీ భవన్, 4.315 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గోదావరి బ్లాక్, 3.359 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నర్సింగ్ హాస్టల్, 2.396 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పటౌడీ హౌస్‌ను కేటాయించారు. 0.512 విస్తీర్ణంలో ఉన్న ఇంటర్నల్ రోడ్డు, 0.954 విస్తీర్ణంలోని శబరీ బ్లాక్ కొంత భాగాన్ని అప్పగించారు. ఏపీకి కేటాయించిన స్థలం విలువ రూ.5,781.416కోట్లు.

తెలంగాణ భవన్‌కు ఇలా..

విభజనలో భాగంగా తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించారు. దీనిలో మూడెకరాల విస్తీర్ణంలో ఉన్న శబరీ బ్లాక్, 5.245 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పటౌడీ హౌస్‌ను కేటాయించారు. తెలంగాణకు కేటాయించిన 8.245 ఎకరాల విలువ రూ.4,132.089 కోట్లు.

అమెరికాలో బుర్రిపాలెం విద్యార్థి అనుమానాస్పద మృతి

స్వగ్రామంలో అంత్యక్రియలు



బుర్రిపాలెంలో అభిజిత్ భౌతికకాయం

తెనాలిరూరల్: అమెరికాలోని కనెక్టికట్‌లో నివశిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పరుచూరి చక్రధర్, శ్రీలక్ష్మి దంపతుల తనయుడు అభిజిత్ (20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పరుచూరి చక్రధర్, శ్రీలక్ష్మిలు ఎన్నో ఏళ్ల క్రితమే బుర్రిపాలెం నుంచి అమెరికాలోని కనెక్టికట్ వెళ్లి అక్కడే వ్యాపారంలో స్థిరపడ్డారు. వీరి కుమారుడు అభిజిత్ బోస్టన్‌లోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ నెల 8వ తేదీ నుంచి అభిజిత్ నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సెల్ నంబర్ ఆధారంగా అభిజిత్ మృతదేహాన్ని బోస్టన్ సమీపంలోని అడవి ప్రాంతంలో అదే రోజు గుర్తించారు. ఇది హత్యా, ఆత్మహత్యా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా అభిజిత్ భౌతిక కాయం అమెరికా నుంచి శుక్రవారం రాత్రి స్వస్థలం బుర్రిపాలెం చేరుకుంది. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ భౌతికకాయాన్ని సందర్శించి, అభిజిత్ తల్లిదండ్రులను పరామర్శించారు.

షూరిటీల పేరుతో మార్గదర్శి వేధింపులు

మార్గదర్శి చిట్స్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముష్టి శ్రీనివాస్

నరసరావుపేట రూరల్: షూరిటీల పేరుతో ఖాతాదారులను మార్గదర్శి చిట్స్ యాజమాన్యం వేధిస్తోందని మార్గదర్శి చిట్స్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముష్టి శ్రీనివాస్ తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చిట్ పాడుకున్న ఖాతాదారులకు సకాలంలో నగదు చెల్లించడం లేదన్నారు. షూరిటీలు సరిపోవనే నెపంతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. దీంతో పాటు ఆ నగదులో కొంత ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని ఖాతాదారులపై ఒత్తిడి తీసుకువస్తారని చెప్పారు. చట్టవ్యతిరేకంగా మార్గదర్శిలో చిట్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. చిట్ గ్రూప్‌లోని సభ్యులందరికీ ఎప్పటికప్పుడు సమాచారం అందించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. నెలవారీ నగదును డిపాజిట్ చేసే బ్యాంక్ వివరాలు కూడా చిట్ సభ్యులకు తెలియజేయాల్సి ఉంటుందని చెప్పారు. అయితే దీనిపై న్యాయస్థానాన్ని కూడా తప్పుదోవ పట్టించే విధంగా మార్గదర్శి చిట్ వ్యవహరిస్తోందని తెలిపారు. సకాలంలో చిట్ నగదు చెల్లించలేదనే నెపంతో జరిమానాలు, వడ్డీలు వేస్తున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు అధిక శాతం సభ్యులుగా మార్గదర్శి చిట్స్‌లో ఉన్నారని తెలిపారు. వీరి నుంచి అధిక మొత్తంలో వసూళ్లు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 270 మంది ఖాతాదారులు మార్గదర్శి చిట్స్‌లో మోసపోయామని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈవిధంగా పల్నాడు జిల్లాలో 18 మంది ముందుకు వచ్చారని వివరించారు. నరసరావుపేట డిప్యూటీ రిజిస్ట్రార్ చిట్స్, మార్గదర్శి బ్రాంచ్ మేనేజర్‌తో కుమ్మక్కై ఖాతాదారులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. చిట్ నగదు చెల్లించిన ఖాతాదారుల ఆస్తులను జప్తు చేసుకునే విధంగా మార్గదర్శి యాజమాన్యానికి అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. మార్గదర్శి చిట్స్‌లో మోసపోయిన బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

డీఏల విడుదలపై హర్షం



వెంకటప్ప రెడ్డి

సాక్షి, అమరావతి: ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయడంపై ఏపీ వర్సిటీల నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటప్ప రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యంగా రెండు డీఏల విడుదలతో చిన్న ఉద్యోగులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఉద్యోగుల తరఫున సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమం కోరుకునే ప్రభుత్వం: వైఎస్సార్‌టీఏ

ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు డీఏలను ప్రకటించడంపై వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తంచేసింది. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను ఒకేసారి ఇవ్వడం ఆనందంగా ఉందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్ కుమార్‌రెడ్డి, జి.సుధీర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

1	2	3	4	5	6	7
ఏప్రిల్ 19	ఏప్రిల్ 26	మే 7	మే 13	మే 20	మే 25	జూన్ 1
లోక్‌సభ స్థానాలు: 102	లోక్‌సభ స్థానాలు: 89	లోక్‌సభ స్థానాలు: 94	లోక్‌సభ స్థానాలు: 96	లోక్‌సభ స్థానాలు: 49	లోక్‌సభ స్థానాలు: 57	లోక్‌సభ స్థానాలు: 57
21 రాష్ట్రాల పరిధిలో	13 రాష్ట్రాల పరిధిలో	12 రాష్ట్రాల పరిధిలో	10 రాష్ట్రాల పరిధిలో	8 రాష్ట్రాల పరిధిలో	7 రాష్ట్రాల పరిధిలో	8 రాష్ట్రాల పరిధిలో
అసెంబ్లీ ఎన్నికలు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం	•	•	అసెంబ్లీ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్, ఒడిశా	అసెంబ్లీ ఎన్నికలు ఒడిశా	అసెంబ్లీ ఎన్నికలు ఒడిశా	అసెంబ్లీ ఎన్నికలు ఒడిశా

మొత్తం లోక్‌సభ స్థానాలకు, 4 రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలకు జూన్ 4న ఒకే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

సార్వత్రిక సమరం

2024 ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 దాకా ఏడు విడతల్లో పోలింగ్

- దేశంలో మొత్తం ఓటర్లు **97.8** కోట్లు
- పురుషులు **49.72** కోట్లు
- మహిళలు **47.1** కోట్లు
- తొలిసారి ఓటర్లు **1.89** కోట్లు
- 18-19 ఏళ్ల మధ్య వయస్కులు **85.3** లక్షలు
- యువ ఓటర్లు **19.74** కోట్లు (20-29 ఏళ్ల మధ్య వయస్కులు)
- 85 ఏళ్లు పైబడ్డ ఓటర్లు **82** లక్షలు
- 100 ఏళ్లు దాటిన ఓటర్లు **2.18** లక్షలు
- సర్వీస్ ఓటర్లు **19.1** లక్షలు
- దివ్యాంగ ఓటర్లు **88.4** లక్షలు
- ట్రాన్స్‌జెండర్లు **48** వేల పైచిలుకు
- దేశవ్యాప్తంగా పోలింగ్ స్టేషన్లు **10.48** లక్షలు
- పోలింగ్, సెక్యూరిటీ సిబ్బంది **1.5** కోట్లు
- ఈవీఎంల సంఖ్య **55** లక్షలు
- మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు **12**

సాక్షి, న్యూఢిల్లీ

సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. 18వ లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వ తేదీ వరకు మొత్తం ఏడు విడతల్లో దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతాయని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించారు. ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధుతో కలిసి శనివారం ఢిల్లీలో ఆయన ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా లోక్‌సభతో పాటే ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలోని 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలతో పాటు తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు కూడా మే 13 న నాలుగో విడతలో పోలింగ్ జరగనుంది. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలన్నింటికీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ జూన్ 4న జరుగుతుంది. అదే రోజు ఫలితాలు వెల్లడవుతాయి. షెడ్యూల్ విడుదలవడంతోనే దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినట్టు సీఈసీ ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయని సీఈసీ ప్రకటించారు. షెడ్యూల్ నుంచి ఫలితాల వెల్లడి దాకా చూసుకుంటే ఈసారి ఎన్నికల ప్రక్రియ ఏకంగా 82 రోజుల సాగనుండటం విశేషం! 1952లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల 119 రోజుల పాటు జరిగాయి. తర్వాత అత్యంత సుదీర్ఘమైన ఎన్నికల ప్రక్రియ ఇదే కానుంది. తమిళనాడుతో పాటు 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తొలి విడతలోనే పోలింగ్ పూర్తవుతోంది. మొత్తమ్మీద 23 రాష్ట్రాలు, యూటీల్లో ఒకే విడతలో; యూపీ, పశ్చిమబెంగాల్, బిహార్లలో మొత్తం ఏడు దశల్లోనూ పోలింగ్ జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ''సుపరిపాలన, అన్ని రంగాలకూ అందించిన అభివృద్ధి ఫలాల ప్రాతిపదికన అధికార పక్షం ఎన్నికల బరిలో దిగుతుండటం గత పదేళ్ల బీజేపీ పాలనలో భారత్ సాధించిన అద్భుత మార్పు'' అని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నియంతృత్వం బారినుంచి కాపాడేందుకు ఈ ఎన్నికలు బహుశా చివరి అవకాశమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు.

ప్రపంచానికే తలమానికంగా...

ప్రపంచానికే ప్రామాణికంగా నిలిచిపోయేలా ఈసారి ఎన్నికలను నిర్వహిస్తామని సీఈసీ రాజీవ్‌కుమార్ ప్రకటించారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో 91.2 కోట్ల మంది ఓటర్లుండగా 61.5 కోట్ల మంది, అంటే 67.4 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి ఓటింగ్ శాతాన్ని ఇతోధికంగా పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు సీఈసీ వివరించారు. అందుకోసం వయోవృద్ధ, వికలాంగ ఓటర్లకు ఇంటి నుంచే ఓటు సదుపాయం వంటి పలు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఓటు హక్కున్న ప్రతి ఒక్కరూ విధిగా ఓటేయాలని కోరారు. రీ పోలింగ్ తదితరాలకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తామన్నారు.

విడత	నోటిఫికేషన్	నామినేషన్లకు చివరి తేదీ	పరిశీలన	ఉపసంహరణ
1	మార్చి 20	మార్చి 27	మార్చి 28	మార్చి 30
2	మార్చి 28	ఏప్రిల్ 4	ఏప్రిల్ 5	ఏప్రిల్ 8
3	ఏప్రిల్ 12	ఏప్రిల్ 19	ఏప్రిల్ 20	ఏప్రిల్ 22
4	ఏప్రిల్ 18	ఏప్రిల్ 25	ఏప్రిల్ 26	ఏప్రిల్ 29
5	ఏప్రిల్ 26	మే 3	మే 4	మే 6
6	ఏప్రిల్ 29	మే 6	మే 7	మే 9
7	మే 7	మే 14	మే 15	మే 17

2022–23లో 11 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా భారీగా నగదు జప్తు చేసినట్లు వెల్లడించారు. అత్యధికంగా గుజరాత్‌లో రూ.802 కోట్లు, తెలంగాణలో రూ.778 కోట్లు, రాజస్తాన్‌లో రూ.704 కోట్లు జప్తు చేశారు. ఈసీ ఇంకేం చెప్పారంటే...

- జాతుల హింస బారిన పడ్డ మణిపూర్‌లో శిబిరాల్లో తలదాచుకుంటున్నవారు అక్కడే ఓటేసేలా చర్యలు తీసుకున్నాం.
- సూర్యాస్తమయం తర్వాత బ్యాంకు వాహనాల రాకపోకలు నిషిద్ధం.
- నాన్ షెడ్యూల్డ్ చార్టర్డ్ విమానాలపై పూర్తిస్థాయి నిఘా, తనిఖీ ఉంటాయి.
- అక్రమ ఆన్‌లైన్ నగదు బదిలీలపై ఆద్యంతం డేగ కన్నుంటుంది.
- అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వీవీప్యాట్ యంత్రాలు వినియోగిస్తారు.
- ప్రచారంలో చిన్నారులను ఎట్టి పరిస్థితుల్లోనూ నియోగించరాదు.



శనివారం ఢిల్లీలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తున్న సీఈసీ రాజీవ్‌కుమార్. చిత్రంలో కేంద్ర ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధు. ఓటుహక్కు ఉన్నవారంతా విధిగా ఓటేయాలని ఈ సందర్భంగా వారు ఇలా విజ్ఞప్తి చేశారు.

ఒకే విడతలో పోలింగ్ జరిగేవి

ఏప్రిల్ 19: అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, తమిళనాడు, అండమాన్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్
ఏప్రిల్ 26: కేరళ
మే 7: గోవా, గుజరాత్, దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ
మే 13: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ
మే 20: లద్దాఖ్
మే 25: హరియాణా, ఢిల్లీ
జూన్ 1: పంజాబ్, చండీగఢ్, హిమాచల్‌ప్రదేశ్

రెండు విడతల్లో పోలింగ్ జరిగేవి
మణిపూర్, రాజస్తాన్, త్రిపుర, కర్ణాటక

మూడు విడతల్లో పోలింగ్ జరిగేవి
అసోం, ఛత్తీస్‌గఢ్

నాలుగు విడతల్లో పోలింగ్ జరిగేవి
జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా

ఐదు విడతల్లో పోలింగ్ జరిగేవి
మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్

ఏడు విడతల్లో పోలింగ్ జరిగేవి
బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్

ఆ లోక్‌సభ స్థానంలో రెండు విడతల్లో పోలింగ్!

ఈసీ విడుదల చేసిన లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్లో ఒక విశేషం చోటుచేసుకుంది. మొత్తం లోక్‌సభ స్థానాలు 543 కాగా 544 స్థానాలకు పోలింగ్ జరగనున్నట్టు షెడ్యూల్లో పేర్కొన్నారు. దీనిపై విలేకరుల ప్రశ్నకు సీఈసీ వివరణ ఇచ్చారు. ''మణిపూర్‌లో జాతుల హింసతో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్న ఔటర్ మణిపూర్ లోక్‌సభ స్థానంలో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. అందుకే మొత్తం స్థానాలు 543 అయినా 544గా కనిపిస్తున్నాయి'' అని వివరించారు. ఔటర్ మణిపూర్‌లోని 15 అసెంబ్లీ స్థానాల పరిధిలో ఏప్రిల్ 19న తొలి దశలో, మిగతా 13 అసెంబ్లీ స్థానాల పరిధిలో 26న పోలింగ్ జరగనుంది.

విరాళాలపై నిఘా

పార్టీలకు అందే విరాళాలపై నిఘాకు యంత్రాంగం ఉండాలని సీఈసీ అన్నారు. ''అదేసమయంలో దాతల గోప్యతను కాపాడాలి. వారిని వేధించకూడదు. పార్టీలకు అనధికార మార్గాల గుండా అందే లెక్కలోకి రాని నిధులకు అడ్డుకట్ట వేసే ఉత్తమ వ్యవస్థ రావాలి. చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు అన్ని విషయాలూ తెలియాలి'' అన్నారు.

'4ఎం' సవాలుకు సిద్ధం

''స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో ఈసీ ముందు ప్రధానంగా నాలుగు రకాల సవాళ్లున్నాయి. అవే మజిల్ (కండ బలం), మనీ (ధన బలం), మిస్ ఇన్ఫర్మేషన్ (తప్పుడు సమాచారం), మోడల్ కోడ్ వయొలేషన్స్ (కోడ్ ఉల్లంఘన). వీటిని దీటుగా ఎదుర్కొనేందుకు ఈసీ సర్వసన్నద్ధంగా ఉంది'' అని సీఈసీ ప్రకటించారు. గత ఎన్నికల అనుభవాల ఆధారంగా ఈ దిశగా పలు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ''1.5 కోట్ల మంది భద్రతా సిబ్బందిని ఎన్నికల విధుల్లో నియోగిస్తున్నాం. జిల్లాలు, రాష్ట్రాల సరిహద్దుల వద్ద డ్రోన్ ఆధారిత తనిఖీలు, నాన్ చార్టర్డ్ విమానాలపై పూర్తిస్థాయి నిఘా ఉంటాయి. తప్పుదోవ పట్టించే ప్రకటనలు, తప్పుడు వార్తలు, ఎన్నికల హింసపై ఉక్కుపాదం మోపుతాం. కండబలానికి చెక్ పెట్టి, అభ్యర్థులందరికీ సమ న్యాయం చేసేందుకు వీలుగా కలెక్టర్లు, ఎస్పీలు అనుసరించాల్సిన పలు నియమ నిబంధనలను ఇప్పటికే జారీ చేశాం. ప్రతి జిల్లాలోనూ సమీకృత కంట్రోల్ రూములు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తుంటాయి'' అని పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘనను, ఎన్నికల హింసను సహించబోమన్నారు. వాటికి పాల్పడితే ఎంత పెద్ద నేతనైనా ఉపేక్షించేది లేదని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. ''గతంలో గట్టిగా మందలించడంతో సరిపెట్టేవాళ్లం. ఇప్పుడు మాత్రం కఠిన చర్యలు తప్పవు'' అని హెచ్చరించారు.

26 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు

అరుణాచల్‌ప్రదేశ్‌లోని 60 అసెంబ్లీ స్థానాలకు, సిక్కింలోని 32 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 19 న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఒడిశాలోని 147 అసెంబ్లీ నియోజకవర్గాలకు మే 13, మే 20, 25న, జూన్ 1ల్లో నాలుగు విడతల్లో పోలింగ్ జరుగనుంది. దేశవ్యాప్తంగా 26 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో తెలంగాణలో ఖాళీ అయిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానంలో మే 13న ఉప ఎన్నిక జరుగనుంది.

హోరాహోరీ తలపడండి, కానీ...

ఎన్నికల బరిలో పార్టీలు హోరాహోరీగా తలపడవచ్చని, అయితే ఆ క్రమంలో గీత దాటకుండా చూసుకోవాలని సీఈసీ సూచించారు. విద్వేష ప్రసంగాలకు, కుల, మతపరమైన విమర్శలు, ప్రకటనలకు, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని సూచించారు. నేతలు కూడా వ్యక్తిగత దాడికి, దిగజారుడు భాషకు నేతలు ఉండాలన్నారు. ఈ డిజిటల్ యుగంలో మాట్లాడే ప్రతి మాటా కనీసం వందేళ్ల పాటు రికార్డై ఉండిపోతుందని గుర్తుంచుకోవాలన్నారు. ''కావాల్సినంత ద్వేషించుకుందాం. కానీ తర్వాతెప్పుడైనా మిత్రులం కావాల్సొస్తే సిగ్గుపడే పరిస్థితి రాకుండా చూసుకుందాం'' అన్న ప్రసిద్ధ ఉర్దూ కవితా పంక్తిని ఈ సందర్భంగా సీఈసీ చదివి విన్పించారు! ''ప్రకటనలను వార్తలుగా చిత్రించడం, సోషల్ మీడియా పోస్టుల ద్వారా ప్రత్యర్థులను అవమానించడం, వేధించడం వంటివి కూడదు. స్టార్ ప్రచారకులు ఎన్నికల ప్రచారంలో హుందాతనాన్ని కాపాడాలి'' అన్నారు. తప్పుడు వార్తల సృష్టికర్తలపై కఠిన చర్యలు తప్పవన్నారు.

హెడ్‌లైన్లు కాదు.. డెడ్‌లైన్ల కోసం పని చేస్తున్నా

- 2047 ఎన్నికల కోసం సిద్ధమవుతున్నా..
- 'ఇండియా టుడే' సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: మీడియాలో ప్రచారం కోసం, పత్రికల్లో హెడ్‌లైన్ల కోసం తాను ఆరాటపడే వ్యక్తిని కాదని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. హెడ్‌లైన్ల కోసం కాకుండా, డెడ్‌లైన్ల కోసం పని చేస్తున్నామని స్పష్టం చేశారు. శనివారం 'ఇండియా టుడే' సదస్సులో ఆయన పాల్గొన్నారు. తొలుత ఇండియా టుడే ఎడిటర్-ఇన్-చీఫ్ అరుణ్ పురీ ప్రారంభోపన్యాసం చేశారు. 2029 జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం మోదీ సిద్ధమవుతున్నారని చెప్పారు. అనంతరం మోదీ ప్రసంగించారు. 2029 ఎన్నికల కోసం కాదు, 2047 ఎన్నికల కోసం సిద్ధమవుతున్నానని పేర్కొన్నారు. మీరు 2029లోనే ఆగిపోయారు, నేను మాత్రం 2047 కోసం ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించానని అరుణ్ పురీని ఉద్దేశించి చెప్పారు. మోదీ ఏం చేయబోతున్నారో తెలుసుకోవడానికి మీ మొత్తం బృందాన్ని రంగంలోకి దించండి అని సూచించారు. తాము వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గి, అధికారం నిలబెట్టుకుంటామని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే ఐదేళ్లలో దేశ ప్రజలు నిర్ణయాత్మక విధానాలను చూడబోతున్నారని చెప్పారు. కీలకమైన నిర్ణయాలు తీసుకొని అమలు చేయబోతున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత్ మాత్రం వృద్ధిబాటలో మరింత వేగంగా పరుగులు తీయబోతోందని స్పష్టం చేశారు. 'దేశమే ప్రథమం' అనే విధానంతో తాను ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. కొందరికి మాత్రం 'కుటుంబమే ప్రథమం' అంటూ ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. 'స్థిరమైన, సమర్థవంతమైన, బలమైన ఇండియా' అనేది వచ్చే ఐదేళ్ల కాలం ప్రపంచానికి ఇవ్వబోతున్న గ్యారంటీ అని వ్యాఖ్యానించారు. దేశంలో అభివృద్ధి కొత్త శిఖరాలకు చేరబోతోందన్నారు.

అవినీతిని సహించం

అవినీతిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఈ విషయంలో దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని ప్రధాని మోదీ అన్నారు. అవినీతిని సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తాము అవినీతిపై ఉక్కుపాదం మోపుతుండడంతో కొందరు కడుపు మంటతో రగిలిపోతున్నారని పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు తనను ఇష్టానుసారంగా దూషిస్తున్నారని, వారిని ప్రజలు ఏమాత్రం విశ్వసించడం లేదని చెప్పారు. తమ పదేళ్ల పదవీ కాలంలో పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశామని, వాటికి మీడియాలో గుర్తింపు రానప్పటికీ లబ్ధిదారులపై ఎంతో ప్రభావం చూపాయని వివరించారు. కాలం చెల్లిన వందలాది చట్టాలను, నియంత్రణలను తొలగించామని మోదీ గుర్తుచేశారు.

ఎన్నికలకు ఎన్డీయే సర్వసన్నద్ధం

- ఈసారి కూడా గెలుపు మా కూటమిదే: మోదీ
- మూడో టర్మ్‌లో చేయాల్సిన పని చాలా ఉందన్న ప్రధాని

న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) లోక్‌సభ ఎన్నికలకు సర్వసన్నద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈసారి కూడా తమ కూటమి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం ఎన్నికల సంఘం ప్రకటించిన అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పలు పోస్టులు చేశారు. 'మరోసారి మోదీ సర్కారు' అనే హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. గత పదేళ్ల తమ పాలనలో భారత్ ఎంతగానో అభివృద్ధి చెందిందని, వైభవోజ్వల మార్పును చూసిందని ఉద్ఘాటించారు. 140 కోట్ల మంది భారతీయుల శక్తియుక్తులతో అభివృద్ధిలో దేశం కొత్త రికార్డులు సృష్టించిందని హర్షం వ్యక్తంచేశారు. ప్రజలకు సుపరిపాలన అందించామని పేర్కొన్నారు. ఈ ట్రాక్ రికార్డును ఆధారంగా చేసుకొని ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలను అతిపెద్ద ప్రజాస్వామ్య వేడుకగా అభివర్ణించారు. ప్రధానమంత్రిగా వరుసగా మూడో పర్యాయం బాధ్యతలు చేపడతానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఈసారి పేదరికం, అవినీతిపై యుద్ధం వేగవంతం చేస్తానని తేల్చిచెప్పారు. సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయడం తన ధ్యేయమని పేర్కొన్నారు. మూడో టర్మ్‌లో చేయాల్సిన పని చాలా ఉందని వెల్లడించారు. దేశ ప్రగతి కోసం రాబోయే వెయ్యి సంవత్సరాలకు అవసరమైన రోడ్‌మ్యాప్‌ను వచ్చే ఐదేళ్లలో తయారు చేసుకోవాలని చెప్పారు.

ప్రజల ఆశీస్సుల నుంచే నాకు కొత్త శక్తి

దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత 70 ఏళ్లు పాలించిన ప్రభుత్వాలు సృష్టించిన ఖాళీలను గత పదేళ్ల భర్తీ చేశామని ప్రధాని మోదీ తెలియజేశారు. దేశం సౌభాగ్యవంతంగా మారుతుందని, స్వావలంబన సాధిస్తుందన్న ఆత్మవిశ్వాసాన్ని ప్రజల్లో పెంచామని వివరించారు. 'వికసిత్ భారత్' అనే లక్ష్య సాధనకు మనమంతా కలిసికట్టుగా పని చేయాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. మన దేశాన్ని ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుకోవడానికి, మన యువత కలలను సాకారం చేయడానికి మరింత పట్టుదలతో కృషి చేద్దామని సూచించారు. ప్రతిపక్షాల పరిస్థితి చుక్కాని లేని నావలా మారిందని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఎన్నికలకు వెళ్లడానికి విపక్షాలకు ఒక బలమైన అంశమే లేదన్నారు. ప్రజల కోసం కష్టపడుతున్న తమను దూషించడం, ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం తప్ప విపక్షాలకు ఇంకేమీ తెలియదని విమర్శించారు.

పాక్ సైన్యంతో ప్రమాదమే: సీడీఎస్

న్యూఢిల్లీ: పొరుగుదేశం పాకిస్తాన్ ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్నప్పటికీ, ఆ దేశ ఆర్మీతో మనకు ప్రమాదంఎప్పటిలాగానే ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యానించారు. పాక్ సైనిక సామర్థ్యం చెక్కు చెదరలేదని చెప్పారు. అయితే సరిహద్దులను, ముఖ్యంగా వివాదాస్పద ఉత్తర సరిహద్దులను కాపాడుకోగల సత్తా మన సైన్యానికి ఉందని శనివారం ఇండియా టుడే కాంక్లేవ్‌లో చెప్పారు. 'చైనా బలపడుతుండటం, ఆ దేశంతో తెగని సరిహద్దు వివాదం మనకు తక్షణ సవాలుగా మారింది. చైనా, పాక్ మనకు బద్ధ శత్రువులు. పైగా వీరివద్ద అణ్వాయుధాలున్నాయి. యుద్ధ రీతుల్లో ఎప్పటికప్పుడు అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మన ఆర్మీకి ఇదే అతి పెద్ద సవాల్‌గా మారింది. కొత్త ఆయుధ వ్యవస్థలను సమకూర్చుకోవడం, సాంకేతికతను అందిపుచ్చుకోవడం, వ్యూహాలు, ప్రతివ్యూహాలను రచించుకోవడం వంటివి కొనసాగుతున్నాయి'' అని జనరల్ చౌహాన్ చెప్పారు.

బీజేపీలో చేరిన అనురాధా పౌడ్వాల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ ప్రముఖ బాలీవుడ్ గాయని అనురాధా పౌడ్వాల్ బీజేపీలో చేరారు. శనివారం ఆమె ఢిల్లీలో బీజేపీ సీనియర్ నేతలు అరుణ్ సింగ్, అనిల్ బలూనీ తదితరుల సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. సనాతన ధర్మం కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, బీజేపీ విధానాలు ఎంతగానో నచ్చాయని అన్నారు. అందుకే బీజేపీలో చేరుతున్నట్లు ఆమె మీడియాతో పేర్కొన్నారు. మొదట్లో సినిమా పాటలు పాడిన అనురాధా పౌడ్వాల్ తర్వాత ఆధ్యాత్మిక గీతాల ద్వారా ఎక్కువ పేరు సంపాదించుకున్నారు. 2017లో కేంద్రం ఆమెను 'పద్మశ్రీ'తో గౌరవించింది.

కశ్మీర్ వేర్పాటువాద గ్రూపులపై నిషేధం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ పీపుల్స్ ఫ్రీడం లీగ్(జేకేపీఎఫ్ఎల్)తోపాటు వేర్పాటువాద హురియత్ కాన్ఫరెన్స్‌తో సంబంధమున్న జమ్మూకశ్మీర్ పీపుల్స్ లీగ్(జేకేపీఎల్)లోని అన్ని గ్రూపులపై ఉగ్రవాద వ్యతిరేక చట్టం(ఉపా) కింద కేంద్ర ప్రభుత్వం శనివారం నిషేధం విధించింది. దీంతోపాటు, ఉగ్రవాద ఆరోపణలపై జైలులో ఉన్న యాసిన్ మాలిక్ సారథ్యంలోని జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్(జేకేఎల్ఎఫ్)పై నిషేధాన్ని మరో అయిదేళ్లు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడటానికి కొద్ది గంటల ముందు ఈ నిర్ణయాన్ని వెలువరించింది. ఉగ్ర సంస్థలపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని హోం మంత్రి అమిత్ షా తెలిపారు.

లక్షద్వీప్‌లో రూ.15 మేర తగ్గిన పెట్రో ధరలు

న్యూఢిల్లీ: లక్ష ద్వీప్‌లో శనివారం నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.15 మేర తగ్గాయి. దూరంగా ఉన్న దీవులకు ఇంధనం రవాణా మౌలిక సదుపాయాల కల్పనకు గాను వసూలు చేస్తున్న ప్రత్యేక సెస్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తొలగించడంతో ఈ మేరకు ద్వీప వాసులకు ఊరట లభించింది. లక్షద్వీప్ సముదాయంలోని అంట్రోట్, కల్పేనీ దీవుల్లో పెట్రోల్, డీజిల్ లీటరుపై రూ.15.3 మేర తగ్గాయి. కవరట్టి, మినికాయ్ దీవుల్లో రూ.5.2 మేర తగ్గాయి. కవరట్టి, మినికాయ్ దీవుల్లో గతంలో లీటరు పెట్రోల్ ధర రూ.105.94 కాగా రూ.100.75కి తగ్గింది. అంట్రోట్, కల్పేనీ దీవుల్లో రూ.116.13గా ఉన్న పెట్రోల్ ధర రూ.100.75కి చేరింది. కవరట్టి, మినికాయ్ దీవుల్లో డీజిల్ ధర 110.91 నుంచి రూ.95.71కి, అంట్రోట్, కల్పేనీల్లో రూ.111.04 నుంచి రూ.95.71కి తగ్గింది.

కేజ్రీవాల్‌కు ఊరట

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. మద్యం విధానం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై విచారణకు రావాలంటూ పంపిన సమన్లకు కేజ్రీవాల్ స్పందించనందున ఆయన్ను అదుపులోకి తీసుకునేందుకు అనుమతివ్వాలంటూ ఈడీ కోర్టులో రెండుసార్లు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే, మొదటి ఫిర్యాదుపై విచారణ సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కేజ్రీవాల్ శనివారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీ రెండో ఫిర్యాదుపై మేజిస్ట్రేట్ కోర్టు విచారణ జరిపింది. ఫిర్యాదు పత్రాలను కేజ్రీవాల్‌కు అందజేయాలని ఈడీని ఆదేశించింది.

ఎలక్టోరల్ బాండ్లు అంతర్జాతీయ రాకెట్: రాహుల్



థానే: బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం ముమ్మాటికీ అంతర్జాతీయ స్థాయి బలవంతపు వసూళ్ల రాకెట్ అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ పార్టీలను చీల్చడానికి, రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలను పడగొట్టడానికి ఈ పథకాన్ని వాడుకున్నారని మండిపడ్డారు. మహారాష్ట్రలోని జాంభాలీ నాకాలో శనివారం భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్ ప్రసంగించారు. మన దేశంలో ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, నిరసన తెలిపినా ఈడీ, సీబీఐ, ఐటీ శాఖ వంటివి వెంటనే దాడులకు దిగుతున్నాయని విమర్శించారు. మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేన పార్టీలు రెండుగా చీలడానికి కారణం ఏమిటో చెప్పాలని బీజేపీని ప్రశ్నించారు. దేశ జనాభాలో 80 శాతం ఉన్న బీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదలకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం లేదని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట వేడుకకు కేవలం సంపన్న పారిశ్రామికవేత్తలను, సినిమా నటులను మాత్రమే ఆహ్వానించారని, పేదలను పక్కనపెట్టారని మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఆదివాసీ మహిళ అయినందుకే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఆహ్వానించలేదని ఆరోపించారు.

కాంగ్రెస్‌పై బీజేపీ సర్జికల్ స్ట్రైక్: జైరాం

లోక్‌సభ ఎన్నికల ముందు బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం ద్వారా తమపై బీజేపీ ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్‌కు దిగిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. దాంతో పార్టీ ఆర్థికంగా శక్తిహీనంగా మారిందని చెప్పారు. ఎన్నికల ప్రచారానికి కూడా ఇప్పుడు తమ వద్ద డబ్బు లేదని అన్నారు. బాండ్ల ముసుగులో బీజేపీ చట్టవిరుద్ధంగా నిధులు కొల్లగొట్టిందని ఆరోపించారు.

'పీఎం సూర్య ఘర్'కు కోటి రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ: సుమారు నెల క్రితం ప్రారంభించిన రూఫ్ టాప్ సోలార్ స్కీం 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన'కు అనూహ్య స్పందన వచ్చిందని ప్రధాని మోదీ తెలిపారు. ఈ పథకం కోసం ఇప్పటికే కోటి మందికిపైగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం అద్భుతమంటూ శనివారం 'ఎక్స్'లో హర్షం వ్యక్తం చేశారు. అస్సాం, బిహార్, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ఎక్కువ రిజిస్ట్రేషన్లు అయ్యాయన్నారు. ఇప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు సాధ్యమైనంత త్వరగా ఆ పని చేయాలని సూచించారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 17 । మార్చి । 2024



టిడ్కో ఇళ్ల పత్రాల పంపిణీ

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు శనివారం ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్ గృహ స్వాధీన ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కానూరుకు చెందిన కాకర్ల పూర్ణచంద్రరావు పేరిట కాకర్ల శ్రీదేవి శనివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు ప్రారంభం

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో అభివృద్ధి చేసిన రెడ్యూస్– రీసైకిల్– రీయూజ్ ప్రాజెక్టును మేయర్ భాగ్యలక్ష్మితో కలసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. –8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహరి (సోమ)
విజయవాడ	6.23	4.56
జగ్గయ్యపేట	6.25	5.03
మచిలీపట్నం	6.22	4.54
గుడివాడ	6.23	4.56

న్యూస్‌రీల్

అమరజీవి త్యాగం చిరస్మరణీయం

జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్




గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చాలా గొప్పదని, మరువలేనిదని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం శనివారం జరిగింది. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయమన్నారు. ప్రేమ, నిస్వార్థంతో కూడిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ సీహెచ్ నాగలక్ష్మి, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

20న నాంచారమ్మ జాతరపై సమీక్ష



కోడూరు(అవనిగడ్డ): కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర ఏర్పాట్లకు సంబంధించి ఈ నెల 20న ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే జాతరపై బందరు ఆర్డీఓ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరపనున్నట్లు చెప్పారు. దేవాలయ ప్రాంగణంలో జరిగే ఈ సమీక్షకు అన్ని శాఖలాధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ ఆదేశించారు.

దుర్గమ్మకు రూ.6 లక్షల బంగారు హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు రాయచూర్‌కు చెందిన భక్తులు శనివారం బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. రాయచూర్‌కు చెందిన ఇ.రమేష్ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ కె.ఎస్.రామరావును కలిసి సుమారు రూ.6 లక్షలు వెచ్చించి 85 గ్రాముల బంగారంతో తయారు చేయించిన స్టెప్పుల హారం కానుకగా సమర్పించారు. ఈఓ రామరావు దాతలకు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

గెలుపు గుర్రాలు సిద్ధం

ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రకటన

- ఒక ఎంపీ, ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులు రెడీ
- సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన పార్టీ
- ఉత్సాహంతో ఉరకలేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల బరిలో నిలిచే వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సిద్ధమయ్యారు. ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థుల జాబితాను వైఎస్సార్ సీపీ ప్రకటించింది. వైఎస్సార్ కడప జిల్లా, ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వేదికగా పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఈ ప్రకటన శనివారం వెలువడింది. ఎమ్మెల్యే జాబితాను ధర్మానప్రసాద్, ఎంపీ అభ్యర్థుల జాబితాను నందిగం సురేష్ ప్రకటించారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా నియమించిన వారినే అభ్యర్థులుగా ఖరారు చేశారు. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున బరిలో నిలిచే గెలుపు గుర్రాలపైన స్పష్టత రావడంతో ఆయా నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడిన నేపథ్యంలో సమరోత్సాహంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఎన్నికల బరిలో దిగుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గాలను చుట్టేసిన అభ్యర్థులు, మరో సారి పండుగ వాతావరణంలో ఓటరు దేవుళ్లను కలుసుకొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పార్టీ అభ్యర్థుల ప్రకటన వెలువడగానే ఎంపీ కేశినేని కార్యాలయం వద్ద, పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. గన్నవరంలో ఎమ్మెల్యే వంశీ అభిమానులు, కేరింతలు కొట్టారు. అభ్యర్థుల ప్రకటన వెలువడగానే జిల్లా వ్యాప్తంగా వాడవాడలా వైఎస్సార్ సీపీ అభిమానులు సంబరాలు చేసుకొన్నారు. తమ అభ్యర్థుల గెలుపుఖాయమని, మరో సారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సామాజిక న్యాయానికి పెద్దపీట

గతంలో ఎన్నడూ లేని విధంగా సామాజిక న్యాయాన్ని మాటల్లోనే, కాదు చేతల్లో చేసి చూపించిన నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. జిల్లాలో ప్రకటించిన ఏడు అసెంబ్లీ స్థానాల్లో రెండు ఎస్సీలకు, ఒకటి ముస్లిం మైనార్టీకి, ఒకటి బీసీకి, మూడు ఓసీలకు కేటాయించారు. మైలవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ యాదవ వర్గానికి చెందిన సామాన్యుడు సర్నాల తిరుపతిరావును ప్రకటించారు. ఇది సామాజిక న్యాయానికి అద్దం పడుతోంది. విజయవాడ వెస్ట్‌లో సైతం ఓసీ అభ్యర్థి స్థానంలో ముస్లిం మైనార్టీ అభ్యర్థి ఆసిఫ్‌కు చోటు కల్పించారు. విజయవాడ ఎంపీ అభ్యర్థిగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన కేశినేని శ్రీనివాస్ (నాని)ను ప్రకటించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, పెనమలూరు, గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థులుగా జోగి రమేష్, వల్లభనేని వంశీమోహన్ పోటీ చేస్తున్నారు.



విజయవాడ బైపాస్ రోడ్‌లో ఆసిఫ్‌తో కలిసి కేరింతలు కొడుతున్న పార్టీ శ్రేణులు



ఎంపీ కేశినేని కార్యాలయం ఎదుట బాణసంచాతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సంబరాలు



నియోజకవర్గం: విజయవాడ తూర్పు
పేరు: దేవినేని అవినాష్
వయస్సు: 35
విద్యార్హత: ఎంబీఏ
సామాజిక వర్గం: కమ్మ
ఎన్నికల్లో పోటీ: మూడోసారి



నియోజకవర్గం: విజయవాడ పశ్చిమ
పేరు: : షేక్ ఆసిఫ్
వయస్సు: 56
విద్యార్హత: పదో తరగతి
సామాజిక వర్గం: ముస్లిం మైనారిటీ
ఎమ్మెల్యేగా పోటీ: మొదటి సారి




నియోజకవర్గం: విజయవాడ సెంట్రల్
పేరు: వెలంపల్లి శ్రీనివాసరావు
వయస్సు: 53
విద్యార్హత: 10 వ తరగతి
సామాజికవర్గం: ఓసీ, ఆర్య వైశ్యులు
ఎమ్మెల్యేగా పోటీ: నాలుగో సారి



నియోజకవర్గం: మైలవరం
పేరు: సర్నాల తిరుపతిరావు
వయస్సు: 39
కులం: బీసీ (యాదవ)
విద్యా అర్హత: పదో తరగతి
ఎన్నికల్లో పోటీ: మొదటి సారి




నియోజకవర్గం: తిరువూరు
పేరు: నల్లగట్ల స్వామిదాసు
వయస్సు: 59
విద్యార్హత: ఎంఏ, బీఈడీ
సామాజిక వర్గం: ఎస్సీ (మాదిగ)
ఎమ్మెల్యేగా పోటీ: ఆరో సారి



నియోజకవర్గం: నందిగామ
పేరు: మొండితోక జగన్మోహన్ రావు
వయస్సు: 59
విద్యార్హత: ఎంబీబీఎస్, ఎండి
సామాజిక వర్గం: ఎస్సీ (మాదిగ)
ఎమ్మెల్యేగా పోటీ: మూడో సారి

విజయవాడ పార్లమెంట్



పేరు: కేశినేని శ్రీనివాస్ (నాని)
వయసు: 58
విద్యార్హత: ఇంటర్మీడియెట్
సామాజికవర్గం: ఓసీ (కమ్మ)
ఎంపీగా పోటీ: మూడో సారి

మచిలీపట్నం పార్లమెంట్ (కృష్ణా)



పేరు : డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు
వయసు: 70
కులం : (కాపు ఓసీ)
విద్యార్హతలు: ఎంబీబీఎస్, ఎంఎస్ (కేన్సర్ వైద్య నిపుణుడు)
ఎంపీగా పోటీ: మొదటి సారి



నియోజకవర్గం: జగ్గయ్యపేట
పేరు: సామినేని ఉదయభాను
వయస్సు : 65
విద్యార్హత: బీకాం
సామాజిక వర్గం: ఓసీ (కాపు)
ఎమ్మెల్యేగా పోటీ: ఆరో సారి



నియోజకవర్గం : పెనమలూరు (కృష్ణా)
పేరు : జోగి రమేష్
వయస్సు : 54
విద్యార్హత : బీఎస్సీ
కులం : బీసీ (గౌడ)
ఎమ్మెల్యేగా పోటీ: నాలుగో సారి



నియోజకవర్గం: గన్నవరం (కృష్ణా)
పేరు: డాక్టర్ వల్లభనేని వంశీమోహన్
వయస్సు: 53
విద్యార్హత: ఎంపీఎస్సీ
సామాజికవర్గం: ఓసీ (కమ్మ)
ఎమ్మెల్యేగా పోటీ: మూడో సారి
(ఒక సారి ఎంపీగా పోటీ)

కోడ్ కూసింది..

- సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్న కలెక్టర్ ఢిల్లీరావు
- ఓటు వేయనున్న 16,74,995 మంది ఓటర్లు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ శనివారం విడుదల చేసింది. ఎన్నికల నగారా మోగిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ఏప్రిల్ 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మే 13వ తేదీన ఎన్టీఆర్ జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఓ ఎంపీ స్థానానికి పోలింగ్ జరగనుంది. జిల్లాలో 16,74,995 మంది ఓటర్ల కోసం 685 ప్రాంతాల్లో 1,781 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు.

అమలులో ఎన్నికల ప్రవర్తనా నియమావళి

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. జిల్లాలో ఈసీఐ మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 24 గంటల్లోపు ప్రభుత్వ ఆస్తులపై గల అన్ని రకాల వాల్ రైటింగ్స్, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలను తదితరాలను తొలగించాలని స్పష్టం చేశారు. పబ్లిక్ ఆస్తుల వద్ద, బస్టాండ్, రైల్వే స్టేషన్, రైల్వే వంతెనలు, రోడ్ వేలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, పేపర్లు, కటౌట్‌లు, హోర్డింగ్‌లు, బ్యానర్‌లు, జెండాలు, రాజకీయ ప్రకటనలు మొదలైన వాటిని 48 గంటల్లోపు తొలగించాలన్నారు. ప్రభుత్వ ఖర్చుతో ప్రభుత్వం సాధించిన విజయాలను చూపే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలను వెంటనే నిలిపివేయాలన్నారు. ఇప్పటికే ప్రారంభించిన పనులు, ప్రారంభించని తాజా పనుల జాబితాలు, అభివృద్ధి, నిర్మాణానికి సంబంధించిన అన్ని విభాగాలు, ఎంసీసీ ఉల్లంఘనలపై ఫిర్యాదులను పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి సూచనల కోసం అందించాలన్నారు. నియమావళి అమలుకు ముందు పంపిణీ చేసిన లబ్ధిదారుల కార్డులు, నిర్మాణ శిలాఫలకాలు మొదలైన వాటిపై రాజకీయ నాయకుల ఫొటోలకు సంబంధించి ఎటువంటి జోక్యం అవసరం లేదని కలెక్టర్ స్పష్టంచేశారు. ఎన్నికల పర్యటనల్లో మంత్రులకు ప్రభుత్వ అతిథి గృహాల్లో వసతి కల్పించరాదన్నారు. ఎంపీ ల్యాడ్, ఎమ్మెల్యే ల్యాడ్ లేదా ఇతర ప్రభుత్వ పథకాల కింద నిధులు సమకూర్చబడిన నీటి ట్యాంకులు, అంబులెన్స్‌లు తదితరాలపై ఎంపీలు, ఎమ్మెల్యేల ఫొటోలు ఉంటే వాటిని కప్పి ఉంచాలన్నారు.

వారు ప్రచారంలో పాల్గొంటే చర్యలు

జీవిత భాగస్వామి రాజకీయ రంగంలో చురుగ్గా ఉన్న అధికారులందరూ ప్రధాన కార్యదర్శి నిర్దిష్ట అనుమతి మినహా ఎన్నికలు పూర్తయ్యే వరకు సెలవుపై లేదా పర్యటనలో తమ ప్రధాన కార్యాలయాన్ని వదిలి వెళ్లకూడదని కలెక్టర్ స్పష్టంచేశారు. ప్రభుత్వోద్యోగి ప్రవర్తన నిష్పక్షపాతంగా ఉండాలి, ఏదైనా పార్టీ లేదా అభ్యర్థికి అనుకూలంగా ఉండకూడదని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ పార్టీ నిర్వహించే ఏదైనా కార్యక్రమంలో పాల్గొన్నా, రాజకీయ ప్రచారంలో పాల్గొన్నా, రాజకీయ పార్టీల నుంచి ఏదైనా ప్రయోజనం, బహుమతి పొందడం, ఎన్నికల సమయంలో అనవసరమైన ప్రభావాన్ని చూపడానికి ప్రయత్నించడం వంటి చర్యలకు పాల్పడితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఐపీసీ 171, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని 123, 129, 134, 134అ సెక్షన్లను ఉల్లంఘించే ప్రభుత్వ ఉద్యోగిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో సాధారణ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమష్టి కృషిచేయాలని కలెక్టర్ ఢిల్లీరావు కోరారు.

షెడ్యూలు ఇలా..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) శనివారం జారీచేసిన షెడ్యూల్ ప్రకారం 2024 సాధారణ ఎన్నికల నాలుగో దశలో జిల్లాలోని విజయవాడ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు మే 13వ తేదీన పోలింగ్, జూన్ నాలుగో తేదీన కౌంటింగ్ జరుగుతాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసీఐ ప్రకటించిన సాధారణ ఎన్నికల-2024 షెడ్యూల్‌కు అనుగుణంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పార్లమెంట్, శాసన సభ నియోజకవర్గాలకు ఎన్నికల నిర్వహణకు ఏప్రిల్ 18వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. ఏప్రిల్ 25 వరకూ నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన జరుగుతాయని, అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరణకు ఏప్రిల్ 29 ఆఖరు తేదీ అని వివరించారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ జూన్ ఆరో తేదీతో ముగుస్తుందని కలెక్టర్ తెలిపారు.

ప్రధాని మోదీ పర్యటనకు భద్రత కట్టుదిట్టం

విమానాశ్రయం(గన్నవరం): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా విజయ వాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర భద్రత దళాలు విమానాశ్రయాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి. చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో జరిగే బహిరంగ సభలో పాల్గొనేందుకు మోదీ ఢిల్లీ నుంచి ఆదివారం సాయంత్రం 4.10 గంటలకు ఇక్కడికి చేరుకోనున్నారు. ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో బహిరంగ సభకు వెళ్లి తిరిగి సాయంత్రం 6.55 గంటలకు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అనంతరం ఏడు గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

లోక్‌అదాలత్‌లో 3,359 కేసుల పరిష్కారం



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని ఆయా కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 3,359 కేసులు పరిష్కారమైనట్లు ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ అరుణసారిక తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో 2,116 క్రిమినల్ కేసులు, 280 కేసులు, 585 చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించామని పేర్కొన్నారు. 136 మోటారు వాహన ప్రమాద క్లెయిమ్‌లకు రూ.6.8 కోట్లు పరిహారమిచ్చేలా ఇన్సూరెన్స్ కంపెనీలు, 242 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించి అవార్డులు జారీ చేశామని తెలిపారు. మచిలీపట్నం కోర్టులో 670 కేసులు, విజయవాడలో 1,560, గుడివాడ 105, నందిగామ 174, నూజివీడు 190, మైలవరం 104, జగ్గయ్యపేట 90, బంటుమిల్లి 19, కైకలూరు 138, తిరువూరు 111, గన్నవరం 89, అవనిగడ్డ 28, మొవ్వ 42, ఉయ్యూరు కోర్టుల్లో 39 కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు.

సైబర్ మోసం.. కొత్త రూపం

- రూటు మార్చిన సైబర్ నేరగాళ్లు
- ఫేస్‌బుక్ యాడ్‌లతో బురిడీ
- పోలీసుల పేరుతోనూ దోపిడీ పర్వం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



విజయవాడస్పోర్ట్స్: సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో దోపిడీ దందా కొనసాగిస్తున్నారు. ప్రజల మానసిక స్థితిగతులను, జీవన శైలిని పూర్తిగా అర్థం చేసుకుని, వారి నాడికి అనుగుణంగానే మోసాలకు తెగబడుతున్నారు. గతంలో ఓఎల్ఎక్స్‌ను ఉపయోగించిన వారు తాజాగా ఫేస్‌బుక్ యాడ్‌లను మోసానికి వాడుకుంటున్నారు.

రూ.75 వేలకే బుల్లెట్ అంటూ..

విజయవాడ పటమటకు చెందిన ఓ బైక్ మెకానిక్ ఫేస్‌బుక్‌లో సెండ్ హ్యాండ్ బుల్లెట్ సేల్ యాడ్‌కు ఆకర్షితుడయ్యాడు. ఆరు నెలలు వాడిన బుల్లెట్‌ను రూ.75 వేలకే విక్రయిస్తామని యాడ్‌లో ఉండటంతో ఆ పోస్ట్‌లోని ఫోన్ నంబర్‌లో సంప్రదించాడు. తనది చిత్తూరని, ముందుగా రూ.50 వేలు ఫోన్ పే చేస్తే బుల్లెట్‌ను రైలులో పార్శిల్ చేస్తానంటూ నమ్మించాడు. తన నంబర్‌కు ఫోన్ పే లేదని, తన సోదరుడి నంబర్‌కు పంపాలని అవతలి వ్యక్తి చెప్పడంతో బెజవాడ మెకానిక్ నమ్మేసి డబ్బులు పంపాడు. నగదు స్వీకరించిన వెంటనే బైక్‌ను రైలులో పంపేందుకు బుక్ చేసిన రిసీప్ట్, రైలు నంబర్, విజయవాడ చేరుకునే తేదీ సహా పంపడంతో మిగిలిన రూ.25 వేలు కూడా ఫోన్ పే చేశాడు. అతను చెప్పిన తేదీకి రైలు బుకింగ్ రిసీప్ట్ పట్టుకుని మెకానిక్ స్టేషన్‌కు వెళ్లాడు. 'ఇలాంటి రిసీప్ట్‌లు పట్టుకుని ఇప్పటి వరకు పది మంది వచ్చారు. అది ఫేక్ రిసీప్ట్.' అని రైల్వే అధికారులు చెప్పడంతో మెకానిక్ కంగుతిని సైబర్ పోలీసులను ఆశ్రయించాడు. నగదు పంపిన ఫోన్ పే నంబరును ట్రాకింగ్ పెట్టి వెతుక్కుంటూ పోలీసులు వెళ్లగా శ్రీకాకుళంలో ఓ చిన్న బడ్డీ కొట్టు నడుపుకొనే వ్యక్తి నంబర్ అని తెలుసుకుని విస్తుపోయారు.


సూడో పోలీసు బెదిరింపులు

గుణదలకు చెందిన ఓ వ్యక్తికి వారం క్రితం ముంబై నుంచి ఫోన్ కాల్ వచ్చింది. 'నేను ముంబై సీబీడీ పోలీసు అధికారిని. మీ పేరున థాయ్‌లాండ్ నుంచి డ్రగ్స్‌తో కూడిన ఓ పార్శిల్ వచ్చింది. కస్టమ్స్ చెకింగ్‌లో బయటపడింది. నిన్ను అరెస్ట్ చేయడానికి ఓ ఎస్పీ, పది మంది పోలీసులు వస్తున్నారు' అంటూ గుణదల వాసిని బెదిరించాడు. నాలుగు రోజుల పాటు ఫోన్ కాల్స్‌తో నరకయాతన అనుభవించిన అతను, తనకు సంబంధం లేని ఈ కేసు నుంచి బయట పడేందుకు రూ.5 లక్షలు లంచంగా ఇచ్చేందుకు సిద్ధం పడ్డాడు. చివరికి స్నేహితుడి సలహాతో సైబర్ పోలీసులను ఆశ్రయించి వేధింపుల నుంచి బయటపడ్డాడు. ఫేక్ బుక్ యాడ్స్ (బైక్, కార్, ఇల్లు, దుస్తులు, ఐ ఫోన్స్, ల్యాప్ టాప్, గృహోపకరణాలు తదితరాలతో మోసానికి గురైన బాధితుల నుంచి గడిచిన 15 రోజుల్లో సైబర్ పోలీసులకు నాలుగు ఫిర్యాదులు అందాయి. సూడో పోలీసు బెదిరింపులకు గురైన మరో ముగ్గురు ఫిర్యాదు చేశారు.

జాగ్రత్త తపపనిసరి

ఫేస్‌బుక్ యాడ్స్ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులు ఇతరుల యూపీఐ (ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం)లను వినియోగిస్తున్నట్లు విజయవాడ సైబర్ పోలీసుల విచారణలో వెల్లడైంది. యూపీఐ యాప్‌లు బ్యాంకు ఖాతాకు అనుసంధానమై ఉండటంతో చిరు వ్యాపారులను ఈ కేసుల్లో ఇరికిస్తున్నారు. తనకు నగదు అత్యవసరమని, ఫోన్ పే నందున మా బ్రదర్ మీకు ఫోన్ పే చేస్తాడని, అందులో మీరు ఓ 10 శాతం తీసుకుని మిగిలిన నగదు ఇవ్వాలని చిరు వ్యాపారులను నమ్మిస్తున్నారు. కమీషన్‌నూ ఆశతో చిరు వ్యాపారులు నేరంలో భాగస్వాములు అవుతున్నారు. ఫోన్ పే నంబర్లను ట్రాక్ చేసుకుంటూ వెళ్లిన పోలీసులకు ఈ విషయం తెలిసి షాక్ తింటున్నారు.

అప్రమత్తతే మందు



ఫేస్‌బుక్ యాడ్స్, సూడో పోలీసు బెదిరింపులపై ప్రస్తుతం కేసులు నమోదవుతున్నాయి. సూడో పోలీసుల మోసంలో.. బాధితులను ఎవరితోనూ చెప్పుకోలేని స్థితికి తీసుకెళ్లి అంచెలంచెలుగా డబ్బులు గుంజేస్తారు. ఫేస్‌బుక్ యాడ్ మోసాలపై ప్రజలు, చిరువ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధర యాడ్‌ను అస్సలు నమ్మొద్దు. కమీషన్ వస్తుందని ఆశపడి చిరు వ్యాపారులు మోసపోవద్దు. కమీషన్ కోసం ఆశ పడితే పోలీసుల కేసులు తప్పవు.

– కోమాకుల శివాజి, సీఐ, సైబర్ పోలీస్ స్టేషన్

క్లుప్తంగా

గ్రూప్-1 పరీక్షలో బయోమెట్రిక్ విధానం లేదు

జేసీ గీతాంజలీ శర్మ



చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)ఆదివారం నిర్వహించే గ్రూప్-1 పరీక్షకు బయోమెట్రిక్ విధానం లేదని జాయింట్ కలెక్టర్, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష జిల్లా కో-ఆర్డినేషన్ అధికారి గీతాంజలిశర్మ శనివారం తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డుతో హాజరుకావాలన్నారు. గుర్తింపుకార్డును పరిశీలించిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తామని వివరించారు.

రాష్ట్ర అనుబంధ కమిటీల్లో ఐదుగురికి చోటు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఐదుగురిని వివిధ హోదాల్లో నియమించారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా జక్క శ్రీనివాసరావు, మహిళా విభాగం ప్రధానకార్యదర్శిగా నిమ్మల జ్యోతిక, కార్యదర్శిగా బూదాల సలోమి, మైనార్టీసెల్ జాయింట్ సెక్ర టరీగా షేక్ నాగుల్‌మీరా, వైఎస్సార్ టీయూసీ కార్యదర్శిగా గొర్ల గోవింద కుమార్ నియమితులయ్యారు.

జిల్లా ఎస్సీ సెల్ కమిటీ ఏర్పాటు..

ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ విభాగ కమిటీలో వివిధ హోదాల్లో పలువురిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కమిటీ అధ్యక్షులుగా పాలిమెట్ల శరత్‌బాబు, ఉపాధ్యక్షులుగా కొంగల ప్రసాదరావు, కొనకల సాయి కుమార్, జెల్లిపోగు రాజు నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా బీబీ వెంకటేశ్వరరావు, మాదల అగస్టీన్, ప్రత్తిపాటి జయరామారావు, మాతంగి వెంకటేశ్వర్లు, తాంద్ర ఇంద్రకుమార్, సాంబశివరావు, కాకి నాగేశ్వరరావు (జోజి), సొంగ సురేంద్రవర్మ, కార్యదర్శులుగా జె.జోజిరత్న కుమార్, దొంతిమాల చంద్రశేఖర్, కనకపూడి భాస్కరరావు, పంద్ర కోల శ్రీనివాసరావు, గద్దల లక్ష్మయ్య, ఇనపూరి నరసింహారావు, మద్దిరాల కమలాకర్, టి.బాలు, ఉప్పల్తి జాక్సన్, శిరికొండ కృష్ణ, మంద వెంకటరత్నం(నోవ), చాట్ల ఆదియ్య, పి.రాజు, చేకూరు శ్రీను, యాదల దాసు నియమితులయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా ఎన్.ప్రవీణ్, మాదుగుల శంకర్, వేల్పుల కిషోర్, ప్రొద్దుటూరి రాజశేఖర్, బండి రాజు, టి.సత్యనారాయణ, పి.మోషే, రుంద్ర శేఖర్, వి.శ్రీనివాసరావు, పంచగళ్ల రమేష్, పరసు అబ్రహం, మొక్కలకత్తి రమేష్, కె. ప్రసాద్, నల్లమోతు చిన్నయ్య, వేముహైమవతి, కుమ్మరి శ్రీనివాసరావు నియమితులయ్యారు.

చెత్త రహిత నగర నిర్మాణమే లక్ష్యం

- రూ. 15.50 కోట్లతో ఆర్ఆర్ఆర్ పార్కును అభివృద్ధి
- ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విజయవాడ నగరం చెత్త రహిత నగరంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ వద్ద రూ. 15.50 కోట్లతో నూతనంగా అభివృద్ధి చేసిన ఆర్ఆర్ఆర్(రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్) పార్కును మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఎండీ షాహినాసుల్తానా హఫీజుల్లాతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే నష్టాలు, పచ్చదనం ఆవశ్యకతను నేటి తరానికి తెలిసేలా ఏర్పాటు చేసిన మ్యూజియం ప్రతీ ఒక్కరిని ఆకట్టుకుంది. పారిశుద్ధ్య కార్మికుల సేవలకు గుర్తుగా ఏర్పాటు చేసిన మహిళ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఈ ప్రాంతాన్ని ఊహించలేమని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వంలో ఒక విజ్ఞాన కేంద్రంగా రూపుదిద్దుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టిలోనికి, నీటిలోనికి విషపూరిత పదార్థాలను విడుదల చేస్తాయని తెలిపారు. ఇప్పటివరకు ఉత్పత్తి కాబడిన మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాల్లో కేవలం తొమ్మిది శాతం మాత్రమే రీసైకిల్ అయిందని.. ఇటువంటి తరుణంలో ప్రజలకు అవగాహన కలిగించేలా ఆర్ఆర్ఆర్ పార్కును ప్రారంభించడం హర్షణీయమన్నారు. అలాగే తడి, పొడి, ఈ-వ్యర్థాలు, ప్రమాదకరమైన వ్యర్థాలను వేరువేరుగా సేకరించవలసిన ఆవశ్యకతను నేటి తరానికి తెలిసేలా ఎల్‌సీడీ స్క్రీన్స్ సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పారిశుద్ధ్యానికి సంబంధించి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పటికే కేంద్రం నుంచి అనేక అవార్డులు అందుకోవడం జరిగిందని గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా వీఎంసీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మరోవైపు జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు 25 వేల టన్నుల చెత్తను ఈ ప్రాంతం నుంచి తరలించినట్లు వివరించారు. ఎక్సెల్ ప్లాంట్ నుంచి గృహ సముదాయాలను వేరుచేస్తూ రూ. 1 కోటి 29 లక్షల 50 వేల వ్యయంతో ప్రహరీని సైతం నిర్మించుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు, ఐదు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో విజయవాడ నగరం ఆహ్లాదకర వాతావరణాన్ని సంతరించుకున్నట్లు వెల్లడించారు. గత ఐదేళ్లలో నగరంలో కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన అభివృద్ధిని ప్రజలందరూ గమనించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) సత్యవతి, ఈఈ(పార్కులు) ఏఎస్ఎన్ ప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జుబిన్, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

112 వాహనాలు సీజ్



నాకాబందీ నిర్వహిస్తున్న డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా

విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పశ్చిమ, దక్షిణ, ఉత్తర, సెంట్రల్ పోలీస్ డివిజన్ల పరిధిలోని ప్రాంతాల్లో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి నాకాబందీ నిర్వహించి 112 వాహనాలను సీజ్ చేశారు. డెప్యూటీ పోలీస్ కమిషనర్లు అధిరాజ్‌సింగ్ రాణా, కంచి శ్రీనివాసరావు, టి.హరికృష్ణ పర్యవేక్షణలో సోదాలు నిర్వహించారు. మద్యం సేవించి మోటారు వాహనాలు నడుపుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. 94 ద్విచక్ర వాహనాలు, 13 ఆటోలు, నాలుగు కార్లు, ఒక లారీని సీజ్ చేశారు. అదేవిధంగా కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి స్మోకర్‌ను అదుపులోనికి తీసుకుని అతని వద్ద నుంచి 25 గ్రాముల గంజాయిని, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అదుపులోని తీసుకుని అతని వద్ద నుంచి 2 లీటర్ల ఎన్డీపీఎల్ మద్యంను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం, శాంతి భద్రతలు పరిరక్షణలో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేసే వారిని గుర్తించేదిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

పురిటిగడ్డలో పురాతన విగ్రహం లభ్యం



పోతురాజు స్వామి విగ్రహం

చల్లపల్లి: చల్లపల్లి మండలం పురిటిగడ్డలో పురాతన విగ్రహం వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని పాత పోతురాజు స్వామి దేవాలయం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల గ్రామపెద్దలు ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. శిథిల ఆలయాన్ని తొలగిస్తూ ఇటీవల ఆలయంలోని పీఠంపై నుంచి ఏడు అడుగుల పొడవైన పాత పోతురాజు విగ్రహాన్ని బయటకు తీసి శుభ్రంగా కడిగి అధివాసంలో ఉంచారు. ఈ విగ్రహాన్ని శనివారం పురిటిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు ఓలేటి ఉమా సరస్వతి, గ్రామపెద్ద నాదెళ్ల శివరామకృష్ణ పరిశీలించారు. విగ్రహానికి ఓవైపు పురాతన లిపి ఉన్నట్లు గుర్తించారు. విగ్రహం రూపురేఖలు కూడా పురాతన విగ్రహాలను పోలి ఉండటంతో వెంటనే ఫొటోలు తీసి పురావస్తు శాఖ నిపుణుడు ఈమని శివనాగిరెడ్డికి పంపించారు. ఆయన ఈ విగ్రహం రూపాన్ని, ఓవైపు ఉన్న ప్రాచీన లిపిని గమనించి మూడవ శతాబ్దం నాటి విగ్రహం అయి ఉంటుందని సమాచారం అందించారు. అయితే త్వరలో పురావస్తు శాఖ అధికారులతో గ్రామానికి వచ్చి విగ్రహం పరిశీలించి ఏకాలం నాటిదో నిర్ధారిస్తామని చెప్పారని గ్రామపెద్ద నాదెళ్ల శివరామకృష్ణ తెలిపారు.

సీటు రాలేదని అల్లరిచేస్తే సస్పెండ్ చేస్తాం

జనసేన నేత బాడిత శంకర్



మాట్లాడుతున్న బాడిత శంకర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జనసేన తరఫున టికెట్ రాలేదని రోడ్లపైకి వచ్చి అల్లరి చేసేవారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని ఆపార్టీ సెంట్రల్ ఆంధ్రజోన్ కన్వీనర్ బాడిత శంకర్ హెచ్చరించారు. విజయవాడ భవానీపురంలోని వీఎంసీ కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాలకు భిన్నంగా వ్యవహరిస్తూ రోడ్డు మీదకు వచ్చి అల్లరి చేస్తే సహించేది లేదన్నారు. టికెట్లు ఇస్తామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎవరికీ హామీ ఇవ్వలేదన్నారు. ఎన్నికల్లో నీకే టికెట్ ఇస్తామని జిల్లా అధ్యక్షుడుతోపాటు పార్టీ ఇన్‌చార్జిలెవ్వరికీ చెప్పలేదన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని పొత్తుల్లో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో ఎవరికి కేటాయించినా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. నాయకులు లింగం శివప్రసాద్, వేంపల్లి గౌరీ శంకర్, సముద్రాల ప్రసాద్, అవుల ప్రసాద్, ఉమ్మడిశెట్టి కృష్ణ, ఎం.సంగీత, ఎంఎస్ఆర్ నాయుడు, బాడిత చరణ్, తంగా రవికుమార్ పాల్గొన్నారు.

కానూరులో వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన షారోన్‌రోజా

పెనమలూరు: కానూరులో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు కథనం మేరకు కానూరుకు చెందిన తొమ్మిదేళ్ల కిందట విన్నకోట షారోన్‌రోజా(29), నరేంద్రబాబు పరస్పరం ప్రేమించుకుని పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. నరేంద్రబాబు మంగళగిరిలో కార్ల యాక్సరీస్ షాపులో పనిచేస్తున్నాడు. రెండు రోజుల కిందట షారోన్‌రోజా పుట్టిల్లు తాడిగడప శ్రీనగర్‌కు వచ్చింది. కానూరులో చదువుతున్న కుమారుడిని తీసుకువస్తానని శుక్రవారం తాడిగడప నుంచి కానూరుకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఆమెతండ్రి దేవెళ్ల శివ ఫోన్‌చేయగా ఫోన్ కూడా లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చి ఆయన కానూరులోని షారోన్‌రోజా ఉంటున్న ఇంటికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెంది ఉంది. ఆమె మృతికిగల కారణాలు తెలియరాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని కార్మికుడి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

ఇబ్రహీంపట్నం: లారీ ఢీకొనడంతో ఎన్టీటీపీఎస్‌లో పనిచేస్తున్న ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం రింగ్‌సెంటర్‌లో 65వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగింది. స్థానిక కాలేజీరోడ్డులో నివాసం ఉంటున్న ఉప్పతల శ్రీనివాసరావు(42) ఎన్టీటీపీఎస్‌లో క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. అతను శనివారం విధులు ముగించుకుని తిరిగి స్కూటీపై తిరిగి వస్తుండగా ఇంటికి కొద్దిదూరంలో కారును తప్పించే క్రమంలో అతన్ని లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటికి పెద్దదిక్కు మృతి చెందడంలో కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ఉద్యోగికి టోకరా

పెనమలూరు: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్‌నేరగాళ్లు రూ.23లక్షలు స్వాహా చేసిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు ఉమాశంకర్‌నగర్‌కు చెందిన జి.శ్రీరామమూర్తి జెన్‌కోలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతని మిత్రుడి ద్వారా ఈఏడాది జనవరిలో యాంట్ రిటైల్ అలయన్స్ క్లబ్ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఈ గ్రూప్ ద్వారా గ్రూప్ అడ్మిన్ స్టాక్‌మార్కెట్ వ్యాపారంపై గ్రూపుసభ్యులకు ఉచితంగా సూచనలు, సలహాలు ఇస్తారు. గ్రూప్ అడ్మిన్ మాయమాటలు నమ్మి ఆన్‌లైన్ ట్రేడింగ్ కోసం శ్రీరామమూర్తి పలుదఫాలుగా రూ.23లక్షలను అడ్మిన్‌కు బదిలీ చేశాడు. ఆ తరువాత నుంచి గ్రూప్ అడ్మిన్ స్పందించడం మానివేశాడు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

పెడన: ఆన్‌లైన్ ప్రకటనలకు మోసపోయి అప్పులపాలైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెడనలో శనివారం కలకలం రేపింది. ఏఎస్ఐ సురేష్ కథనం మేరకు పట్టణంలోని 16వవార్డుకు చెందిన కాకరపర్తి ధర్మేంద్ర(33) చిరువ్యాపారాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో తేలికగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలను నమ్మి మోసపోయి అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చడంలో తీవ్రమానసిక వేదనకు గురై, ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకుని ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తనభార్య కృష్ణప్రియ, పదినెలల వయస్సుగల బాబును మచిలీపట్నం తీసుకువెళ్లి పుట్టింట్లో దించాడు. అనంతరం ఇంటికి వచ్చి బాబు కోసం ఇంట్లో వేసిన ఉయ్యాల గుడ్డకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రోజూ తెల్లవారుజాము 5.30గంటలకే నిద్రలేచే ధర్మేంద్ర శనివారం ఇంకా నిద్రలేవకపోవడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు వచ్చి తలుపుతట్టగా పలకలేదు. దీంతో ధర్మేంద్ర తమ్ముడు మణికంఠ, తన వదిన కృష్ణప్రియకు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. ఆమె వచ్చిన తర్వాత కుటుంబసభ్యులు తలుపులు పగులకొట్టి చూడగా అప్పటికే ధర్మేంద్ర ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపట్నుంచి టెన్త్ పరీక్షలు

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పదోతరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 178 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 33,007మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలురు 17,414మంది, బాలికలు, 15, 593మంది ఉన్నారు. ఈ ఏడాది నూతన విధానంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రతి ప్రశ్నాపత్రానికి ఒక క్యూఆర్ కోడ్‌ను ఇస్తూ ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు చోటు ఇవ్వకుండా చర్యలు చేపట్టారు. నో మొబైల్ జోన్‌గా పరీక్షా కేంద్రాలను ప్రకటించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

అవినాష్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం



ఆటోనగర్(విజయవాడతూర్పు):రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దేవినేని అవినాష్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. అవినాష్‌ను విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో పడవలరేవు సెంటరులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. కార్యకర్తలు, నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెల్లం దుర్గ మాట్లాడుతూ తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని చెప్పారు. టీడీపీ అభ్యర్థిని చిత్తు చిత్తుగా ఓడిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆళ్ల చెల్లారావు, డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఆకుల బాలాజీ, రామచంద్రారావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం



ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఏపీఐఐసీ కాలనీలోని కౌసర్ మసీదులో శనివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దేవినేని అవినాష్ హాజరై మాట్లాడారు. మసీద్ నిర్మాణానికి గజం రూ.2లక్షలు విలువ చేసే స్థలాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారని చెప్పారు. సుమారు 400 గజాల స్థలాన్ని రోడ్డుకు దక్షిణం వైపు కేటాయించారని తెలిపారు. అంతే కాకుండా మసీద్ నిర్మాణానికి భవిష్యత్‌లో నిధులు మంజూరు చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తామని ముస్లింలకు హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో రోడ్డు విస్తరణ నిమిత్తం మసీద్‌ను తీసివేసేందుకు కుట్రపన్నారన్నారు. ఇఫ్తార్ విందుకు వచ్చిన ముస్లింలు అవినాష్‌ను ఆప్యాయంగా పలకరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తామంతా అండగా ఉంటామని ముక్తకంఠంతో పేర్కొన్నారు. అనంతరం ముస్లింలంతా ఇఫ్తార్ లో పాల్గొని అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో 11వ డివిజన్ ఇన్‌చార్జి పర్వతనేని బాబి, ముస్లీం సోదరులు షాబాజ్, మహమ్మద్ రిజ్వాన్, ఎండీ షౌకత్, అబ్దుల్ రెహమాన్, రషీద్, షేక్‌జాని, హబిబుల్లా పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతోనే ఉజ్వల భవిత



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువత తమలోని నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సొంతం అవుతుందని సిద్దార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు చెప్పారు. కంప్యూటర్ సైన్స్ చదవుతున్న విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు పీబీ సిద్దార్థ కళాశాల ఇండియా సర్వర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్, ఇండియా సర్వర్స్ సంస్థ సీఈవో డి.సాయిసతీష్ కళాశాల ఆవరణలో శనివారం సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులతో పాటుగా అధ్యాపకులకు శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాల పెంపునకు ఈ సంస్థ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సులో శిక్షణ వచ్చి నైపుణ్యాలు పెంచడమే కాకుండా వారికి ఉపాధి అకాశాలు కూడా కల్పించేలా చూస్తామని ఇండియా సర్వర్స్ సంస్థ సీఈవో సాయి సతీష్ చెప్పారు.

అనాథలు, వృద్ధులకు సేవలు అందిస్తాం

లబ్బీపేట(విజయవాడతూర్పు):క్రైస్ట్ టు గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అనాథలు, వృద్ధుల సేవలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ హెచ్ సాల్మన్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సాల్మన్‌రాజు మాట్లాడారు. 2015 నుంచి అనాథలు, వృద్ధులు, దేవుని సేవలో ఉండి సమస్యలు ఎదుర్కొంటున్న వారికి తమ మినిస్ట్రీస్ తరపున ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా సమాజంలో నిస్వార్థంగా సేవ చేస్తున్న వారిని ఎలాంటి సిఫార్సులు లేకుండా తామే గుర్తించి తమ సంస్థ ద్వారా జీవితకాల పురస్కారాలు అందించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది లంకా విజయకుమారికి ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ డైరెక్టర్ రెవరెండ్ సరోజ సాల్మన్ కూడా పాల్గొన్నారు.

పేదలకు స్థలాలు ఇచ్చిన ఘనత జగనన్నదే

- ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)
- టిడ్కో, జగనన్న కాలనీల గృహ స్వాధీన ధ్రువీకరణ పత్రాల పంపిణీ



దివ్యాంగురాలికి టిడ్కో గృహ స్వాధీన పత్రం అందచేస్తున్న కేశినేని నాని, వెలంపల్లి, ఆసిఫ్, భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యాన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన టిడ్కో 300 ఎస్ఎఫ్‌టీ ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలతోపాటు 'నవరత్నాలు–పేదలందరికి ఇళ్లు' పథకంలో భాగంగా గృహ స్వాధీన ధ్రువీకరణ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 5 లక్షల ఇళ్లు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే చంద్రబాబు ఒక్కరికీ కూడా ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదని గుర్తు చేశారు. ఈ ఒక్క విషయంలోనే రూ.5వేల కోట్ల స్కామ్‌కు పాల్పడ్డ చంద్రబాబు అసమర్థ, అవినీతి పరుడని మండిపడ్డారు. రాష్ట్రంలో కోటీ అరవై ఐదు లక్షల కుటుంబాలుంటే అందులో కోటీ ముప్పై ఐదు లక్షల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వంలో రూ.30 వేల కోట్ల మేర అభివృద్ధి జరిగితే దుష్టచతుష్టయానికి అవేమీ కనబడవని ధ్వజమెత్తారు. రాజధాని పేరుతో అమరావతిలో మూడు వేల కోట్లు కూడా ఖర్చు పెట్టని చంద్రబాబు మాటలు వింటే పచ్చ కామెర్ల సామెత గుర్తుకు వస్తుందన్నారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే అమరావతిని వాడుకున్నారని పేర్కొన్నారు.

ఉచితంగా టిడ్కో ఇళ్ల పంపిణీ....

రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గత ప్రభుత్వం టిడ్కో ఇళ్ల పేరు చెప్పి 12 వేల మంది దగ్గర డబ్బు వసూలు చేసి కూడా వాటిని పూర్తి చేయలేదని గుర్తు చేశారు. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత టిడ్కో ఇళ్లు పూర్తి చేశారని, వాటిని లబ్ధిదారులకు ఇప్పుడు ఉచితంగా అప్పగించామని తెలిపారు. చాల మందికి వారు చెల్లించిన డబ్బును జగన్ ప్రభుత్వం వాపసు చేసిందని పేర్కొన్నారు.

జగనన్నతోనే పేదలకు మేలు...

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబులా మాట ఇస్తే తప్పే నైజం సీఎం జగనన్నది కాదని స్పష్టం చేశారు. ప్రజలకు మేలు జరగాలంటే జగనన్న ప్రభుత్వానికే సాధ్యమన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల నిర్మాణం పేరుతో పేదల నుంచి డబ్బు వసూలు చేయటమే కాకుండా రూ.100 కోట్లు అప్పు చేసిన ఘనుడు చంద్రబాబని ఎద్దేవా చేశారు. దాదాపు 12 వేలమంది వద్ద డబ్బు వసూలు చేసిన చంద్రబాబు ప్రభుత్వం 6వేల మందికి మాత్రమే ఇళ్లు నిర్మించి వాటిని కూడా పూర్తి చేయకుండా వదిలేశారని చెప్పారు. అసంపూర్తి టిడ్కో ఇళ్లను పూర్తి చేయించి లబ్ధిదారులకు ఉచితంగా అందించిన ఘనత జగనన్నదని పేర్కొన్నారు. పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ అభ్యర్థులు దేవినేని అవినాష్, షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచనలు జగనన్న చేశారని, తద్వారా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. అమరావతి ప్రాంతంలో నగర ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేదిక కింద వీల్ చైర్‌పై కూర్చున్న పెజ్జోనిపేటకు చెందిన దివ్యాంగురాలు ఎస్.మల్లేశ్వరికి టిడ్కో గృహ స్వాధీన పత్రాలు, తాళం అందచేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజ రెడ్డి, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవే పరమావధిగా...



దేవినేని అవినాష్

లబ్బీపేట: వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా దేవినేని అవినాష్‌ను శనివారం ప్రకటించారు. ఆయనది రాజకీయ నేపథ్యం కుటుంబం. అవినాష్ తండ్రి స్వర్గీయ దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. కొద్ది కాలం మంత్రిగా కూడా పనిచేశారు. అవినాష్ లండన్‌లో ఎంబీఏ చదివారు. తల్లి లక్ష్మి గృహిణి. అవినాష్ భార్య సుదీర. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సోదరి క్రాంతి ఉన్నారు. ప్రజా సేవే పరమావధిగా భావించి రాజకీయాల్లోకి ప్రవేశించారు.

తండ్రి నుంచి రాజకీయ వారసత్వం :

దేవినేని అవినాష్ తన తండ్రి దేవినేని నెహ్రూ నుంచి రాజకీయ వారసత్వం అందుకున్నారు. 2013లో సమైఖ్యాంధ్రా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 2014లో విజయవాడ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో గుడివాడ నుంచి టీడీపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. పార్టీ ఇన్‌చార్జిగా నియోజకవర్గ వ్యాప్తంగా అనేక అభివృద్ధి పనులు చేశారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించగలిగారు. నియోజకవర్గంలో దాదాపు రూ.650 కోట్లతో అభివృద్ధి చేశారు. వాటిలో కృష్ణానది రిటైనింగ్ వాల్, బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్‌లతో పాటు, కాలనీల్లో సీసీ రోడ్లు, పార్కులు అభివృద్ధి, కొత్తగా సబ్‌స్టేషన్ల ఏర్పాటు వంటివి అనేకం ఉన్నాయి.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు....

అవినాష్ తన తండ్రి పేరిట దేవినేని రాజశేఖర్ నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధికి అవసరమైన నగదు సాయం అందిస్తున్నారు. చిరు వ్యాపారులు, వృత్తిదారులకు అవసరమైన బడీకొట్లు, తోపుడు బళ్లు, ఇస్త్రీ పెట్టెలు, ఇస్త్రీ బళ్లు అందిస్తున్నారు.

బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ కేశినేని నాని చిత్రంలో ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

- ఎంపీ కేశినేని
- టీడీపీ జిల్లా, మండల స్థాయి నాయకులు వైఎస్సార్ సీపీలో చేరిక

విజయవాడస్పోర్ట్స్:బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని విజయవాడ ఎంపీ కేశినాని నాని తెలిపారు. తిరువూరు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాలకు చెందిన పలువురు టీడీపీ జిల్లా, మండల స్థాయి నాయకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. విజయవాడలోని కేశినేని భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ కేశినేని నాని సమక్షంలో టీడీపీ నాయకులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ కేశినేని నాని మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ ప్రభంజనం మరో సారి రానుందని చెప్పారు. సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి పట్ల సీఎం జగన్ చూపుతున్న ప్రత్యేక చొరవ ఫలితంగా రాష్ట్రం పేదరిక నిర్మూలన వైపు పయనిస్తుందని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ముగ్ధులై వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎంతో ఉన్నతమైన ఆశయాలతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, ఇప్పుడు ఎన్టీఆర్ ఐడియాలజీ టీడీపీలో లేదన్నారు. మోసగాళ్లు, దగాకోరులు, భూ కబ్జాదారులతో ప్రస్తుతం టీడీపీ నిండిపోయిందని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందే అభ్యర్థులను జాబితాను సీఎం జగన్ విడుదల చేసి ధైర్యంగా ఎన్నికలకు వెళ్తుంటే.. టీడీపీకి అభ్యర్థులే కరువయ్యారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో జిల్లాలో వైఎస్సార్ సీపీలో చేరికలు చాలా ఉంటాయన్నారు. జిల్లాలో టీడీపీ ఖాళీ అయ్యే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. ఈ ఎన్నికల అనంతరం టీడీపీకి భవిష్యత్తు ఉండదన్నారు. తనకు పార్లమెంట్ స్థానం కేటాయించిన సీఎం జగన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. సీఎం జగన్ ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులు నచ్చి అనేక మంది పార్టీలో చేరుతున్నారని, మళ్లీ జగనే కావాలని ప్రజలు సంపూర్ణ మనసుతో కోరుకుంటున్నారు. 2019 ఎన్నికల ముందు మోడీని కుటుంబ పరంగా దారుణంగా విమర్శించి బీజేపీతో అప్పటి వరకు కలిసున్న బీజేపీతో ఎందుకు విడిపోయారని చంద్రబాబును ప్రశ్నించారు.

పార్టీలో చేరిన నాయకులు...

తిరువూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు కొత్తగుండ్ల విశ్వేశ్వరరావు (మాజీ సర్పంచ్, గంపలగూడెం), కొత్తగుండ్ల చందు (గంపలగూడెం, మండల నాయకుడు), విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వశీం అక్రమ్ (ఎన్టీఆర్ జిల్లా టీడీపీ కార్యదర్శి), ఫయాజ్‌హుస్సేన్ (తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు), ఇస్మాయిల్ (41వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు), షాబుద్దీన్ (తెలుగు యువత ఉపాధ్యక్షులు), విసన్నపేట మండలానికి చెందిన ఎ.లాలయ్య (మండల టీడీపీ స్పోక్స్ పర్సన్), లక్ష్మయ్య (మాజీ సర్పంచ్, మండల నాయకుడు), కొత్తగుండ్ల కృష్ణ (గంపలగూడెం మండల నాయకుడు).

తూర్పులో ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి



సచివాలయ భవనానికి శంకుస్థాపన చేసిన అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్థానిక కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్ తదితరులు

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు):అభివృద్ధి పనుల విషయంలో తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చామని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. నియోజకవర్గంలో రూ.650 కోట్లు అభివృద్ధి పనులు చేశామని దమ్ముగా, ధైర్యంగా ప్రజలకు చెప్పగలుగుతున్నామని పేర్కొన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కనిపిస్తుందన్నారు. 19వ డివిజన్‌లోని బృందావనకాలనీలో రూ.70 లక్షల అంచనాతో నూతనంగా నిర్మించనున్న వార్డు సచివాలయ భవనానికి శనివారం డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు.

దేశానికే ఆదర్శంగా...

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయసాధన దిశగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ద్వారా పాలనలో సమూల మార్పులు వచ్చాయని చెప్పారు. ప్రతి పనికి మండల కేంద్రాలకు వెళ్లకుండా, ఇంటి వద్దే వలంటీర్‌ల ద్వారా ప్రభుత్వ సేవలు పొందుతున్నారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, మూడు సార్లు సీఎం అని చెప్పుకుంటున్న చంద్రబాబు తన పాలనలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమం ఏదైనా చేశాడా అని ప్రశ్నించారు. ప్రజల కనీస ఇబ్బందులు, సమస్యలు, వినతులు అన్నీ గ్రామంలోని సచివాలయంలోనే ప్రభుత్వం ద్వారా పరిష్కారమవుతున్నాయన్నారు. దాదాపు 35 శాఖలకు సంబంధించి 600 రకాల సేవలు అందుతున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధిపై చర్చించే దమ్ముందా...

తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ రెండు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీ చేసినా చెప్పుకోవడానికి చేసిన అభివృద్ధి పనులు ఏమీ లేవన్నారు. కానీ నాలుగున్నరేళ్లలో రూ.650 కోట్లుతో చేసిన అభివృద్ధి ప్రజల కంటికి కనిపిస్తుందన్నారు. ఇదే డివిజన్‌లో ముస్లింకు సంబంధించి షాదీఖానా విషయంలో గద్దే మోసం చేస్తే, తాము రూ.2 కోట్లుతో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం. బుర్రి జగ్జీవన్‌రావు, చింతగుంట విజయ్, నాహీద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):యువత చక్కగా చదువుకోవడం ద్వారా ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవచ్చునని ఎస్ఆర్ఎం యూనివర్శిటీ (అమరావతి) వైస్ చాన్స్‌లర్ మనోజ్ కె.అరోరా అన్నారు. సిద్ధార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25వ ఉపకార వేతనాలను పంపిణీ కార్యక్రమం శనివారం సాయంత్రం సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మనోజ్ కె.అరోరా హాజరై ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధార్థ ఫౌండేషన్ ప్రతినిధులకు సమాజానికి సేవ చేయాలనే ఆలోచన రావడం చాలా అభినందనీయమని చెప్పారు. సిద్ధార్థ ఫౌండేషన్ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా విద్యార్థులకు ఉపకార వేతనాలను అందచేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 700 మంది విద్యార్థులకు 60 లక్షల రూపాయలను ఉపకార వేతనాలుగా అందచేస్తున్నామని వెల్లడించారు. గత 24 సంవత్సరాలుగా తమ ఫౌండేషన్ తరపున 17,300 మంది విద్యార్థులకు సుమారు ఏడు కోట్ల రూపాయలను ఉపకార వేతనాలుగా అందచేశామని పేర్కొన్నారు.

సీసీ రోడ్లకు భూమిపూజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్ భారతీనగర్‌లో రూ.15 లక్షలతో రెండు సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గల్లా పద్మావతి, అధ్యక్షుడు గల్లా రవి స్థానికులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో అభివృద్ధి చేశామన్నారు. దాదాపు రూ.15 కోట్లు వెచ్చించి కాలనీలు అభివృద్ధి చేశామని తెలిపారు. ఎన్నడూ లేని అభివృద్ధి ఈ ప్రాంతంలో జరిగినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికంగా నివశించే సెంటినీ ఆస్పత్రి అధినేతలు మొవ్వ ఆనంద్, డాక్టర్ మొవ్వ పద్మలతో పాటు, పలువురు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం

లబ్బీపేట(విజయవాతూర్పు): తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఏడవ డివిజన్ నెహ్రూనగర్ 3వ లైన్‌లో రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆ డివిజన్ కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా కొండ ప్రాంతాల్లో మెట్లు మార్గాలు, మంచినీటి సదుపాయం, రిటైనింగ్‌వాల్స్ నిర్మాణం పనులతో పాటు, మొగల్రాజపురం, నెహ్రూనగర్, ఉడ్‌పేట, బాడవపేట ప్రాంతాల్లో సుమారు రూ.8 కోట్లుతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సహకారంలో అభివృద్ధి పనులు వేగంగా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కుటుంబరావు, సంపత్, ఉదయ్, రెంటపల్లి కొండ, సుధీర్‌వర్మ, అశోక్, తాడేపల్లి ఆనంద్, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి రుగ్మతలపై అప్రమత్తత అవసరం

ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణిదర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నీటి కాసులు (గ్లకోమా) వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. ఫణిధర్ తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, వాసన్ ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గ్లకోమాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుష్పా హోటల్ వద్ద ర్యాలీని ప్రారంభించి డాక్టర్ ఫణిధర్ మాట్లాడారు. కంటి జబ్బులలో అతి ప్రమాదకరమైనది గ్లకోమా అని, దీని వలన కంటిలో ఒత్తిడి పెరిగి కంటి నరములు క్షీణతకు గురవుతాయన్నారు. దీంతో చూపు క్రమంగా మందగించి అంధత్వం కలుగుతుందన్నారు. నొప్పి వుండని కారణంగా చూపు పూర్తిగా పోయే వరకు రోగి గమనించలేడన్నారు. కంటికి సంబంధించి ఈ లక్షణాలు కనపడగానే తక్షణం కంటి వైద్య నిపుణులను సంప్రదించాలని కోరారు. ర్యాలీలో డాక్టర్ చిత్ర, డాక్టర్ మాధవిలత డాక్టర్ అనిల్ శేషుకుమార్, ఆసుపత్రి నిర్వాహకులు వెంకట నాయుడు, పలువురు వైద్య ప్రముఖులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు):ఆర్థిక పరిస్థితులు కారణంగా పేదలు వైద్యానికి దూరం కాకూడదు అనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తపన పడే వ్యక్తి జగన్ అని తెలిపారు. నాలుగేళ్ల కాలంలోనే కోట్ల రూపాయల చెక్కులు సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద అందించామని పేర్కొన్నారు. గతంలో టీడీపీ నాయకులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు ఎవరికీ రూపాయి ఇవ్వకుండా పారదర్శకంగా పథకం అమలు జరుగుతుందని తెలిపారు. అనంతరం 3,12,14,18 డివిజన్‌లకు చెందిన ఐదుగురికి వైద్య సేవలు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన రూ.5,00,000 చెక్కులను పంపిణీ చేశారు. 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, 14వ డివిజన్ అధ్యక్షులు శెటికం దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

దశాబ్దాల కల నెరవేర్చిన జగనన్న



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): 22వ డివిజన్‌లోని భ్రమరాంబపురం వాసుల దశాబ్దాల కల నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. భ్రమరాంబపురంలోని ఇళ్లకు ప్రభుత్వం సంపూర్ణ హక్కులు కల్పిస్తూ జీఓ విడుదల చేసిన సందర్భంగా శనివారం మలేరియా హాస్పిటల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ భ్రమరాంబపురం వాసుల 70 సంవత్సరాల కల నెరవేరిందన్నారు. దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారి ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ క్రమబద్ధీకరణకు జీఓ నంబర్ 107 విడుదల చేసి ప్రజల కష్టాలు తీర్చిన దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన సమయంలో పట్టాల సమస్య తీరడం లేదని స్థానిక మహిళలు తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యను సీఎం జగన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చి జీఓ విడుదల చేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 15 ఎకరాల 6 సెంట్లు రుద్ర భూమిలో ఉన్న 1189 ఇళ్ల పట్టాల సమస్య తీరిపోయిందన్నారు. గత 10 ఏళ్లుగా గద్దె రామ్మోహన్ ఎమ్మెల్యేగా ఉండి పేదల సమస్యలను పట్టించుకోలేదని తెలిపారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించిన జగనన్నకు ధన్యవాదాలు తెలిపారు. జగన్ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా గెలిచి తూర్పు సీటును జగన్‌కు గిఫ్ట్‌గా ఇద్దామని, ప్రజలు తనను ఒకసారి ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్ కొండారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సరైన కోర్సును ఎంచుకోవడం ఉత్తమ మార్గం



పటమట(విజయవాడ తూర్పు): సరైన కోర్సును ఎంచుకుని జీవితంలో ఉత్తమమైన మార్గంలో పయనించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. మేరీస్ స్టెల్లా కాలేజీ 62వ వార్షిక వేడుకలు కాలేజీ ఆవరణలో శనివారం నిర్వహించారు. హేమచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కష్టపడి చదవాలని, పోటీ ప్రపంచంలో కెరీర్‌ను ఉన్నతంగా మలచుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో పథకాలు అమలుచేసిందని చెప్పారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ట్రానిక్స్ సీఈవో దాసరి రామకృష్ణ, వేదిక్ ఫౌండేషన్ ఫౌండర్ వేణిమాధవి, కాలేజీ కరస్పాండెంట్ క్వాడ్రస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సరిహద్దు చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ



నాగలాపురం: తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలోని సురుటుపల్లి వద్ద తమిళనాడు సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులను శనివారం తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టుల్లో నిఘా ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ వెంట తిరుపతి ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

'తూర్పు'లో టీడీపీ కుట్రలు భగ్నం చేయండి

విజయవాడ సీపీ రాణాకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ వినతి



లబ్బీపేట(విజయవాడతూర్పు) : విజయవాడ తూర్పు నియోజకవర్గంలో అల్లర్లు చేసి, ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై వేసేందుకు టీడీపీ చేస్తున్న కుట్రలను భగ్నం చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాణాకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గంలో దేవినేని అవినాష్‌కు వస్తున్న ఆదరణను అడ్డుకునే కుట్రతో.. అల్లర్లు చేసేందుకు టీడీపీ నేత గద్దె రామ్మోహన్ తనయుడు చూస్తున్నాడని పేర్కొన్నారు. ప్రస్తుతం తూర్పు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం ఉందని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరుణంలో శాంతి భద్రలను సంరక్షించాలని, అల్లర్లకు పాల్పడుతున్న సంఘ విద్రోహ శక్తులపై నిఘా పెంచాలని, టీడీపీ కుట్రలను భగ్నం చేయాలని కోరారు. తూర్పులో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గద్దె రామ్మోహన్ గతంలో పోటీ చేసిన సమయంలో అల్లర్లకు పాల్పడిన ఘటనలున్నాయని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. సీపీను కలిసిన వారిలో లీగల్‌సెల్ ప్రతినిధి సాయిరామ్ తదితరులున్నారు.

బీసీలకు సీఎం జగన్ పెద్దపీట: చెల్లుబోయిన



రాజమహేంద్రవరం రూరల్ : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రకటించిన అసెంబ్లీ స్థానాల్లో బీసీలకు 48 మందికి, పార్లమెంటు స్థానాల్లో 11 మందికి సీఎం జగన్ అవకాశం కల్పించడం గొప్ప విషయమని, ఇది రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గోదావరి జిల్లాల్లో కాపుల తర్వాత శెట్టిబలిజలు, మత్స్యకార సామాజికవర్గాలు అధికంగా ఉన్నాయని, వారిని బాబు ఎప్పుడూ పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. కానీ సీఎం జగన్ గోదావరి జిల్లాలో శెట్టిబలిజలు, గౌడలు గెలిచి రాజకీయంగా ఎదగాలనే ఏకైక లక్ష్యంతో మూడు అసెంబ్లీ, రెండు పార్లమెంటరీ స్థానాలు ఇచ్చారని చెప్పారు. అదే చంద్రబాబు రెండు అసెంబ్లీ స్థానాలు మాత్రమే కేటాయించారని తెలిపారు. సీఎం జగన్ ఒక రాజ్యసభ, రెండు ఎమ్మెల్సీలను సైతం శెట్టిబలిజలకు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంఘీయులందరి తరఫున సీఎం జగన్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేసే అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. అక్కడ తమ పార్టీ అభ్యర్థి వంగా గీత అనుభవం ముందు పవన్ కళ్యాణ్ అనుభవం ఎంతని ప్రశ్నించారు. ముద్రగడ పద్మనాభం సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడని, ఆయన రాకతో వైఎస్సార్‌సీపీకి మరింత బలం పెరిగిందన్నారు.

నెల్లూరు సిటీ బరిలో సామాన్యుడు

తొలిసారిగా మైనార్టీ వ్యక్తికి వైఎస్సార్ సీపీ అవకాశం


సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్ సీపీ నెల్లూరు సిటీ అసెంబ్లీ బరిలోకి ఓ సామాన్యుడిని దింపింది. ఆయనే ఎస్‌డీ ఖలీల్ అహ్మద్. గతంలో ఏ రాజకీయ నేపథ్యం లేని ఆయనకు గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరులో కార్పొరేటర్‌గా అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం డెప్యూటీ మేయర్ పదవిలో ఉన్నారు. ఈయనను ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మక నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలుపుతోంది. నగర నియోజకవర్గ పరిధిలో మైనార్టీ ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అయినా ఏ రాజకీయ పార్టీ మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. అయితే ఒకసారి వైఎస్సార్ హయాంలో, తర్వాత సీఎం జగన్ పాలనలో రెండుసార్లు బీసీ సామాజిక వర్గానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్‌ను బరిలో నిలిపారు. నెల్లూరు సిటీలో మైనార్టీల బలం, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన సామాన్య ప్రజల ఆదరణ, ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి బరిలో ఉండడం ఖలీల్ అహ్మద్‌కు కలిసొచ్చే అంశాలుగా మారాయి.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

పోలింగ్, పోలీసు సిబ్బందిని గణనీయంగా పెంచాం

అల్లర్లు జరిగితే ఎస్పీ, రీపోలింగ్ జరిగితే కలెక్టర్లదే బాధ్యత

- రాష్ట్రంలో 46,156 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- మరో 887 పోలింగ్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలు
- మహిళా సిబ్బందితో 179 పోలింగ్ కేంద్రాలు
- దివ్యాంగులతో 63, యువతతో 50, మోడల్ పోలింగ్ స్టేషన్లు 555
- పోలింగ్‌లో 3,82,218 మంది రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు
- అబ్జర్వర్లు, చెక్ పోస్టులతో నిరంతర నిఘా.. ఇప్పటికే రూ.164.33 కోట్లు స్వాధీనం
- రాష్ట్రంలో అమల్లోకి ఎన్నికల నియమావళి
- నియమావళిని ఉల్లంఘిస్తే నాతో సహా ఎవరిపైనయినా చర్యలు



- ఉల్లంఘనలపై 1950 నంబరు లేదా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

సాక్షి, అమరావతి: ఎటువంటి హింస, రీపోలింగ్ వంటివి లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించేలా పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో మే 13న జరిగే ఎన్నికలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. ఆయన శనివారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. ఎక్కడైనా అల్లర్లు జరిగితే ఆ జిల్లా ఎస్పీ, రీపోలింగ్ జరిగితే ఆ జిల్లా కలెక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా గతం లోకంటే అధికంగా పోలింగ్, పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 46,156 పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల సంఖ్య 1600 దాటితే వాటిని రెండు పోలింగ్ స్టేషన్లుగా విభజిస్తామని, దీనివల్ల 887 కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుకు కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మహిళా ఓటర్లను ఆకర్షించేలా కేవలం మహిళా సిబ్బందితో 179 పోలింగ్ కేంద్రాలు, అదే విధంగా దివ్యాంగులతో 63, యువతతో 50, మోడల్ పోలింగ్ స్టేషన్లు 555 ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు 1 ప్లస్ 5 మంది ఉద్యోగులు ఉంటారన్నారు. గతంలో ఎన్నికల విధుల్లో అంగన్‌వాడీలు, తాత్కాలిక సిబ్బంది సేవలను కూడా వినియోగించుకున్నారని, ఈ సారి పూర్తిగా రెగ్యులర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులనే నియమిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న రెగ్యులర్ సిబ్బందికి ప్రధాన బాధ్యతలు కాకుండా సిరా వేయడం వంటి విధులను అప్పగిస్తామన్నారు. ఎవరు ఎక్కడ విధుల్లో పాల్గొంటారో ర్యాండమ్‌గా సాఫ్ట్‌వేర్ ద్వారా ఎంపిక చేస్తామని చెప్పారు. వలంటీర్లు, తాత్కాలిక సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉండరన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలింగ్ స్టేషన్‌కు కనీసం ఇద్దరు పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. ఇందుకోసం 1,14,950 మంది సివిల్ పోలీసులు, 58 కంపెనీల రాష్ట్ర ఆర్మ్‌డ్ పోలీసులు, 465 కంపెనీల కేంద్ర బలగాలు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు

శనివారం నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, కోడ్ ఉల్లంఘిస్తే తనతో సహా ఏ స్థాయి అధికారిపైన అయినా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇప్పటికే ఫిర్యాదులు అందిన అధికారులపై కేంద్ర ఎన్నికల సంఘం విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నిరంతరం నిఘా కోసం 50 మంది జనరల్ అబ్జర్వర్లు, 115 మంది వ్యయ పరిశీలకులు, 13 మంది పోలీసు అబ్జర్వర్లు ఉంటారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 22 విభాగాలతో తనిఖీలు చేస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 121 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. వీటికి అదనంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే తనిఖీల ద్వారా రూ.164.35 కోట్లు విలువైన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రధాన మంత్రి మినహా మిగతా రాజకీయ నేతలందరినీ తనిఖీ చేస్తారని, చేతి బ్యాగులు తప్ప మిగతా వాటిని సోదా చేస్తారని చెప్పారు. విమానాశ్రయాల్లో కాకుండా ప్రైవేటుగా విమానాలు, హెలికాప్టర్లలో దిగిన స్థలాల వద్దకు సంచార స్క్వాడ్స్ వెళ్లి తనిఖీలు చేస్తాయన్నారు. అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలను జిల్లా కలెక్టర్లకు తెలియజేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పెయిడ్ ఆర్టికల్స్, సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలపైనా నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎటువంటి మత ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల ఉల్లంఘనలపై 1950 నంబరుకు లేదా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్

85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి వద్ద లేదా పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేయొచ్చని మీనా తెలిపారు. ఇంటి వద్దే ఓటు వేయాలనుకొంటే ముందుగా ఫారం 12 పూర్తి చేసి రిటర్నింగ్ అధికారికి ఇస్తే దాన్ని పరిశీలించి పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతిస్తారన్నారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతి లభిస్తే వారు పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేయడానికి కుదరదని స్పష్టం చేశారు. ఇలా పోస్టల్ బ్యాలెట్ కోరిన వారికి ఎన్నికల తేదీకి పది రోజుల ముందే వీడియోగ్రాఫర్‌తో కలిపి ఐదుగురు సిబ్బంది ఇంటికి వచ్చి పోస్టల్ బ్యాలెట్‌కు ఏర్పాట్లు చేస్తారని చెప్పారు. పోలింగ్ బూత్‌లో లానే గోప్యంగా ఓటు హక్కును వినియోగించుకొని ఆ పోస్టల్ బ్యాలెట్‌ను రెండు కవర్లలో పెట్టి పోలింగ్ బాక్స్‌లో వేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు ఇంటికి వస్తున్న సమాచారాన్ని పోటీలో ఉన్న అభ్యర్థులకు ముందుగానే తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు డీజీపీ (లా – ఆర్డర్) శంకబ్రత్ బాగ్చీ, అదనపు సీఈవోలు హరేంధర ప్రసాద్, పి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముఖేష్‌కుమార్ మీనా. చిత్రంలో శంకబ్రత్ బాగ్చీ, హరేంధర ప్రసాద్, కోటేశ్వరరావు

రాష్ట్రంలో ఓటర్లు ఇలా..

పురుష ఓటర్లు	2,00,84,276
మహిళా ఓటర్లు	2,08,49,730
తొలిసారి ఓటు వేస్తున్న 18 - 19 ఏళ్ల మధ్య వయసు వారు	9,01,863
దివ్యాంగులు	5,17,140
85 ఏళ్లు దాటిన వృద్ధులు	2,12,237

మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు	175
జనరల్	139
ఎస్సీ రిజర్వ్‌డ్	29
ఎస్టీ రిజర్వ్‌డ్	7

మొత్తం లోక్‌సభ నియోజకవర్గాలు	25
జనరల్	20
ఎస్సీ	4
ఎస్టీ	1

ఇవి చేయొచ్చు

- ఇప్పటికే అమల్లో ఉన్న పథకాల లబ్ధిదారులకు ప్రయోజనాలను కొనసాగించవచ్చు
- చేయూత పథకానికి ఇప్పటికే నిధులిస్తే వాటిని కొనసాగించవచ్చు
- ఇప్పటికే చేపట్టిన పనులు కొనసాగించొచ్చు. పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించొచ్చు
- ఏపీపీఎస్సీ, యూపీఎస్సీ వంటి సంస్థలు ఉద్యోగాల నియామకాల ప్రక్రియ కొనసాగించొచ్చు

ఇవి చేయకూడదు

- పథకాలకు కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేయకూడదు
- పథకాలకు కొత్తగా నిధులు విడుదల చేయాల్సి వస్తే కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలి
- పనులు మంజూరైనప్పటికీ, ఇంకా ప్రారంభించని వాటిని ఇప్పుడు చేపట్టకూడదు
- కంపెనీలకు, వ్యక్తులకు భూములు కేటాయించకూడదు. అసాధారణ కేసుల్లో సీఎంఆర్‌ఎఫ్ మంజూరుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తీసుకోవాలి
- మంత్రులు పైలెట్ కార్లను వినియోగించకూడదు
- ప్రధానమంత్రి తప్ప మిగతా ఏ రాజకీయ నాయకులకు ప్రొటోకాల్ ఉండదు

53 రోజుల్లో కొత్తగా 1.30 లక్షల మంది ఓటర్లు


ఈ నెల 16 నాటికి 4.09 కోట్లు దాటిన ఓటర్లు

జనవరి 22న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాతో పోలిస్తే ఈ నెల 16 నాటికి ఓటర్ల సంఖ్య 1,30,096 పెరిగినట్లు ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. జనవరిలో విడుదల చేసిన జాబితాలో ఓటర్ల సంఖ్య 4,08,07,256 మంది ఉండగా ఇప్పుడు 4,09,37,352కు చేరినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూలు వచ్చినందున ఓట్ల తొలగింపు, చిరునామా మార్పులకు అవకాశం ఉండదని, కొత్త ఓటర్ల నమోదుకు నామినేషన్ల చివరి రోజు వరకు అవకాశం ఉందని చెప్పారు.

కట్టుదిట్టంగా ఎన్నికల కోడ్

బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ ఆస్తులపై హోర్డింగ్‌లు, కటౌట్లు, పోస్టర్లు ఉండకూడదు

- 24 గంటల్లోగా వాటిని తొలగించండి
- ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల్లో పీఎం, సీఎం, మంత్రుల ఫొటోలు ఉండకూడదు
- మంత్రులు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించకూడదు
- బడ్జెట్‌లో ప్రొవిజన్ ఉన్నా కొత్తగా శంకుస్థాపనలు, పనులు నిషేధం
- అధికారిక వాహనాలు, అతిథి గృహాలు, హెలికాప్టర్లు వినియోగించకూడదు
- పీఎం, సీఎం సహాయ నిధి కింద రోగుల చికిత్సలకు అభ్యంతరం లేదు
- ప్రభుత్వ సిబ్బంది నిష్పక్షపాతంగా ఉండాలి
- ఏ పార్టీకీ అనుకూలంగా ఉండకూడదు
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్ర అసెంబ్లీకి, లోక్‌సభకు సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చిందని, దీనిని రాష్ట్రమంతటా కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లను, ఎస్పీలను ఆదేశించారు. సీఎస్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఎన్నికల నియమావళిపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్తులపై ఉన్న అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు వంటివన్నీ 24 గంటల్లోగా తొలగించాలని ఆదేశించారు. అలాగే బహిరంగ ప్రదేశాలు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రకాల రాజకీయ ప్రకటనలు, వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు వంటివన్నీ తొలగించాలని చెప్పారు. ఈ సమావేశంలో సీఎస్ ఇచ్చిన ఆదేశాల్లో ప్రధానమైనవి..

- ప్రింట్, ఎలక్ట్రానిక్, ఇతర ప్రసార మాధ్యమాల్లో ప్రభుత్వ నిధులతో జారీ చేసే అన్ని రకాల ప్రకటనలు నిలిపివేయాలి
- ప్రభుత్వ వెబ్‌సైట్లలో మంత్రులు తదితర ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ఫొటోలను వెంటనే తొలగించాలి
- మంత్రులెవరూ అధికారిక వాహనాలను, హెలికాప్టర్లను ఎన్నికల ప్రచారానికి వినియోగించకూడదు. మంత్రుల ఎన్నికల పర్యటనలకు ప్రభుత్వ అతిథి గృహాలను కేటాయించకూడదు.
- ఎంపీ లేదా ఎమ్మెల్యే నిధులు లేక ఇతర ప్రభుత్వ పథకాల నిధులతో నిర్వహించే వాటర్ ట్యాంకులు, అంబులెన్సులు వంటి వాటిపై ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల ఫొటోలు ఉండకూడదు
- ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల్లో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి సహా మంత్రుల ఫొటోలు ఉండకూడదు.
- మంత్రులు అధికారులతో ఎటువంటి వీడియో సమావేశాలు నిర్వహించకూడదు
- విద్యుత్, నీటి బిల్లులు, బోర్డింగ్ పాస్‌లు, వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లపై ప్రజా ప్రతినిధుల ఫొటోలు, సందేశాలు వంటివి ఉండకూడదు
- ప్రభుత్వ అధికారులు ఎవరూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముందస్తు అనుమతి లేకుండా వారి హెడ్ క్వార్టర్ విడిచి వెళ్ళడానికి వీల్లేదు.
- ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారులు, సిబ్బందిని బదిలీ చేయడానికి వీల్లేదు
- ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఏ రాజకీయ పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినా లేదా పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, గిఫ్టులు, ఇతరత్రా లబ్ధి పొందినా అలాంటి వారిపై సీసీఏ నిబంధనల ప్రకారం ఐపీసీ సెక్షన్ 171, 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 123, 129, 134, 134 ఎ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం.
- బడ్జెట్ ప్రొవిజన్ ఉన్నప్పటికీ నూతన ప్రాజెక్టులు, పథకాల మంజూరు, రాయితీలు, గ్రాంట్లు, హామీలు, శంకుస్థాపనలు పూర్తిగా నిషేధం
- వర్క్‌ఆర్డర్ ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మొదలు కాని పనులు చేపట్టకూడదు.
- పనులు పూర్తయిన వాటికి నిధుల విడుదలలో ఎలాంటి నిషేధం లేదు.
- పీఎం, సీఎం సహాయ నిధి కింద గుండె, కిడ్నీ, కేన్సర్ వంటి రోగులకు చికిత్సలకు సకాలంలో నిధుల మంజూరుకు ఎలాంటి అభ్యంతరం లేదు.

సామాజిక న్యాయానికి బాబు పాతర

టీడీపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అరకొరగా సీట్లు

- రెండు విడతలుగా ప్రకటించిన 128 సీట్లలో ఓసీలకే ప్రాధాన్యం
- సొంత సామాజిక వర్గానికంటే తక్కువగా బీసీలకు
- బీసీలకు 24తో సరి
- కమ్మ సామాజికవర్గానికి 28 సీట్లు
- ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ప్రకారం సీట్లు
- కాపులకు 8, మైనారిటీలకు 3
- మహిళలకు ఇచ్చిన సీట్లు కేవలం 17

సాక్షి, అమరావతి: బడుగు, బలహీనవర్గాల కోసమే టీడీపీ పుట్టిందని, సామాజిక న్యాయమని బాబు పదే పదే ఊదరగొడుతుంటారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, ఇతర పదవుల పంపకాల్లో ఆయన ఎప్పుడూ అగ్రవర్ణాల పక్షమే ఉంటారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రకటనతో బాబు సామాజిక బండారం మరోసారి బయటపడింది. ఎప్పటిలానే ఈసారీ బడుగు, బలహీన వర్గాలను పట్టించుకోలేదని అభ్యర్థుల ఎంపిక రుజువు చేసింది. రెండు విడతలుగా 128 ఎమ్మెల్యే స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన చంద్రబాబు సామాజిక న్యాయానికి పాతరేశారు. తన సొంత సామాజికవర్గానికి, ధన బలం, కండ బలం ఉన్న వారికి సీట్లు కట్టబెట్టి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను చిన్న చూపు చూశారు. ఒకవైపు వైఎస్సార్‌సీపీ సగం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికే ఇచ్చి తమ ప్రాధాన్యం బడుగు, బలహీన వర్గాలేనని చాటి చెప్పింది. కానీ తమది బీసీల పార్టీ అని ప్రచారం చేసుకునే బాబు మాత్రం వారికి వెన్నుపోటు పొడిచారు. ప్రకటించిన 128 సీట్లలో ఓసీలకు 72 సీట్లు కేటాయించి, బీసీలకు మాత్రం 24 సీట్లతో సరిపెట్టారు. మొదటి జాబితాలో 18, రెండో జాబితాలో 6 సీట్లను బీసీ వర్గాలకు ఇచ్చారు. దీనినిబట్టి ఆయన వారిని పల్లకీ మోసే బోయీలుగానే చూస్తున్నారని మరోసారి తేటతెల్లమైంది. మరోవైపు తన సొంత సామాజికవర్గానికి 28 సీట్లు ఇచ్చుకున్నారు. అంటే సొంత సామాజికవర్గానికి ఇచ్చినన్ని సీట్లు కూడా జనాభాలో సగ భాగం ఉన్న బీసీలకు ఇవ్వలేదు. కాపులకు మరీ హీనంగా 8 సీట్లతో సరిపెట్టారు. అదే సమయంలో రెడ్డి సామాజికవర్గానికి 28 సీట్లు ఇచ్చారు. మొత్తంగా సీట్ల కేటాయింపులో బాబు తన సొంత సామాజికవర్గానికి, ఓసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. గత ఎన్నికల్లో బీసీ వర్గాలకు 43 సీట్లు కేటాయించిన చంద్రబాబు ఈసారి సగానికి సగం తగ్గించి, పార్టీలో వారి ప్రాధాన్యత ఏమిటో చెప్పేశారు. ఎస్సీలకు 25, ఎస్టీలకు 4 సీట్లను రిజర్వేషన్ల ప్రకారం కేటాయించారు. మైనారిటీలకు తప్పదన్నట్లు మూడు సీట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మహిళలకూ ఆశించిన స్థాయిలో సీట్లు ఇవ్వలేదు. మహిళలకు ఇచ్చింది 17 సీట్లు మాత్రమే. బాబు సామాజిక సూత్రాలకు తిలోదకాలు ఇచ్చినట్లు సీట్ల కేటాయింపు స్పష్టంగా చెబుతోందని విశ్లేషకులు అంటున్నారు. జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకుని 144 సీట్లలో పోటీ చేస్తున్న బాబు ఇంకా 16 సీట్లకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

అసెంబ్లీ స్థానాల్లో సామాజికవర్గాల వారీగా

అభ్యర్థుల	సంఖ్య
ఓసీ	72
బీసీ	24
ఎస్సీ	25
ఎస్టీ	5
మైనారిటీ	3

ఓసీల్లో కులాలవారీగా ఇచ్చిన సీట్లు

కమ్మ	28
రెడ్డి	28
కాపు	8
ఇతర ఓసీలు	8
టీడీపీ ప్రకటించిన	128

రాజ్యాధికారంలో భాగస్వామ్యం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అగ్రపీఠం

బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా నాచేత అభ్యర్థుల ప్రకటన

సామాజిక మార్పు సాధ్యమేనని రుజువు చేసిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



సాక్షి ప్రతినిధి, కడప: రాజ్యాధికారాన్ని బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శనివారం అభ్యర్థుల పేర్ల ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు సభ్యుల్లో మొత్తంగా 200 సీట్లకు 100 స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులున్నారని తెలిపారు. బలహీన వర్గాలకు చెందిన తనను అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. రాజ్యాధికారం ఇవ్వడంతోనే సామాజిక మార్పు సాధ్యమని రుజువు చేసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. 2019 కంటే మహిళలు, బీసీల ప్రాతినిధ్యం పెరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాలను రాజ్యాధికారంలోకి రాకుండా చూసే రాజకీయ పార్టీలను చూశామని, అదే బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు అగ్రపీఠం వేసిన వైఎస్సార్‌సీపీని చూస్తున్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఉన్నత చదువులు చదివినవారని చెప్పారు. అనంతరం శ్రీకాకుళం నుంచి పులివెందుల వరకూ 175 మంది అభ్యర్థుల జాబితాను మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రకటించారు. అంతకుముందు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులు అర్పించారు. ప్రత్యేక అలంకరణ చేపట్టిన వైఎస్సార్ సమాధిపై పూల మాలలు వేసి ప్రార్థనలు చేపట్టారు. అక్కడే ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జగనన్నకు ఎల్లవేళలా రుణపడి ఉంటాం: నందిగం సురేష్



అభ్యర్థుల జాబితా చదువుతున్న సురేష్

రాష్ట్రంలోని 25 పార్లమెంటు స్థానాలకు 24 స్థానాల్లో అభ్యర్థులను బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మునివేళ్లతో కూడా ముట్టుకోవడానికి ఇష్టపడని సామాజిక వర్గం నుంచి వచ్చిన వాళ్లం. చాలా మంది దగ్గర అవమానాలు పడి, వచ్చిన వాణ్ణి. నన్ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పక్కన కూర్చోబెట్టుకొని నా చేత పార్లమెంటు అభ్యర్థుల జాబితా ప్రకటింపజేయ'డం చాలా సంతోషకరమని అన్నారు. అసలైన సామాజిక న్యాయమంటే ఇదేనని, జగనన్నకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపారు. మాకు నమ్మకం, భరోసా, దిక్సూచిలా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. మా జీవితాలల్లో వెలుగు నింపడానికి నాడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి చేస్తే, నేడు అనునిత్యం మా ఉన్నతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. గతంలో ఓట్ల కోసం చెప్పిన మాటలుగా సామాజిక న్యాయం మిగిలిపోయేదని పేర్కొన్నారు. వాసన వస్తున్నారు, పక్కకు వెళ్లండనే వ్యక్తుల్లా కాకుండా దగ్గరికి రమ్మని కౌగిలించుకునే వారిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని తెలిపారు. గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మా జీవితాల్లో మార్పు కోసం కృషి చేశారు. అప్పట్లో కరెంటు బిల్లుల కోసం మోటార్లు జప్తు చేసిన చరిత్ర ఉండేది. రాజశేఖరరెడ్డి మా కోసం ఆలోచనలు చేసి ముందడుగు వేశారు. అదే బాటలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆరాధ్యుడయ్యారని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, ఎస్‌బీ అంజాద్‌బాషా, రాజన్నదొర, హోంమంత్రి తానేటి వనితలతో కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ప్రకటించారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలతోపాటు ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గత ఎన్నికల సెంటిమెంట్ అనుసరిస్తూ..

2019 ఎన్నికల సందర్భంగా ఎస్సీ వర్గానికి చెందిన నందిగం సురేష్ ద్వారా పార్లమెంటు అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. బీసీ వర్గానికి చెందిన ధర్మాన ప్రసాదరావు ద్వారా ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. అదే సెంటిమెంటును అనుసరిస్తూ ఆ ఇరువురి నేతల ద్వారానే శనివారం 2024 ఎన్నికల అభ్యర్థుల జాబితాను ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు గుర్రాలివే..



రాష్ట్రంలో మే 13న పేదలు, పెత్తందారుల మధ్య జరిగే కురుక్షేత్ర ఎన్నికల సంగ్రామంలో పేదల తరఫున తలపడేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు గుర్రాలను సిద్ధం చేశారు. ఆ ఎన్నికల్లో 175 శాసనసభ, 25 లోక్‌సభ.. మొత్తం 200 స్థానాల్లో విజయ దుందుభి మోగించడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేశారు. సరిగ్గా సగం స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యర్థులను బరిలోకి దించడం ద్వారానే గెలుపు ఖాయమై పోయిందని రాజకీయ పరిశీలకులు, సామాజిక వేత్తలు స్పష్టం చేస్తున్నారు.

అరకు పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- చెట్టి తనూజరాణి పార్లమెంట్ (ఎస్టీ)
- వి కళావతి పాలకొండ (ఎస్టీ)
- పి. పుష్పశ్రీవాణి కురుపాం (ఎస్టీ)
- ఎ జోగారావు పార్వతీపురం (ఎస్సీ)
- పి రాజన్నదొర సాలూరు (ఎస్టీ)
- రేగం మత్స్యలింగం అరకు వ్యాలీ (ఎస్టీ)
- యం. విశ్వేశ్వరరాజు పాడేరు (ఎస్టీ)
- ఎస్.ధనలక్ష్మి రంపచోడవరం(ఎస్టీ)

విశాఖపట్నం పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- బొత్స ఝాన్సీలక్ష్మి పార్లమెంట్ (బీసీ)
- కె.శ్రీనివాసరావు శృంగవరపుకోట(బీసీ)
- ఎం.శ్రీనివాసరావు భీమిలి (ఓసీ)
- ఎంవివి సత్యనారాయణ విశాఖ తూర్పు (ఓసీ)
- వి.గణేష్‌కుమార్ విశాఖ దక్షిణం (బీసీ)
- కమ్మిల కన్నపరాజు విశాఖ ఉత్తరం (ఓసీ)
- ఎ.ఆనందకుమార్ విశాఖ పశ్చిమ (బీసీ)
- జి.అమర్‌నాథ్ గాజువాక (ఓసీ)

కాకినాడ పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- సిహెచ్ సునీల్ పార్లమెంట్ (ఓసీ)
- దాడిశెట్టి రాజా తుని (ఓసీ)
- వరుపుల సుబ్బారావు ప్రత్తిపాడు (ఓసీ)
- వంగా గీత పిఠాపురం (ఓసీ)
- కురసాల కన్నబాబు కాకినాడ రూరల్(ఓసీ)
- దవులూరి దొరబాబు పెద్దాపురం (ఓసీ)
- ద్వా.చంద్రశేఖర్ రెడ్డి కాకినాడ సిటీ (ఓసీ)
- తోట నరసింహం జగ్గంపేట (ఓసీ)

రాజమండ్రి పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- డా. జి.శ్రీనివాస్ పార్లమెంట్ (బీసీ)
- డా. ఎస్. సూర్యనారాయణ రెడ్డి - అనపర్తి
- జక్కంపూడి రాజా రాజానగరం
- ఎం. భరత్ రామ్(బీసీ) రాజమహేంద్రవరం సిటీ
- సిహెచ్ ఎస్‌వి కృష్ణ(బీసీ) రాజమహేంద్రవరం రూరల్
- తలారి వెంకటరావు కొవ్వూరు (ఎస్సీ)
- శ్రీనివాస్ నాయుడు నిడదవోలు (ఓసీ)
- తానేటి వనిత గోపాలపురం (ఎస్సీ)

ఏలూరు పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- కారుమూరి సునీల్ పార్లమెంట్ (బీసీ)
- పుప్పాల వాసుబాబు ఉంగుటూరు (ఓసీ)
- కె.అబ్బయ్య చౌదరి దెందులూరు (ఓసీ)
- ఆళ్ల నాని ఏలూరు (ఓసీ)
- తెల్లం రాజ్యలక్ష్మి పోలవరం (ఎస్టీ)
- కంభం విజయరాజు చింతలపూడి (ఎస్సీ)
- ఎం.ప్రతాప్ అప్పారావు నూజివీడు (ఓసీ)
- దూలం నాగేశ్వరరావు కైకలూరు (ఓసీ)

విజయవాడ పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- కేశినేని నాని పార్లమెంట్ (ఓసీ)
- నల్లగట్ల స్వామిదాసు తిరువూరు (ఎస్సీ)
- షేక్ ఆసిఫ్ (ముస్లిం) విజయవాడ పశ్చిమ
- వి.శ్రీనివాసరావు (ఓసీ) విజయవాడ సెంట్రల్
- దేవినేని అవినాష్(ఓసీ) విజయవాడ తూర్పు
- ఎస్.టి.రావుయాదవ్ మైలవరం (బీసీ)
- ఎం.జగన్మోహన రావు నందిగామ (ఎస్సీ)
- ఎస్.ఉదయభాను జగ్గయ్యపేట (ఓసీ)

నరసరావుపేట పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- డా. పి.అనిల్ కుమార్ పార్లమెంట్ (బీసీ)
- నంబూరి శంకర్‌రావు పెదకూరపాడు (ఓసీ)
- కె. మనోహర్ నాయుడు చిలకలూరిపేట (ఓసీ)
- డా. జి.శ్రీనివాస్‌రెడ్డి నరసరావుపేట(ఓసీ)
- అంబటి రాంబాబు సత్తెనపల్లి(ఓసీ)
- బి.బ్రహ్మనాయుడు వినుకొండ(ఓసీ)
- కాసు మహేష్‌రెడ్డి గురజాల (ఓసీ)
- పి.రామకృష్ణారెడ్డి మాచర్ల (ఓసీ)

ఒంగోలు పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పార్లమెంట్ (ఓసీ)
- తాటిపర్తి చంద్రశేఖర్ యర్రగొండపాలెం(ఎస్సీ)
- బి.శివప్రసాద్‌రెడ్డి దర్శి (ఓసీ)
- బి.శ్రీనివాసరెడ్డి ఒంగోలు (ఓసీ)
- ఆదిమూలపు సురేష్ కొండెపి (ఎస్సీ)
- అన్నా రాంబాబు మార్కాపురం(ఓసీ)
- కె.నాగార్జునరెడ్డి గిద్దలూరు(ఓసీ)
- డి.నారాయణ యాదవ్ కనిగిరి (బీసీ)

కర్నూలు పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- బి.వై. రామయ్య పార్లమెంట్ (బీసీ)
- ఎ.ఎం.డి.ఇంతియాజ్ కర్నూలు (ముస్లిం)
- కంగాటి శ్రీదేవి పత్తికొండ (ఓసీ)
- ఆదిమూలపు సతీష్ కోడుమూరు (ఎస్సీ)
- బుట్టా రేణుక ఎమ్మిగనూరు(బీసీ)
- వై.బాల నాగిరెడ్డి మంత్రాలయం(ఓసీ)
- వై.సాయిప్రసాద్‌రెడ్డి ఆదోని (ఓసీ)
- బుసినే విరుపాక్షి ఆలూరు (బీసీ)

హిందూపురం పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- జోలదరాసి శాంతి పార్లమెంట్ (బీసీ)
- తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రాప్తాడు (ఓసీ)
- ఈర లక్కప్ప మడకశిర (ఎస్సీ)
- టి నారాయణ దీపిక హిందూపురం (బీసీ)
- కేవీ ఉషశ్రీచరణ్ పెనుకొండ (బీసీ)
- డి.శ్రీధర్ రెడ్డి పుట్టపర్తి (ఓసీ)
- కె.వెంకటరామిరెడ్డి ధర్మవరం (ఓసీ)
- బి.షేక్ మక్బూల్ అహ్మద్ - కదిరి(ముస్లిం)

నెల్లూరు పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- విజయసాయి రెడ్డి పార్లమెంట్ (ఓసీ)
- బి.మధుసూదన్ యాదవ్ కందుకూరు (బీసీ)
- ఆర్.ప్రతాప్‌కుమార్ రెడ్డి - కావలి (ఓసీ)
- మేకపాటి విక్రమ్ రెడ్డి ఆత్మకూరు (ఓసీ)
- ఎస్.ప్రసన్నకుమార్ రెడ్డి - కోవూరు (ఓసీ)
- ఖలీల్ అహ్మద్ నెల్లూరు సిటీ(ముస్లిం)
- ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు రూరల్(ఓసీ)
- ఎం.రాజగోపాల్ రెడ్డి ఉదయగిరి (ఓసీ)

రాజంపేట పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- పి.మిథున్‌రెడ్డి పార్లమెంట్ (ఓసీ)
- ఎ.అమర్‌నాథ్‌రెడ్డి రాజంపేట (ఓసీ)
- కె. శ్రీనివాసులు రైల్వేకోడూరు (ఎస్సీ)
- గడికోట శ్రీకాంత్‌రెడ్డి రాయచోటి (ఓసీ)
- పి.ద్వారకానాథ్‌రెడ్డి తంబళ్లపల్లె (ఓసీ)
- సిహెచ్ రామచంద్రా రెడ్డి - పీలేరు (ఓసీ)
- నిస్సార్ అహ్మద్ మదనపల్లి (ముస్లిం)
- పి.రామచంద్రారెడ్డి పుంగనూరు (ఓసీ)

శ్రీకాకుళం పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- పేరాడ తిలక్ పార్లమెంట్ (బీసీ)
- పిరియా విజయ ఇచ్ఛాపురం (బీసీ)
- డా. సీదిరి అప్పలరాజు పలాస (బీసీ)
- దువ్వాడ శ్రీనివాస్ టెక్కలి (బీసీ)
- రెడ్డి శాంతి పాతపట్నం (బీసీ)
- ధర్మాన ప్రసాదరావు శ్రీకాకుళం (బీసీ)
- తమ్మినేని సీతారాం ఆమదాలవలస (బీసీ)
- ధర్మాన కృష్ణదాసు నరసన్నపేట (బీసీ)

విజయనగరం పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- బెల్లాన చంద్రశేఖర్ పార్లమెంట్ (బీసీ)
- గొర్లె కిరణ్ కుమార్ ఎచ్చెర్ల (బీసీ)
- డా. తలే రాజేష్ రాజాం (ఎస్సీ)
- ఎస్‌వి సీహెచ్ చినప్పల నాయుడు - బొబ్బిలి (బీసీ)
- బి.సత్యనారాయణ చీపురుపల్లి (బీసీ)
- బి.అప్పలనరసయ్య గజపతినగరం (బీసీ)
- బి.అప్పలనాయుడు నెల్లిమర్ల (బీసీ)
- కె.వీరభద్రస్వామి విజయనగరం (ఓసీ)

అనకాపల్లి పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- (బీసీ) పార్లమెంట్
- కరణం ధర్మశ్రీ చోడవరం (బీసీ)
- బి.ముత్యాలనాయుడు మాడుగుల (బీసీ)
- ఎం.భరత్‌కుమార్ అనకాపల్లి (బీసీ)
- అన్నంరెడ్డి అదీప్‌రాజు పెందుర్తి (బీసీ)
- యువిఆర్ రాజు యలమంచిలి (ఓసీ)
- కంబాల జోగులు పాయకరావుపేట(ఎస్సీ)
- పి.ఉమాశంకర్ గణేశ్ నర్సీపట్నం (బీసీ)

అమలాపురం పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- రాపాక వరప్రసాద్ పార్లమెంట్ (ఎస్సీ)
- పిల్లి సూర్య ప్రకాశ్ రామచంద్రాపురం(బీసీ)
- పి. వి. సతీష్ కుమార్ ముమ్మిడివరం(బీసీ)
- పినిపే విశ్వరూప్ అమలాపురం (ఎస్సీ)
- గొల్లపల్లి సూర్యారావు రాజోలు (ఎస్సీ)
- విప్పర్తి వేణుగోపాల్ పి. గన్నవరం (ఎస్సీ)
- చిర్ల జగ్గిరెడ్డి కొత్తపేట (ఓసీ)
- తోట త్రిమూర్తులు మండపేట (ఓసీ)

నరసాపురం పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- గూడూరి ఉమాబాల పార్లమెంట్ (బీసీ)
- సీహెచ్ శ్రీరంగనాథ రాజు - ఆచంట (ఓసీ)
- జిశ్రీహరిగోపాలరావు పాలకొల్లు (బీసీ)
- ఎం. ప్రసాదరాజు నరసాపురం (ఓసీ)
- గ్రంధి శ్రీనివాస్ భీమవరం (ఓసీ)
- పీవీఎల్ నరసింహరాజు ఉండి (ఓసీ)
- కె.నాగేశ్వరరావు తణుకు (బీసీ)
- కొట్టు సత్యనారాయణ తాడేపల్లిగూడెం(ఓసీ)

మచిలీపట్నం పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- సింహాద్రి చంద్ర శేఖరరావు (ఓసీ)
- వి.వంశీమోహన్ గన్నవరం (ఓసీ)
- కె.శ్రీ వేంకటేశ్వరరావు గుడివాడ (ఓసీ)
- ఉప్పాల రాము పెడన (బీసీ)
- పేర్ని కృష్ణమూర్తి మచిలీపట్నం (ఓసీ)
- సింహాద్రి రమేష్‌బాబు అవనిగడ్డ (ఓసీ)
- కైలే అనిల్ కుమార్ పామర్రు (ఎస్సీ)
- జోగి రమేష్ పెనమలూరు (బీసీ)

గుంటూరు పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- కె. వెంకట రోశయ్య పార్లమెంట్ (ఓసీ)
- మేకతోటి సుచరిత తాడికొండ (ఎస్సీ)
- మురుగుడు లావణ్య మంగళగిరి (బీసీ)
- అంబటి మురళి పొన్నూరు (ఓసీ)
- ఎ.శివకుమార్ తెనాలి (ఓసీ)
- బలసాని కిరణ్ కుమార్ ప్రత్తిపాడు (ఎస్సీ)
- విడదల రజిని గుంటూరు పశ్చిమ(బీసీ)
- షేక్ నూరి ఫాతిమా గుంటూరుతూర్పు(ముస్లిం)

బాపట్ల పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- నందిగం సురేష్‌బాబు పార్లమెంట్(ఎస్సీ)
- వి.అశోక్ బాబు వేమూరు (ఎస్సీ)
- డా. ఈవూరు గణేశ్ రేపల్లె (బీసీ)
- కోన రఘుపతి బాపట్ల (ఓసీ)
- ఎడం బాలాజీ పర్చూరు (ఓసీ)
- పి.చిన హనిమిరెడ్డి అద్దంకి (ఓసీ)
- కరణం వెంకటేశ్ చీరాల (ఓసీ)
- మేరుగు నాగార్జున సంతనూతలపాడు(ఎస్సీ)

నంద్యాల పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- పి బ్రహ్మానందరెడ్డి పార్లమెంట్ (ఓసీ)
- గంగుల బ్రిజేంద్రరెడ్డి ఆళ్లగడ్డ (ఓసీ)
- శిల్పా చక్రపాణిరెడ్డి శ్రీశైలం (ఓసీ)
- డా. దారా సుధీర్ నందికొట్కూరు(ఎస్సీ)
- కె.రాంభూపాల్‌రెడ్డి పాణ్యం (ఓసీ)
- ఎస్.రవిచంద్ర కిషోర్ రెడ్డి - నంద్యాల (ఓసీ)
- కాటసాని రామిరెడ్డి బనగానపల్లి (ఓసీ)
- బి.రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్(ఓసీ)

అనంతపురం పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- ఎం. శంకర నారాయణ పార్లమెంట్ (బీసీ)
- మెట్టు గోవిందరెడ్డి రాయదుర్గం (ఓసీ)
- వై. విశ్వేశ్వరరెడ్డి ఉరవకొండ (ఓసీ)
- వై. వెంకటరామిరెడ్డి గుంతకల్లు (ఓసీ)
- కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి (ఓసీ)
- ఎం.వీరాంజనేయులు శింగనమల (ఎస్సీ)
- ఎ.వెంకటరామిరెడ్డి అనంతపురం అర్బన్(ఓసీ)
- తలారి రంగయ్య కళ్యాణదుర్గం(బీసీ)

కడప పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- వైఎస్ అవినాష్‌రెడ్డి పార్లమెంట్ (ఓసీ)
- డా. దాసరి సుధ బద్వేల్ (ఎస్సీ)
- అంజాద్ బాషా కడప (ముస్లిం)
- వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పులివెందుల(ఓసీ)
- పి.రవీంద్రనాథ్‌రెడ్డి కమలాపురం(ఓసీ)
- డా. మూలె సుధీర్‌రెడ్డి జమ్మలమడుగు(ఓసీ)
- ఆర్.శివప్రసాద్‌రెడ్డి ప్రొద్దుటూరు (ఓసీ)
- ఎస్.రఘురామిరెడ్డి మైదుకూరు (ఓసీ)

తిరుపతి పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- మద్దిల గురుమూర్తి పార్లమెంట్ (ఎస్సీ)
- కాకాణి గోవర్ధన్ రెడ్డి సర్వేపల్లి (ఓసీ)
- మేరిగ మురళీధర్ గూడూరు (ఎస్సీ)
- కిలివేటి సంజీవయ్య సూళ్లూరుపేట (ఎస్సీ)
- ఎన్ రామ్‌కుమార్ రెడ్డి వెంకటగిరి(ఓసీ)
- భూమన అభినయ్ రెడ్డి - తిరుపతి (ఓసీ)
- బి.మధుసూదన్‌రెడ్డి శ్రీకాళహస్తి (ఓసీ)
- నూకతోటి రాజేష్ సత్యవేడు (ఎస్సీ)

చిత్తూరు పార్లమెంట్ - అసెంబ్లీ నియోజకవర్గాలు



- ఎన్ రెడ్డప్ప పార్లమెంట్ (ఎస్సీ)
- సిహెచ్ మోహిత్‌రెడ్డి చంద్రగిరి (ఓసీ)
- ఆర్కే రోజా నగరి (ఓసీ)
- కళత్తూరు కృపాలక్ష్మి గంగాధర నెల్లూరు(ఎస్సీ)
- ఎం.విజయానంద రెడ్డి - చిత్తూరు (ఓసీ)
- ఎం.సునీల్ కుమార్ పూతలపట్టు (ఎస్సీ)
- ఎన్.వెంకటేగౌడ పలమనేరు (బీసీ)
- కేజే భరత్ కుప్పం (బీసీ)

క్లుప్తంగా...

19న డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో గ్రీవెన్స్ డే

సాక్షి, అమరావతి: ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారుల (డీఎంహెచ్‌వో) కార్యాలయాల్లో గ్రీవెన్స్ డే నిర్వహించాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ ఆదేశాలిచ్చారు. వైద్య శాఖలో పనిచేస్తోన్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా ఆ రోజున డీఎంహెచ్‌వోల దృష్టికి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. జిల్లాల్లో వచ్చిన వినతులన్నింటినీ సమీకరించి విజయవాడలోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌కు అందజేయాలని డీఎంహెచ్‌వోలకు సూచించారు. వేతనాల సమస్యలపై వినతులు సమర్పించడానికి ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఇది చివరి అవకాశమని పేర్కొన్నారు.

బందరు పోర్టు కోసం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం తరలింపు

- మంగినపూడి నుంచి కరగ్రహారానికి..
- పరిపాలన అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: మచిలీపట్నం పోర్టు నిర్మిస్తున్న ప్రధాన ప్రాంతంలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని మరోచోటకు మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పోర్టు నిర్మిస్తున్న ప్రధాన భాగం మంగినపూడి వద్ద 30 ఎకరాల్లో విస్తరించి ఉన్న పోలీసు శిక్షణ కేంద్రం ఉండటంతో పోర్టు నిర్మాణానికి ఇది ప్రతిబంధకంగా మారింది. అందుకని కరగ్రహారం వద్ద 46.26 ఎకరాల విస్తీర్ణంలో పోలిసు శిక్షణ కేంద్రాన్ని తరలించడానికి కృష్ణా జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపారు. ఈ శిక్షణ కేంద్రం మార్పునకు అయ్యే వ్యయాన్ని ఏపీ మారిటైమ్ బోర్డు భరించడానికి ముందుకొచ్చింది. కరగ్రహారం వద్ద 46.26 ఎకరాల విస్తీర్ణంలో పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఏపీ మారిటైమ్ బోర్డు నిర్మించి ఇవ్వనుంది. ఇందుకోసం రూ.32.29 కోట్లు వ్యయం చేయనుంది. ఇందులో భూసేకరణకు రూ.15.15 కోట్లు, భవన నిర్మాణం కోసం రూ.17.14 కోట్లు వ్యయం చేయనుంది. ఈ శిక్షణ కేంద్రం తరలింపునకు అయ్యే వ్యయాన్ని ఏపీ మారిటైమ్ బోర్డు భరించడానికి పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర మౌలికవసతులు పెట్టుబడులు శాఖకార్యదర్శి ఎస్ యువరాజ్ ఉత్తర్వులిచ్చారు. ఉత్తర్వులకనుగుణంగా ఏపీ మారిటైమ్‌బోర్డు సీఈవో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు ఐదుగురు ఎంపీలు, 25 మంది ఎమ్మెల్యేలనివ్వండి

- బీజేపీ అంటే బాబు, జగన్, పవన్
- విశాఖ సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి


మాట్లాడుతున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

గాజువాక: ఆంధ్రప్రదేశ్‌కు ప్రశ్నించే గొంతుకలు కావాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడున్న చంద్రబాబు, వైఎస్ జగన్ పాలించాలనుకొనే నాయకులే తప్ప ప్రశ్నించే గొంతుకలు కావాలనుకోవడంలేదని అన్నారు. అందువల్లే పదేళ్లయినా పోలవరం పూర్తి కాలేదని, రాజధాని ఎక్కడో చెప్పలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ నిర్వహించిన విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు న్యాయ సాధ న సభలో ఆయన ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఐదుగురు ఎంపీలు, 25 మంది ఎమ్మెల్యేలను ఇస్తే వారితో ఏపీ హక్కులను సాధిస్తామని చెప్పారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అదానీ కోసం ప్రధాని మోదీ విక్రయిస్తుంటే పహిల్వాన్లుగా చెప్పుకొంటున్న ఇక్కడి నాయకులు, పాలకులు ప్రశ్నించడం లేదన్నారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని అన్నారు. వీరిలో ఎవరికి ఓటేసినా బీజేపీకి ఓటేసినట్టేనన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి నిజమైన వారసురాలు షర్మిల అని అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ.. 2014 వరకు లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కుట్ర చేసి నష్టాలోకి తోశారన్నారు. తమ ప్రాణాలను అడ్డు పెట్టయినా స్టీల్‌ప్లాంట్‌కు అండగా నిలుస్తామన్నారు. ఊసరవెల్లి కూడా రంగులు ఎలా మార్చాలో బాబు వద్ద నేర్చుకోవాలన్నారు. నాయకులు కేవీపీ రామచంద్రరావు, రుద్రరాజు, రఘువీరారెడ్డి, సీపీఐ కార్యదర్శి నారాయణ, సీపీఎం నాయకుడు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వచ్చి అమరావతిని రాజధానిగా చేస్తామంటారా?

లజపతిరాయ్ మండిపాటు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విశాఖపట్నం వచ్చి అమరావతిని రాజధానిగా చేస్తామనడం దారుణమని నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసం వచ్చిన రేవంత్ రెడ్డి విశాఖ గొప్ప నగరమని పొగుడుతూనే, అమరావతిని రాజధానిగా చేస్తామని ఎలా చెబుతారని ప్రశ్నించారు. 2014–19 మధ్య కాలంలో చంద్రబాబు ప్రభుత్వం రాజధాని నిర్మాణంలో విఫలమైందని చెప్పారు. ఈ పాపం ఎవరిదో రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. రాజధానిపై రేవంత్ ప్రకటనలు ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను గాయపరిచాయన్నారు. విశాఖ రాజధాని కాకుండా ఏ రాజకీయ శక్తీ అడ్డుకోలేదని స్పష్టం చేశారు.

బాబు పొత్తులను చిత్తుచేయండి

రాష్ట్రవ్యాప్తంగా కత్తులు నూరుతున్న మైనారిటీలు

- 2014 ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని బాబు అమలుచేయలేదని మండిపాటు
- క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలను దగా చేశాడంటూ ఆగ్రహం
- మరోసారి మోసం చేసేందుకే పొత్తులు
- బీజేపీ, జనసేనతో కలిసి వస్తున్న బాబుకు బుద్ధి చెప్పాలని పిలుపు



సాక్షి, అమరావతి: చంద్రబాబు అవకాశవాద పొత్తులపై రాష్ట్రంలోని క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు కత్తులు నూరుతున్నారు. 2014 ఎన్నికల్లో అదే పార్టీలతో కలిసి పోటీచేసి అధికారం చేపట్టిన ఆయన అప్పట్లో ఇచ్చిన ఏ హామీని అమలుచేయలేదని వారు గుర్తుచేస్తున్నారు. అలాగే, ముస్లిం మైనారిటీ వర్గాల సంక్షేమానికి 2014 మేనిఫెస్టోలో హామీలు గుప్పించిన చంద్రబాబు వాటినీ అటకెక్కించేరన్నారు. ఉదా.. హజ్ యాత్రికుల సౌకర్యం కోసం విశాఖపట్నం, విజయవాడ, రేణిగుంటలో హజ్‌హౌస్‌లు నిర్మిస్తానని, ముస్లిం జనాభా ప్రాతిపదికన వారికి బడ్జెట్‌లోను, స్థానిక సంస్థల ఎన్నికల్లోను సీట్లు కేటాయిస్తానని, మైనారిటీలకు చెందిన వక్ఫ్ ఆస్తులు, చర్చిల ఆస్తుల రికార్డులను పక్కాగా తయారుచేసి వాటిని పరిరక్షిస్తామంటూ ఆయన ఇచ్చిన ప్రధాన హామీలేవీ అమలుకు నోచుకోలేదని మైనారిటీలు గుర్తుచేస్తున్నారు. నిరుద్యోగ ముస్లిం యువత స్వయం ఉపాధి కోసం రూ.5 లక్షలు, వ్యాపారం కోసం వడ్డీలేని రుణాలు ఇస్తామని, వడ్డీలేని ఇస్లామిక్ బ్యాంకింగ్ విధానాన్ని రాష్ట్రంలో అమలుచేస్తామని చెప్పిన మాట కూడా అమలుకు నోచుకోలేదంటున్నారు. ఇక క్రిస్టియన్ మైనార్టీలకు చంద్రబాబు ఇచ్చిన హామీలు పరిశీలిస్తే.. కబ్జాదారుల నుంచి పేద క్రిస్టియన్లు, బలహీనవర్గాల భూములు కాపాడతామని, క్రైస్తవ సంస్థల ఆస్తులను పరిరక్షిస్తామని, దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేరుస్తామని, క్రిస్టియన్ శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయిస్తామన్న హామీలను అధికారం చేపట్టిన అనంతరం పట్టించుకున్న పాపాన పోలేదు. 2014లో ఇచ్చిన హామీలు అమలుచేయని ఇదే చంద్రబాబు.. మళ్లీ అదే బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తుతో మరోసారి దగా చేసేందుకు వస్తున్నాడని, పొత్తులతో కట్ట కట్టుకుని వస్తున్న ఆయనకు బుద్ధిచెప్పాలని క్రిస్టియన్, ముస్లిం నేతలు ప్రజలకు పిలుపునిస్తున్నారు.

బీజేపీతో కలిసి బాబు పెద్ద తప్పుచేశారు



మతతత్వ బీజేపీతో మరోసారి పొత్తు పెట్టుకుని చంద్రాబాబు పెద్ద తప్పుచేశారు. 2024 ఎన్నికల్లో గెలుపుకోసం చంద్రబాబు అనేక విష ప్రయోగాలు చేస్తున్నారు. 2014లో ఆయన బీజేపీతో పెట్టుకుని 2019లో ఆ పార్టీని వీడి ప్రధాని మోదీని టెర్రరిస్టుతో పోల్చి మళ్లీ ఇప్పుడు ఆయన కాళ్లబేరానికి వచ్చాడు. బీజేపీ, జనసేనలతో కలిసి వస్తున్న చంద్రబాబును రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు చిత్తుచిత్తుగా ఓడిస్తారు. సంక్షేమం, అభివృద్ధి ద్వారా తనదైన ముద్ర వేసుకున్న సీఎం వైఎస్ జగన్‌ను 2024 ఎన్నికల్లో ప్రజలు మళ్లీ సీఎంను చేస్తారు.

– పెరికె వరప్రసాదరావు, నేషనల్ దళిత క్రిస్టియన్ రైట్స్ చైర్మన్

ముస్లింలను అణగదొక్కిన బాబుకు బుద్ధిచెబుతాం



చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ముస్లింలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా మరింత అణగదొక్కారు. మైనారిటీ శాఖను మైనారిటీలకు కాకుండా చేశారు. ఐదేళ్లపాటు ముస్లింలకు కనీసం మంత్రి పదవి కూడా ఇవ్వని బాబు ఎన్నికల ముందు కంటితుడుపు చర్యగా ఇచ్చామనిపించారు. బీజేపీతో కలిసి అధికారం పంచుకున్న బాబు అదే పోకడలతో ముస్లింలలో నాయకత్వాన్ని ఎదగనీయకుండా చేశారు. ప్రజారంజక పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవడం ద్వారా ఈ ఎన్నికల్లో బాబుకు బుద్ధిచెప్పడం ఖాయం.

– షేక్ మునీర్ అహ్మద్, ఆంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్

ఏపీలో మే 13న పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. ఏపీలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు, 25 లోక్‌సభ స్థానాలకు మే 13న పోలింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఒకే విడతలో ఎన్నికలు పూర్తవుతాయి. ఏపీ అసెంబ్లీ పదవీకాలం జూన్ 11వ తేదీతో ముగియనుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ న్యూఢిల్లీలో ఎన్నికల షెడ్యూల్ వివరాలు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలు ఏడు విడతల్లో పూర్తిచేయనున్నారు. మన రాష్ట్రంలో అన్ని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు నాలుగో విడతలో ఒకేరోజు ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడుతుంది. ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల దాఖలు గడువు ఉంటుంది. కాగా ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 29న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా ప్రకటించారు. మే 13న పోలింగ్ జరుగనుండగా, జూన్ 4న కౌంటింగ్ చేపట్టనున్నారు.

నేడే గ్రూప్–1 ప్రిలిమ్స్

- పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు
- పరీక్ష రాయనున్న 1,48,881 మంది
- ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆదివారం నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్–1 స్క్రీనింగ్ పరీక్ష (ప్రిలిమ్స్)కు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఏర్పాట్లపై శనివారం సీఎస్ తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 301 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం 1,48,881 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్–2 పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించామని వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఇద్దరు పురుష, ఇద్దరు మహిళా పోలీసులు ఉంటారన్నారు. అలాగే పరీక్షల పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఒక ఐఏఎస్ అధికారిని ఇన్‌చార్జిగా నియమించామని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి జిల్లా స్థాయి సీనియర్ అధికారులను లైజన్ అధికారులుగా నియమించి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. అలాగే అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, ప్రథమ చికిత్స సౌకర్యాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్ ద్వారా పరీక్షలు జరుగుతున్న తీరును నిరంతరం పర్యవేక్షించాలని ఏపీపీఎస్సీ అధికారులకు సూచించారు. పరీక్ష అనంతరం ఆన్సర్ షీట్లు, ఇతర సామగ్రిని కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం జగన్‌కు ముస్లిం సమాజం రుణపడి ఉంది..

రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షంషీర్ ఆలీబేగ్



సాక్షి, అమరావతి: ముస్లిం సంక్షేమం, అభివృద్ధిలో సీఎం వైఎస్ జగన్ తండ్రికి మించిన తనయుడిగా నిలిచారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షంషీర్ ఆలీబేగ్ కొనియాడారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన ఆలీబేగ్‌ను రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. విజయవాడలోని కార్యాలయంలో శనివారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం స్థితిగతులు మార్చేందుకు వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్లను అమలు చేశారని గుర్తుచేశారు. తండ్రి కంటే రెండు అడుగులు ముందుకేసిన సీఎం జగన్.. ముస్లింలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు ఆర్థికంగాను, రాజకీయంగా ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు.సీఎం జగన్‌కు ముస్లిం సమాజం రుణపడి ఉందన్నారు.

బీజేపీలో చేరిన కాపు, ముళ్లమూడి రేణుక

సాక్షి, అమరావతి: టీడీపీకి ఇటీవల రాజీనామా చేసిన తణుకు మాజీ మున్సిపల్ చైర్మన్ ముళ్ళపూడి రేణుక, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి శనివారం బీజేపీలో చేరారు. విజయవాడలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ థావడే ఆయా నాయకులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వివిధ జిల్లాల నుంచి పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు సైతం బీజేపీలో చేరినట్టు ఈ సందర్భంగా పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఇవిగో నవరత్నాల వెలుగులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

దేవుడిలా ఆదుకున్నారు



మాది పేద కుటుంబం. నా భర్త ఓబులేసు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మాకు ఒకే కుమారుడు. పెళ్లి చేసిన అనంతరం వేరు కాపురం పెట్టుకున్నాడు. నా భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ఒంటరిదాన్నయ్యాను. ఆరోగ్యం సరిలేక కూలి పనులకు వెళ్లలేకపోయాను. ఇలాంటి పరిస్థితుల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న పింఛన్ నా బతుకు దెరువుకు తోడైంది. ఏటా వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 చొప్పున అందుతోంది. దీంతో ఈ పథకాలతోనే బతుకుతున్నా. చిన్న, చిన్న అప్పులు తీర్చేశా. కరోనా కష్టకాలంలో కూడా నాకు రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులు ఇంటికే తెచ్చి ఇచ్చారు. ఎలాంటి కష్టం లేకుండా కరోనా పరిస్థితులను ఎదుర్కొనే శక్తిని జగనన్న ఇచ్చాడు. ఈ పథకాలే నాకు అందకుంటే జీవించే దాన్ని కాదేమో. ఓ వైపు భర్త చనిపోవడం, కొడుకు పెళ్లి చేసుకొని వెళ్లిపోవడంతో ఒంటరిగా జీవనం సాగేదెలా.. అనే దిగులుతో ఉన్న నాకు మా ఇంటి దేవుడిలా జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నాడు. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటా.

– వడ్డిబుజ్జమ్మ, ఆత్మకూరు (విశ్వనాథం రవికుమార్, విలేకరి, ఆత్మకూరు)

ఈ ఆనందం.. ఈ సర్కారు పుణ్యమే



మాది గిరిజన కుటుంబం. జగనన్న సంక్షేమ పథకాలు మా కుటుంబాన్ని ఆదుకున్నాయి. 2019 సంవత్సరానికి ముందు మాకు సొంత ఇల్లు లేదు. జగనన్న ప్రభుత్వంలో మాకు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం అంటివలసలో ఇంటి స్థలంతో పాటు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు మంజూరయింది. ఆ డబ్బుతో సొంత ఇల్లు నిర్మించుకోగలిగాం. మా అత్తయ్యకు వృద్ధాప్య పింఛను అందుతోంది. మా మామయ్యకు ప్రభుత్వం ఎకరా డి.పట్టా భూమి ఇచ్చింది. సున్నా వడ్డీ రూపంలో 22,500 రూపాయలు అందుకున్నాం. వైఎస్సార్ ఆసరా కింద వచ్చిన మొత్తంతో కిరాణాషాపు పెట్టుకొన్నాను. ప్రస్తుతం అదే మాకు జీవనాధారమైంది. మా ఇద్దరి పిల్లల్లో ఒకరికి అమ్మఒడి అందుతోంది. వారి భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. జగనన్న సంక్షేమ పథకాలు మా ఇంటిల్లిపాదికీ ఉన్నతమైన జీవితాన్నిచ్చింది. ఇప్పుడు సొంత ఇల్లు, సొంత పొలం, సొంత వ్యాపారం, మా పిల్లలకు ఇంగ్లిషు మీడియం చదువులు. ఇంత సంక్షేమాన్ని అందించిన జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– అంబటి అనూష, అంటివలస (ఎం.కృష్ణారావు, విలేకరి, సాలూరు రూరల్)

నాడు కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేదు



ఇరవై తొమ్మిదేళ్ల కిందట మా ఆయన మృతి చెందడంతో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేటలో కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలనూ పోషించుకుంటూ వచ్చాను. అబ్బాయిలిద్దరూ కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వారిద్దరికీ వివాహాలయ్యాయి. వారు వేరేగా జీవిస్తున్నారు. పెద్ద కుమార్తెకు వివాహం చేసి పంపించాం. చిన్న కుమార్తె యేరుకొండ రత్నకుమారికి చిన్నతనం నుంచీ ఫిట్స్ వస్తుండడంతో మతిస్థిమితం కోల్పోయింది. డిజేబుల్డ్ పింఛన్ కోసం టీడీపీ హయాంలో ప్రభుత్వాస్పత్రులు, పంచాయతీ, ఎంపీడీవో, ఎంఆర్‌వో, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి దరఖాస్తులు ఇచ్చినప్పటికీ ఎలాంటి ప్రయోజనం కలగలేదు. జగనన్న సీఎం అయ్యాక ఆమెకు పింఛన్ రూ.3 వేలు మంజూరైంది. ఆ సొమ్ముతో రత్నకుమారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నాం. నాకూ పింఛన్ రూ.3,000 వస్తోంది. ఇద్దరికీ వచ్చే పింఛను సొమ్ముతో కాలం వెళ్లదీస్తున్నాను. నాకు పింఛన్‌తోపాటు కాపునేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు చొప్పున, రైతు భరోసా కింద ఏటా రూ.13.500లు వంతున మా కుటుంబానికి అందాయి. సర్కారు దయతో మా జీవనం సాఫీగా సాగుతోంది.

– యేరుకొండ వరలక్ష్మి, హుకుంపేట (యెనుముల విశ్వనాథం, విలేకరి, రాజమహేంద్రవరం రూరల్)

చీడపీడలు మీ మెదడుకే

మామిడి రైతుకు ఏటా కష్టాలే అంటూ ఈనాడు తప్పుడు రాతలు

ఏటా పెరుగుతున్న మామిడి తోటల విస్తీర్ణం.. ఐదేళ్లలో కొత్తగా 55,865 ఎకరాల్లో సాగు

2.97 లక్షల టన్నుల మేర పెరిగిన దిగుబడులు

- టీడీపీ హయాంలో టన్ను రూ.40-50 వేలకు మించని ధర
- ప్రస్తుతం గరిష్టంగా టన్నుకు రూ.1.30 లక్షలు
- రూ.1.80 కోట్ల రాయితీతో ఫ్రూట్ కవర్ల పంపిణీ
- దేశంలో తొలిసారి మామిడి రైతులకు గ్యాప్ సర్టిఫికేషన్
- ఎన్టీఆర్, చిత్తూరు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు



సాక్షి, అమరావతి: ఐదేళ్లుగా మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచింది. పాత తోటల పునరుద్ధరణ, కొత్త తోటల విస్తరణ కోసం పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందించింది. నాణ్యమైన దిగుబడులే లక్ష్యంగా తోట బడులు, ఆర్బీకేల ద్వారా రైతులకు శిక్షణ ఇప్పించింది. వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, ప్రకృతి వైపరీత్యాల్లో పంట నష్టపోయిన మామిడి రైతులకు పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించింది. బంగినపల్లి, ఇమామ్ పసంద్ వంటి ఫైన్ వెరైటీ పండ్లకు టీడీపీ ప్రభుత్వ హయాంలో గరిష్టంగా టన్ను రూ.40వేలు–50వేలు పలుకగా, ఈ ప్రభుత్వంలో రూ.1.30లక్షల వరకు కూడా పలికింది. గత ప్రభుత్వంలో టన్ను రూ.ఐదారువేలు కూడా పలకని తోతాపూరికి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా రూ.10వేలకు తగ్గకుండా పలికేలా చేసింది. కానీ ఇవేమీ పట్టని ఈనాడు దినపత్రిక ప్రభుత్వంపై బురద జల్లడం, మామిడి రైతులను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా 'మామిడి రైతుకు ఏటా కష్టాలే' అంటూ విషం కక్కింది.

ఆరోపణ: 5.86 లక్షల ఎకరాల్లో తగ్గిన విస్తీర్ణం!

వాస్తవం: 2019–20లో 9,41,235 ఎకరాల్లో మామిడి తోటలు సాగవగా, 2023–24లో అది 9,97,100 ఎకరాలకు పెరిగింది. కొత్తగా ఈ ఐదేళ్లలో 55,865 ఎకరాల్లో కొత్తగా మామిడి తోటలు పెరిగాయి. 2019–20లో 46.88లక్షల టన్నుల దిగుబడులు రాగా, 2023–24లో 49.85లక్షల టన్నులు వస్తాయని అంచనా వేశారు. వాస్తవం ఇలా ఉంటే ఈనాడుకు మాత్రం రాష్ట్రంలో 5.86 లక్షల ఎకరాల్లో మామిడి సాగు తగ్గిపోయింది,

ఆరోపణ: చీడపీడలను నివారించేందుకు చర్యలేవి?

వాస్తవం: 5 ఏళ్లలో 883 తోట బడుల ద్వారా సమీకృత తెగులు, ఎరువు యాజమాన్య పద్ధతులపై మామిడి రైతులకు ఆర్బీకే స్థాయిలో శిక్షణనిచ్చారు. శాస్త్రవేత్తలు, అధికారులతో కూడిన బృందాలను మామిడి సాగయ్యే జిల్లాలకు పంపి క్షేత్ర స్థాయిలో తోటలకు సోకుతున్న చీడపీడలు, తెగుళ్లను గుర్తించడం, తక్షణ నివారణ చర్యలు చేపట్టేలా రైతులను అప్రమత్తం చేస్తున్నారు. నల్లతామరతో సహా వివిధ రకాల చీడపీడలు, తెగుళ్ల నివారణకు రైతు క్షేత్రాల్లోనే సామూహిక చర్యలు చేపట్టారు. వాట్సప్ గ్రూపుల ద్వారా చిన్న చిన్న వీడియో సందేశాలను పంపి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించారు. రూ.కోటి రాయితీతో 2802.50 ఎకరాల విస్తీర్ణంలో కొత్తగా మామిడి సాగుకు, రూ.3.50 కోట్ల రాయితీతో 6250 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల నాణ్యత ప్రమాణాలు పెంచే కార్యక్రమాలు చేపట్టారు. ఇలా 4 ఏళ్లలో రూ.1.80 కోట్ల రాయితీతో ఫ్రూట్ కవర్లను రైతులకు పంపిణీ చేశారు. తద్వారా మామిడి నాణ్యత ప్రమాణాలను పెంచి దేశీయంగానే కాకుండా విదేశాలలో కూడా ఆంధ్ర మామిడికి గిరాకీ వచ్చేటట్టు చేయగలిగారు.

ఆరోపణ: వైకాపా వచ్చాక ప్రోత్సాహమే కరువు

వాస్తవం: పండ్ల తోటల విస్తరణ, నిర్వహణ కార్యక్రమం కింద 1.14 లక్షల మంది రైతులకు రూ.126.51 కోట్లు, పాత తోటల పునరుద్ధరణ కింద 8618 మందికి రూ.14.53 కోట్ల లబ్ధి చేకూర్చారు. ప్రస్తుతం ఉన్న తోటలలో ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా సూక్ష్మనీటి సాగు పథకం కింద ఐదేళ్లలో 70,350 ఎకరాల్లో మామిడి తోటలకు డ్రిప్ పరికరాలను సమకూర్చారు. 5 ఏళ్లలో రూ.35.04 కోట్ల రాయితీతో 1752 ప్యాక్ హౌస్‌లను రైతుల పొలాల్లో నిర్మించగా, రూ.39.02 కోట్ల రాయితీతో 485 కలెక్షన్ కేంద్రాలను మామిడి రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా నిర్మించారు. 91 కోల్డ్ రూమ్స్ నిర్మాణానికి 70 శాతం రాయితీ అందించారు. 2023–24లో మామిడి రైతుల అభివృద్ధి కోసం రూ.22.50 కోట్ల రాయితీతో మామిడి ఎఫ్‌పీఓల ద్వారా 200 కలెక్షన్ సెంటర్లు, రూ.10.50 కోట్ల రాయితీతో రైతు క్షేత్రాల్లో 525 ప్యాక్ హౌస్‌లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆరోపణ: ఎగుమతులకు ఏదీ ప్రోత్సాహం

వాస్తవం: ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రతిఏటా అపెడా ఆధ్వర్యంలో అమ్మకపు, కొనుగోలు దారుల సదస్సులు నిర్వహించారు. దక్షిణ కొరియా, జపాన్, న్యూజిలాండ్, అమెరికా, లండన్ వంటి దేశాలకు కూడా పెద్ద ఎత్తున ఎగుమతులు జరిగాయి. టీడీపీ కాలంలో ఐదేళ్లలో ఏటా సగటున 500 టన్నులు ఎగుమతి అయితే.. ఈ 5 ఏళ్లలో ఏటా సగటున 1200 టన్నుల పండ్లతో పాటు 8 లక్షల టన్నుల మామిడి గుజ్జును విదేశాలకు ఎగుమతి చేయగలిగారు. మరో వైపు దేశంలోనే తొలిసారి మామిడి రైతులకు జీఏపీ సర్టిఫికేషన్ జారీ చేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎన్టీఆర్, చిత్తూరు జిల్లాల్లో అమలు చేస్తున్నారు. ఫలితంగా మామిడి ఎగుమతులు పెరగడమే కాదు..రైతులు అత్యధిక ధర పొందేందుకు దోహదపడనుంది.

ఆరోపణ: మామిడి రైతులకు చేయూత ఏదీ

వాస్తవం: ప్రాంతాల వారీగా మామిడి తోటలను సమీప గుజ్జు పరిశ్రమలకు అనుసంధానం చేశారు. తోతాపురి మామిడి ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ధరలు పతనం కాకుండా చర్యలు చేపట్టారు. పండ్ల నాణ్యతను పెంచడానికి పండు ఈగల నష్టాన్ని నివారించడానికి ఆధునిక పండ్లకోత పరికరాలతో పాటు పండు ఈగ నివారణకు అవసరమైన ఆకర్షణ బుట్టలను పంపిణీ చేస్తున్నారు. పండ్ల కోత, నాణ్యతపై మండల స్థాయిలో రైతులకు, కోసిన పండ్లను గుజ్జు తయారీ పరిశ్రమలకు చేరవేయడంపై ఆర్బీకే సిబ్బందికి జిల్లా స్థాయిలోనూ శిక్షణ ఇచ్చారు. ధరలు పడిపోకుండా ఉండేందుకు దశల వారీగా పండ్ల కోతలు జరిగేలా చర్యలు చేపట్టారు. కోత మొదలైనప్పటి నుంచి చివరి పండు కోత కొచ్చే వరకు ప్రతిరోజు ధరల స్థిరీకరణకు విశేషమైన కృషి చేస్తున్నారు. ఫలితంగా ఈ ఐదేళ్లలో ఏ దశలోనూ టన్ను రూ.10వేలకు తగ్గకుండా ఉంది. సీజన్‌లో గరిష్టంగా రూ.23వేలకు అమ్ముకోగలిగారు. అదే టీడీపీ హయాంలో ఏనాడు రూ.5వేలకు మించి కొనలేని పరిస్థితి ఉండేది.

రాష్ట్రంలో మామిడి విస్తీర్ణం ఇలా..

సంవత్సరం	విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)	దిగుబడులు (టన్నుల్లో)
2019-20	9,41,235	46,88,077
2020-21	9,41,240	45,17,928
2021-22	9,84,857	51,21,289
2022-23	9,97,055	49,85,275
2023-24	9,97,100	49,85,775

(రెండో ముందస్తు అంచనా ప్రకారం)

వడ్డెర్లను అవమానించిన బాబు

- టీడీపీకి వడ్డెర్లు ఎవరూ ఓటేయకండి
- వడ్డెర సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు వడ్డె రమణ



రాజంపేట/తిరుపతి కల్చరల్: టికెట్ల కేటాయింపు విషయంలో వడ్డెరలను చంద్రబాబు మరోసారి అవమానించారని వడ్డెర సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, వడ్డెర ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు వడ్డె రమణ ధ్వజమెత్తారు. శనివారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు వడ్డెరలకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పుట్టపర్తి, గుంటూరు వెస్ట్ స్థానాలను వడ్డెరలకు కేటాయిస్తామని హామీ ఇచ్చి.. రెండుచోట్ల మొండిచెయ్యి చూపారన్నారు. గోడు వెళ్లబోసుకునేందుకు వెళ్లిన వడ్డెర నేతలను చంద్రబాబు బలవంతంగా బయటకు నెట్టివేశారన్నారు. టీడీపీకి వడ్డెరలు ఓటు వేయకూడదని పిలుపునిచ్చారు. వడ్డెరలు దాదాపు 40 నియోజకవర్గాలలో ఫలితాలను శాసించే స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో వడ్డెరలు సత్తా చాటాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయించేలా ప్రతి వడ్డెర సోదరుడు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

టీడీపీ దగా చేసిందంటూ రాజీనామా

రాష్ట్రంలో 30 లక్షల మంది ఓటర్లు ఉన్న వడ్డెరలకు సీట్లు కేటాయించకుండా దగా చేసిన టీడీపీకి రాజీనామా చేస్తున్నట్టు టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల సుబ్బారావు ప్రకటించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు 1994 నుంచి హామీ ఇస్తున్నా.. పూర్తిగా విస్మరించి మోసం చేశారన్నారు. కుప్పంలో జరిగిన యువగళం సభలో సైతం వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి వారి ఎదుగుదలకు కృషి చేస్తామని లోకేశ్ మాట ఇచ్చారన్నారు. అసంఘటిత కార్మిక సంఘం నేత పి.విజయకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, వడ్డెర జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, కార్యదర్శి కె.నరేష్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
ఆదివారం ॥ 17-3-2024

వైరల్



డెబ్బై మూడేళ్ల బామ్మ... మాధురితో పోటీపడి డ్యాన్స్ చేసింది!

'డ్యాన్స్ వయసు ఎరగదు' అనే సామెత ఉందో లేదో గాని ఈ వీడియో చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. ప్రముఖ డ్యాన్స్ రియాలిటీ షో 'డ్యాన్స్ దివానే'లో 73 సంవత్సరాల బామ్మ డ్యాన్స్ వైరల్ అయింది. ఛోబీ అనే బామ్మ 'దేవదాస్' సినిమాలోని మాధురి దీక్షిత్ పాపులర్ పాట 'మార్ డాలా'కు అద్భుతంగా డ్యాన్స్ చేసింది.

రియాల్టీ షో జడ్జీలు మాధురి దీక్షిత్, సునీల్‌షెట్టీలకు ఛోబీ డ్యాన్స్ బాగా నచ్చింది. 'మనసులో ఏది అనిపిస్తే అది చేయాలి. భయం అవసరం లేదు... అని మీరు మాకు చెబుతున్నట్లుగా ఉంది' అని బామ్మను ప్రశంసించింది మాధురి. ఆ తరువాత బామ్మతో కలిసి మాధురి దీక్షిత్ డ్యాన్స్ చేసింది.

'మాధురి అంటే డ్యాన్స్‌కు మరో పేరు. ఆమె పాపులర్ పాటకు డ్యాన్స్ చేయాలంటే సాహసం మాత్రమే కాదు. ప్రతిభ కూడా ఉండాలి. ప్రతిభ, సాహసం మూర్తీభవించిన ఛోబీజీకి అభినందనలు'.

'మాధురితో పోటీపడి డ్యాన్స్ చేయడం మామూలు విషయం కాదు'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో సోషల్ మీడియాలో కనిపించాయి.

సోదర సోదరీమణులారా ఒక లుక్ ఇటు వేయరా



ఒక వీడియో 35 మిలియన్‌ల వ్యూస్‌తో వైరల్ కావడానికి ఎన్ని విన్యాసాలు చేయాలి?

'అబ్బే! అంతక్కర్లేదండి' అని చెప్పడానికి ఇన్‌స్టాగ్రామ్‌లో 35 మిలియన్‌ల వ్యూస్‌తో వైరల్ అయిన ఈ చిన్న వీడియోనే సాక్ష్యం.

కీస్ అనే మహిళ కెమెరా లెన్స్ ముందు పసిబిడ్డను పడుకోబెట్టి 'కెన్ యూ ప్లీజ్ వాచ్ మై బేబీ ఫర్ మీ' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. పసిబిడ్డ అసాధారణ విన్యాసాలేమీ చేయలేదు. కెమెరాను అలా చూస్తూ ఉన్నాడంతే. పసిబిడ్డ తేనెకళ్లు, చివర్లో నవ్విన నిష్కల్మషమైన నవ్వు లక్షలాది మంది ప్రేక్షకులను కదిలించింది. ప్రపంచంలో ఎన్ని భాషలు అయినా ఉండొచ్చు. అయితే శిశువుది మాత్రం విశ్వభాష. అది అందరికీ అర్థమవుతుంది. అందరికీ తెగ నచ్చుతుంది అని చెప్పడానికి, పవర్ ఆఫ్ సింప్లిసిటీకి అద్దం పట్టే ఈ వీడియోనే నిదర్శనం.

సివంగివే సివంగివే... నీ త్యాగమే గుర్తించగా సాహో అంటూ మోకరిల్లదా లోకమే





పాటలు అంటే సరదాగా పాడుకునేవే కావు శక్తి మాత్రలు కూడా. తాజా విషయానికి వస్తే ఇండియన్ ఉమెన్ కబడ్డీ కోచ్ కవితా సెల్వరాజ్ 'రెయిన్ డ్రాప్ ఫౌండేషన్' నిర్వహించిన సమావేశంలో విజయ్ 'బిగిల్' (తెలుగులో విజిల్) సినిమాలో ఏఆర్ రెహమాన్ పాడిన 'సివంగివే' పాట ఎంత ఇన్‌స్పైర్ చేసిందో చెప్పింది. స్వయంగా ఆ పాట పాడింది. డెబ్బై వేలకు పైగా వ్యూస్‌తో ఈ వీడియో దూసుకుపోతోంది.

అట్లీ డైరెక్షన్‌లో వచ్చిన 'బిగిల్' సినిమాలో విజయ్ మహిళా ఫుట్‌బాల్ జట్టుకు కోచ్‌గా నటించాడు. మహిళా క్రీడాకారులలో స్ఫూర్తి, ధైర్యం నింపి విజయం వైపు తీసుకువెళ్లే క్రమంలో వినిపించే పాట సివంగివే. ఈ పాట (తెలుగు)లో నుంచి కొన్ని లైన్లు...

'అడుగులే జలిపించు/ పిడుగులై ఒళ్లు విరుచుకో/ విను వీధి దారిన మెరుపులా/ భూమిని బంతాడు

సివంగివే సివంగివే/ తలవంచె మగజాతి నీకే/ నీ త్యాగమే గుర్తించగా/సాహో అంటూ మోకరిల్లదా లోకమే



● కవితా సెల్వరాజ్

ఆటో ప్రయాణంలో అడుగడుగునా ఆనందమే



ఇంగ్లాండ్‌కు చెందిన లియామ్, జావిస్ దంపతులకు మన దేశం అంటే చాలా ఇష్టం. 'దోజ్ హ్యాపీ డేస్' పేరుతో యూట్యూబ్ చానల్ నడుపుతున్న ఈ దంపతులు మన దేశానికి వచ్చారు. వారి స్థాయికి ఏ ఫైవ్ స్టార్ హోటల్‌లోనో ఉండవచ్చు. ఖరీదైన కారులో ప్రయాణించవచ్చు. అలా కాకుండా ఈ డైనమిక్ ద్వయం ఒక ఆటోరిక్షాలో అమృత్‌సర్ నుంచి తమిళనాడు వరకు ఎన్నో ప్రాంతాలు పర్యటించింది.

ఆటోకు 'పీట్' అని పేరు పెట్టి అందంగా అలంకరించారు. ఆటోడ్రైవింగ్ నేర్చుకున్నారు. చెన్నైలోని ట్రాఫిక్ ప్రాంతాల్లో డ్రైవింగ్ ప్రాక్టీస్ చేశారు. 'ఫరవాలేదు. ఇక మనం ముందుకు వెళ్లవచ్చు' అని నమ్మకం వచ్చిన తరువాతే ప్రయాణం ప్రారంభించారు.

తమ ఆటో ప్రయాణంలో చెప్పలేనంత సందడి ఉన్న సంతలను, ధ్యానముద్రతో ఉన్న ప్రశాంత దేవాలయాలను, విభిన్న విశ్వాసాలు, ఆచారాల సామరస్య దృశ్యాలను, బాటసారులను, చెట్టుచేమను చూస్తూ ఎంజాయ్ చేశారు. నోరూరించే వంటకాలను ఆస్వాదించారు.

బ్యూటిఫుల్ లవ్లీ ఫ్యామిలీ





పెళ్లి వేడుకలో వధూవరుల తల్లిదండ్రులు క్షణం తీరిక లేకుండా ఉంటారు. పెళ్లికి వచ్చిన అతిథులను పలకరించడం, పెళ్లి పనులు చూసుకోవడంతోనే సరిపోతుంది. 'టైమే బంగారమాయెనే' అనుకునే సమయం లోనూ ఒక పెళ్లిలో వధువు తల్లిదండ్రులు చేసిన డ్యాన్స్ వీడియో వీర లెవెల్లో వైరల్ అయింది. స్టైలిష్ బ్లాక్ అండ్ గోల్డెన్ చీరలో వధువు తల్లి, స్మార్ట్ త్రీ పీస్ సూట్‌లో తండ్రి వేదికపై వివిధ హావభావాలతో చేసిన డ్యాన్స్ 'వావ్' అనిపించింది. స్టేజీ బ్యాక్‌గ్రౌండ్‌లో బాల్యం నుంచి కాలేజీ స్టూడెంట్ వరకు వధువుకు సంబంధించిన రకరకాల విజువల్స్ కనిపిస్తూ కనువిందు చేస్తుంటాయి. 'బ్యూటీఫుల్... లవ్లీ ఫ్యామిలీ' లాంటి కామెంట్స్ ఎన్నో యూజర్‌ల నుంచి వెల్లువెత్తాయి.

రెండు బస్సు కథలు



బస్సు లోపల

ఒక ఆర్టిస్ట్ బస్ ఎక్కాడు.
కండక్టర్ దగ్గర టికెట్ తీసుకున్నాడు.
దాని వెనుక కండక్టర్ బొమ్మ గీశాడు.
కండక్టర్ రియాక్షన్?
ఓహో.. వైరల్



బస్సు బయట

ప్రతి ఉదయం ఆ పెద్దమనిషి
ముంబై రోడ్డు డివైడర్ దగ్గర నిలబడతాడు.
తెల్లవారు షిఫ్ట్‌కి డ్యూటీ ఎక్కిన
డ్రైవర్లకు బిస్కెట్ ప్యాకెట్లు పంచుతాడు.
ఆ పెద్దాయన కారుణ్యం? వైరలే కదా.





మనుషులు సాటి మనుషుల పట్ల చూపించే చిన్న చిన్న వాత్సల్యాలే మానవాళిని ముందుకు నడిపిస్తున్నాయి.

సాటిమనిషి ముఖంలో చిరునవ్వు కనిపించేలా చేస్తే ఎంత బాగుంటుంది. బొమ్మలు గీసే ఆషిక్‌ను అడగాలి. కేరళలోని మళప్పురంలో నివసించే ఆషిక్ ఫైన్ ఆర్ట్స్ చదివాడు. చూసిన మనిషి ముఖాన్ని క్షణాల్లో అచ్చుగుద్దినట్లు పెన్సిల్‌తో గీయడంలో దిట్ట. తన ఆర్ట్‌ను కష్టజీవులను సంతోషపెట్టడానికి అతడు వాడుతుంటాడు. నిత్యజీవితంలో తారసపడే పండ్లమ్ముకునేవాళ్లను, పంక్చర్లు వేసేవాళ్లను, కూలీలను, సేల్స్ బోయ్స్‌ను దూరం నుంచి చూసి వారికి తెలియకుండా వారి బొమ్మ గీస్తాడు. ఆ తర్వాత వారికి తీసుకెళ్లి ఇస్తాడు. తమ పనుల్లో మునిగివున్న ఆ కష్టజీవులు హటాత్తుగా తమ బొమ్మను చూసుకుని తెలియని ఆనందంతో నవ్వుతారు. ఆ నవ్వును కెమెరాలో బంధించి ఇన్‌స్టాలో పెడుతుంటాడు ఆషిక్. ఇటీవల ఒక బస్ కండక్టర్ బొమ్మను అతనిచ్చిన టికెట్ వెనుకే గీసిస్తే అతడు సంతోషంతో తబ్బిబ్బు అయ్యాడు. డబ్బున్నవాళ్ల బొమ్మలు అందరూ గీస్తారు... కాని తమ బొమ్మ కూడా గీసే వారుంటారా... అని ఆనందంతో మురిసిపోవడం ఆషిక్ వీడియోల్లో చూస్తాం. అందుకే అవి వైరల్ అవుతుంటాయి.

ఇక రెండో వైరల్ ఏమిటంటే ముంబైలో ఒక చౌరస్తా దగ్గర నిలుచున్న ఒక పెద్దమనిషి ఉదయాన్నే ఆరు నుంచి ఎనిమిదిన్నర మధ్య సిటీ సర్వీస్‌లను నడిపే బస్‌డ్రైవర్లకు బిస్కెట్ ప్యాకెట్లు పంచుతుంటాడు. తెల్లవారి షిఫ్ట్ ఎక్కేవారు ఏం తింటారో తినరో. ఈ బిస్కెట్స్ వారికి ఉపయోగపడతాయి. తాను చేసేది గొప్పలు చెప్పుకోని ఆ పెద్దమనిషి నిశ్శబ్దంగా బిస్కెట్లు పంచి ఇంటిముఖం పడతాడు. అతని వీడియోను ఒకామె ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే ఈ మాత్రం కరుణ ప్రతి ఒక్కరిలో ఉంటే ఎంత బాగుండు అని అందరూ సంతోషించారు.

మనుషులు మంచివాళ్లు. కాకపోతే తాము మంచివాళ్లమని అరుదుగా వారికి గుర్తుకొస్తుంటుంది. ఈ మాత్రం మంచిని అందరం చేయగలం. చేస్తే ఎంత బాగుండు.

హెల్త్



దేహ నిర్మాణంలోనూ, దారుఢ్యంలోనూ ఎముకలది కీలక పాత్ర. ఎముకలు బలంగా ఉంటేనే మనిషి బలంగా ఉంటాడు. ఆరోగ్యంగానూ ఉంటాడు. చిన్న వయసులో ఎముకలు చాలా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. వయసు పెరుగుతున్నకొద్దీ ఎముకల్లోకి క్యాల్షియమ్, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు నిండుతూ పోతుంటాయి. ఫలితంగా ముప్ఫయిల వయసు నాటికి ఎముకల సాంద్రత గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. అయితే ఆ గరిష్ఠ స్థాయికి చేరాక మళ్లీ ఎముక సాంద్రత క్రమంగా తగ్గుతూ పోతుంది. ఇలా తగ్గడాన్ని 'ప్రోగ్రెసివ్ బోన్ లాస్' అంటారు. మెల్లగా తగ్గుతూపోతుంటే చాలాకాలం బలంగా ఉంటుంది. లేదంటే బలహీనపడుతుంది. ఈ 'ప్రోగ్రెసివ్ బోన్ లాస్' కథా కమామిషు చూద్దాం.

'ప్రోగ్రెసివ్ బోన్ లాస్' ఎందుకు నివారించాలంటే...?

మనం తీసుకునే ఆహారంలోని క్యాల్షియమ్, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు సిమెంటు అనుకుంటే... సూర్యరశ్మి నుంచి దొరికే విటమిన్ 'డి' ఈ కాంక్రీటును కలిపే నీరుగా భావిస్తే... ఇదంతా ఎముకలో బలంగా కూరేలా చేసేది మనం చేసే వ్యాయామం. ఈ మూడు గరిష్ఠంగా కలగలిసి ఎంత బలంగా కూరినట్లు అయితే ఎముక అంత బలంగా మారుతుంది. అలా రూపొందే ఎముక సాంద్రత మీద ఎముక బలం ఆధారపడి ఉండటంతో... ఎముక ఆరోగ్యానికి 'బోన్ మినరల్ డెన్సిటీ' అన్నది ఓ సూచికగా ఉంటుంది. 18 ఏళ్ల వయసు నుంచి ఈ బోన్ మినరల్ డెన్సిటీ పెరుగుతూ పెరుగుతూ 30వ ఏటికి వచ్చేసరికి దాదాపుగా గరిష్టంగా కొంత కాలం పాటు ఉండి, మళ్లీ అప్పటి నుంచి క్రమంగా తగ్గుతుంటుంది.

ప్రోగ్రెసివ్ బోన్ లాస్ మహిళల్లో మరింత ఎక్కువ. ఎముకలు తమ సాంద్రత కోల్పోయే కండిషన్ పురుషుల కంటే మహిళల్లో చాలా వేగంగా జరుగుతుంది. సాధారణంగా వాళ్లలో వ్యాయామం చేసే పరిస్థితి చాలా తక్కువగా ఉండటం, అదీగాక 45 ఏళ్లు దాటాక రుతుస్రావం ఆగిపోవడం, దాంతో మెనోపాజ్ తర్వాత ఎముక సాంద్రత కోల్పోయే వేగం బాగా పెరుగుతుంది. ఈ కారణంగానే మెనోపాజ్ తర్వాత మహిళల్లో ఆస్టియోపోరోసిస్ రిస్క్ ఎక్కువ.

ఎముక సాంద్రత తగ్గడానికి కారణాలు...

మన ప్రమేయం లేనివి...

● కొందరికి జన్యుపరంగానే ఎముక సాంద్రత ఎక్కువగా ఉంటుంది. వారిలో వంశపారంపర్యంగానే చాలా పెద్దవయసు వచ్చేవరకు ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇది పుట్టుకతో వచ్చే మార్చలేని అంశం. ● కొందరిలో కుషింగ్ సిండ్రోమ్, హైపోగొనాడిజమ్, థైరోటాక్సికోసిస్, అనొరెక్సియా నర్వోజా (తిండిపై ఆసక్తిలేకపోవడంతో ఆహారానికి దూరంగా ఉండటం), మాల్ అబ్జార్‌ప్షన్ సిండ్రోమ్, దీర్ఘకాలిక కాలేయ వ్యాధులు, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధులు, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల వల్ల కూడా ఎముక సాంద్రత తగ్గి, ఆ తర్వాత ఇది సెకండరీ ఆస్టియోపోరోసిస్‌కు దారితీస్తుంది. ● కొందరు తరచూ కొన్ని ఆరోగ్య సమస్యల బారిన పడుతుండటం, అవి తగ్గడం కోసం గ్లూకోకార్టికాయిడ్స్, యాంటీ ఎపిలెప్టిక్ వంటి మందులు వాడుతుండటం... ఎముక సాంద్రతను తగ్గిస్తాయి.



డాక్టర్ సుధీర్‌రెడ్డి,
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్



జెండర్ కారణాలు.. మహిళల విషయంలో... అందునా వాళ్లలో మెనోపాజ్ తర్వాత ఎముకల సాంద్రత కోల్పోవడం ఎక్కువ. ఎత్తు తక్కువగా ఉన్న మహిళల్లో రిస్క్ ప్రోగ్రెసివ్ బోన్‌లాస్ ముప్పు మరింత ఎక్కువ. (అంటే... బరువు అరవై కిలోల లోపు ఉండి, 155 సెం.మీ. కంటే తక్కువ ఎత్తున్న మహిళల్లో ఎముక సాంద్రత తగ్గడం చాలా త్వరగా, వేగంగా జరుగుతుంటుంది).

మన చేతుల్లో/ నియంత్రణలో ఉండే అంశాల విషయానికి వస్తే...

మన నియంత్రణలో ఉండే కొన్ని అంశాలు పాటించడం ద్వారా ప్రోగ్రెసివ్ బోన్ లాస్‌ను నివారించవచ్చు. అదెలాగంటే... ● క్యాల్షియమ్, ఫాస్ఫరస్ వంటి మినరల్స్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, పాలు, నట్స్ వంటి ఆహారాలు తీసుకుంటూ ఉండటం. ● దేహానికి విటమిన్-డి సమకూరేలా లేత ఎండలో వ్యాహ్యాళిగా తగినంత వ్యవధి పాటు తిరగడం. (నేరుగా పడే, తీవ్రమైన ఎండలో తిరగకూడదు). ● రోజుకు 30 - 45 నిమిషాల పాటు వారంలో కనీసం ఐదు రోజులు వ్యాయామం చేయడం. ● మన జీవనశైలి మార్చుకోవడం అంటే కాఫీ వంటివి పరిమితంగా తీసుకోవడం. ● పొగతాగడం, మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉండటం. ● కంటినిండా తగినంతగా నిద్రపోవడం. ఒకవేళ కౌమార, యౌవన దశల్లో వ్యాయామానికి దూరంగా ఉండటం, మద్యం, పొగతాగడం వంటి అలవాట్లకు లోనైతే ఎముక సాంద్రత తగ్గిపోవడంలో వేగం పెరుగుతుంది. ఎముకలు త్వరగా గుల్లబారిపోయి, ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు త్వరగా వచ్చేందుకు అవకాశం పెరుగుతుంది.

ఎముక సాంద్రత తెలిసేదెలా..?

'డ్యుయల్ ఎనర్జీ ఎక్స్-రే అబ్జార్షియోమెట్రీ' అనే ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ పరీక్షే ఎముక సాంద్రత తెలుసుకోవడానికీ ఉపయోగపడుతుంది. బాధితుల వయసు ఆధారంగా ఎముక సాంద్రతను లెక్కగడతారు. దీన్ని 'టీ' స్కోర్‌గా చెబుతారు. దాంతో పాటు సీరమ్ లెవల్స్ ఆఫ్ క్యాల్షియమ్, ఫాస్ఫరస్, ఆల్కలైన్ ఫాస్ఫేట్స్, ఇన్‌టాక్ట్ పారాథైరాయిడ్ హార్మోన్ (పీటీహెచ్) వంటి పరీక్షలూ అవసరం పడవచ్చు.

ఎముక సాంద్రత పెంచుకోవడం కోసం...

ప్రోగ్రెసివ్ బోన్‌లాస్ నివారణకు మన చేతిలో ఉన్న అంశాల విషయంలో జాగ్రత్తే... ఎముక సాంద్రత పెంచుకోడానికి దోహదపడుతుంది.
● యుక్తవయసు పిల్లల్ని ఆరుబయట ఎండలో ఆడేలా ప్రోత్సహించడం.
● పెరిగే వయసు నుంచే క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే ఆహారాలైన పాలు, పెరుగు, ముదురు ఆకుపచ్చరంగులో ఉండే ఆకుకూరలతోపాటు బ్రాకలీ వంటివి ఎక్కువగా తీసుకునేలా చూడటం. ● చిన్న వయసు నుంచి లేత ఎండలో ఎక్కువసేపు ఆడేలా ప్రోత్సహించాలి. దీనివల్ల దేహంలో విటమిన్ 'డి' ఎక్కువగా తయారవుతుంది. అది ఆహారాన్ని ఎముకల్లోకి ఇంకిపోయేలా చేయడంతో సాంద్రత పెరుగుతుంది. ఫలితంగా ఎంత చిన్న వయసు నుంచి ఈ అలవాట్లు నేర్పితే... అంత సుదీర్ఘకాలం సాంద్రత నిలిచి ఉండి, ప్రోగ్రెసివ్ బోన్ లాస్ తగ్గుతుంది. దాంతో వృద్ధాప్యంలో పడిపోవడం (ఫాల్), ఇతర ఎముకలతో పాటు ప్రధానంగా తుంటి ఎముకల వంటివి విరగడాన్ని నివారించవచ్చు.

● డిస్‌ఫేజియా

గుటక వేయడం కష్టమవుతోందా?

నోట్లో ఉన్న ఆహారాన్ని నమిలాక మింగివేసే ప్రక్రియ చాలా సులువుగా జరుగుతున్నట్లు అనిపిస్తుందిగానీ, నిజానికి ఇదొక సంక్లిష్ట ప్రక్రియ. ఇందులో నోరు, జీర్ణవ్యవస్థ తాలూకు కండరాలూ, నరాలు ఇవన్నీ పాలు పంచుకుంటాయి. కొన్నిసార్లు కొన్ని అంతరాయాలూ, అవాంతరాలతో గుటక వేసే ఈ ప్రక్రియ కష్టమవుతుంది. ఇలా మింగడం కష్టమయ్యే కండిషన్‌ను 'డిస్‌ఫేజియా' అంటారు. ఇలా ఎందుకు జరుగుతుంది, దానికి పరిష్కారాలేమిటి అనే అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.



గుటక వేసే ప్రక్రియ ప్రధానంగా మూడు దశల్లో జరుగుతుంది. అవి...

1) ఓరల్ ఫేజ్, 2) ఫ్యారింజియల్ ఫేజ్ 3) ఈసోఫేజియల్ ఫేజ్

● ఓరల్ ఫేజ్‌లో నోట్లో ఆహారాన్ని నమలడం లేదా చప్పరించడం జరుగుతుంది. అలా ఆహారాన్ని గొంతులోకి పంపడానికి సిద్ధం చేసే దశ వరకు ఓరల్ ఫేజ్ అంటారు. ఇందులో నోరు, నాలుక, పెదవులు, దంతాలు పాలుపంచుకుంటాయి. ● ఇక ఫ్యారింజియల్ ఫేజ్ అంటే... తిన్నది కాస్తా గొంతు దగ్గర్నుంచి ఆహార నాళంలోకి చేరే దశగా చెప్పవచ్చు. ఈ సమయంలో ఎపిగ్లాటిస్ పొర విండ్ పైప్‌ను మూసుకుపోవడం వల్ల ఆహారం శ్వాసనాళంలోకి వెళ్లకుండా ఆహారనాళంలోకే వెళ్తుంది. ● ఈసోఫేజియల్ ఫేజ్ దశలో ఆహారం ఈసోఫేగస్ అనే పైప్ ద్వారా ఆహారనాళంలోకి చేరుతుంది. అక్కడి నుంచి కడుపులోకి వెళ్తుంది.

ఈ మొత్తం ప్రక్రియలో మింగడం అనేది చాలా సులువుగా మన ప్రమేయం లేనట్టుగా జరిగినట్లు అనిపించినా, నిజానికి మింగడం అన్నది మన సంకల్పంతోనే జరుగుతుంది.

గుటక వేయడంలో సమస్యలూ... కారణాలు

● గుటక వేసే దశలైన ఓరల్, ఫ్యారింజియల్, ఈసోఫేజియల్ దశల్లో ఎక్కడ ఏ అవాంతరం వచ్చినా మింగడంలో సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్యను వైద్యపరిభాషలో 'డిస్‌ఫేజియా' అంటారు. ● ఒక్కోసారి జీర్ణ వ్యవస్థను నియంత్రించే నరాల సమస్య వల్ల కూడా గుటక వేయడం సాధ్యం కాకపోవచ్చు.

గుటక వేయలేకపోడానికి మరికొన్ని కారణాలు...

● మరీ చిన్న పిల్లల్లో... తల్లిపాలు తాగడంలో ఇబ్బందులు, మరికాస్త పెద్ద పిల్లలు ఆహారం తీసుకునే సమయంలో శరీరాన్ని బిగబట్టడం; నమలలేకపోవడం, తినడానికి ఎక్కువ సమయం తీసుకోవడం.● తినే సమయంలో దగ్గు రావడం లేదా పొలమారడం ● తరచూ వాంతులు చేసుకోవడం ● నోటి నుంచి ముక్కు నుంచి చొల్లు కారడం ● గాలి తీసుకోవడానికీ, తినడానికి మధ్య సరైన సమన్వయం లేకపోవడం ● తరచూ నెమ్ము లేదా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడటం ● గొంతు గరుకుగా మారడం లేదా గొంతులోంచి గాలి రావడం

ఇక పెద్దవయసువారిలో...

తల, మెడ, ఆహార వ్యవస్థ, శ్వాసకోశవ్యవస్థలో కండరాలూ, వాటిని నియంత్రించే నరాల సమస్యతో మింగడం కష్టం కావచ్చు. ఇందుకు దారితీసే పరిస్థితుల్లో కొన్ని...

● గొంతు లేదా తల భాగంలో దెబ్బ తగలడం ● మెదడువాపు, పక్షవాతం వంటి జబ్బులు ● వెన్నుపూసకు గాయం కావడం. ● అల్జైమర్స్ మతిమరపుతో గుటకవేయలేకపోవడం. ● మల్టిపుల్ స్క్లిరోసిస్, పార్కిన్సన్స్ డిసీజ్, వయసు పైబడటంతో వచ్చే సమస్యలు ● గొంతు లేదా తలకు సంబంధించిన క్యాన్సర్‌తో మింగలేకపోవడం ● కొన్ని రకాల అనారోగ్యాలకు శస్త్రచికిత్స చేయడం వల్ల మింగలేకపోవడం

కారణమేదైనప్పటికీ గుటక వేయలేని పరిస్థితితో పాటు నోటి నుంచి అదేపనిగా చొల్లు కారడం, తినేటప్పుడు విపరీతంగా దగ్గు రావడం, గొంతు మారడం వంటి లక్షణాలు కనిపిస్తే తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

అవసరమైన పరీక్షలు...

● బాధితుల లక్షణాలను బట్టి... చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన పరీక్షలు; నోటి పరీక్షలు, స్వరపేటికకు సంబంధించిన పరీక్షలు; నరాలకు సంబంధించిన లోపాలను తెలుసుకోడానికి సీటీ స్కాన్, ఎమ్మారై బ్రెయిన్, ఎమ్మారై హెడ్ అండ్ నెక్ వంటి పరీక్షలు అవసరం. వీటితో పాటు మాడిఫైడ్ బేరియమ్ స్వాలో టెస్ట్; వీడియో ఫ్లోరోస్కోపీ, ఫైబర్ ఆప్టిక్ ఎండోస్కోపిక్ ఎవాల్యుయేషన్ ఆఫ్ స్వాలోయింగ్ (ఫీస్) / ట్యూబ్ ఇవాల్యుయేషన్ వంటివి అవసరాన్ని బట్టి చేయించాల్సి రావచ్చు.

చికిత్స...

సమస్య ఏ కారణంతో వచ్చిందనే అంశంపై చికిత్స ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు పక్షవాతం లేదా యాక్సిడెంట్ వంటి కేసుల్లో సర్జరీతో పరిస్థితిని చక్కదిద్దాల్సి రావచ్చు. (ఇలాంటి పరిస్థితుల్లో బాధితులు ఆహారం గుటకవేయలేని పరిస్థితి ఉంటే రైల్స్ ట్యూబ్ ద్వారా బాధితులకు ఆహారాన్ని అందిస్తారు). ● ఈసోఫేజియల్ దశలో వచ్చే సమస్యలకు ఈసోఫేజియల్ డయలేషన్, స్టెంట్ ప్లేస్‌మెంట్ చికిత్సలు చేయాల్సి రావచ్చు. ● ఓరల్, ఫ్యారింజియల్ దశల్లో వచ్చే సమస్యలను స్వాలోయింగ్ థెరపీ వంటి చికిత్స అవసరం పడవచ్చు. ● క్యాన్సర్, గ్యాస్ట్రిక్ సమస్యల్లో దాని తీవ్రతను బట్టి శస్త్రచికిత్స, మందులతో చికిత్స వంటి రకరకాల చికిత్స ప్రక్రియలు అవసరం కావచ్చు.



డాక్టర్ ఈ.సీ. వినయకుమార్,
సీనియర్ ఈఎన్‌టీ సర్జన్

మెడి టిప్

డిస్‌బయోసిస్‌ను నివారించేందుకు...



మన జీర్ణవ్యవస్థలోని ఆహారనాళంలో ప్రతి చదరపు మిల్లీమీటరులోనూ కోటానుకోట్ల మంచి బ్యాక్టీరియా ఉంటుంది. జీవక్రియలకు తోడ్పడటంతో పాటు వ్యాధి నిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి అవసరం. దీనిలో ఏదైనా తేడాలు రావడాన్ని 'డిస్‌బయోసిస్' అంటారు. ఇది మూడు విధాలుగా రావచ్చు. మొదటిది మేలు చేసే బ్యాక్టీరియా బాగా తగ్గిపోవడం, రెండోది హాని చేసే బ్యాక్టీరియా సంఖ్య ప్రమాదకరంగా పెరగడం, జీర్ణవ్యవస్థలోని బ్యాక్టీరియా వైవిధ్యం దెబ్బతినడం. ఇలా జరిగినప్పుడు డాక్టర్లు ప్రో-బయాటిక్స్ సూచిస్తారు. ఇవి కొంత ఖర్చుతో కూడిన వ్యవహారం. కానీ తాజా పెరుగు, మజ్జిగ, పులవడానికి వీలుగా ఉండే పిండితో చేసే ఇడ్లీలు, దోసెల వంటి ఆహారంతోనే 'డిస్ బయోసిస్' తేలిగ్గా పరిష్కారమవుతుంది. అప్పటికీ తగ్గకపోతేనే 'ప్రో-బయాటిక్స్' వాడాల్సి వస్తుంది. కాబట్టి 'డిస్ బయోసిస్' నివారణ కోసం ముందునుంచే పెరుగు, మజ్జిగ వంటివి వాడటం ఆరోగ్యానికే కాదు... వ్యాధి నిరోధక వ్యవస్థను పటిష్టం చేసుకునేందుకు ఎంతగానో ఉపకరిస్తుంది.

సాక్షి
ఆదివారం
17-3-2024

స్పోర్ట్స్



తెలంగాణ, ఆంధ్ర జట్లు చిత్తు

జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు భారీ పరాజయం ఎదురైంది. పూల్ 'ఎ'లో జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ 11–0 గోల్స్ తేడాతో తెలంగాణపై ఘన విజయం సాధించింది. బెంగాల్ ప్లేయర్ సంజన 'హ్యాట్రిక్' సహా ఐదు గోల్స్ సాధించడం విశేషం. ఈ మ్యాచ్‌లో సుష్మిత పన్నా కూడా 'హ్యాట్రిక్' సాధించగా... మోనికా నాగ్ 2, అంజన డుంగ్‌డుంగ్ ఒక గోల్ చేశారు. ఈ గెలుపుతో బెంగాల్ జాతీయ చాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మరో వైపు పూల్ 'సి'లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 11–2 గోల్స్‌తో ఆంధ్రప్రదేశ్‌పై గెలుపొందింది. భారత సీనియర్ జట్టు ప్లేయర్ వందనా కటారియా 'హ్యాట్రిక్' సాధించగా... ముంతాజ్ ఖాన్, ఉపాసన సింగ్ చెరో 2 గోల్స్ కొట్టారు. యూపీ తరఫున శశికళ, రీతూ సింగ్, స్వర్ణిక రావత్, సిమ్రన్ సింగ్ ఒక్కో గోల్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్లలో కళ్యాణి స్వర్ణపూడి, గార్లంక వరహాలమ్మ ఒక్కో గోల్ కొట్టారు. అయితే ఈ విజయం తర్వాత కూడా గ్రూప్‌లో రెండో స్థానంలో నిలవడంతో యూపీ నాకౌట్ దశకు అర్హత సాధించలేకపోయింది.

సెమీస్‌లో లక్ష్యసేన్ ఓటమి



బర్మింగ్‌హమ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఈ సారీ పతకం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. పురుషుల ఈవెంట్‌లో ఏకైక ఆశాకిరణం లక్ష్యసేన్‌కు సెమీస్‌లో చుక్కెదురైంది. దీంతో ప్రతిష్టాత్మక టోర్నీలో భారత పోరాటం ముగిసింది. 2022 టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచిన 22 ఏళ్ల లక్ష్యసేన్‌పై ఈ సారి భారత బృందం గంపెడాశలు పెట్టుకుంది. అయితే శనివారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌తో ఆ ఆశలన్నీ ఆవిరయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో జరిగిన సెమీస్‌లో భారత ఆటగాడు 12–21, 21–10, 15–21తో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడాడు. ఒక గంటా 8 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో ప్రత్యర్థి జోరుకు ఎదురు నిలువలేకపోయిన లక్ష్యసేన్ రెండో గేమ్‌లో పుంజుకోవడంతో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ క్రిస్టీకి కష్టాలు తప్పలేదు. ఈ గేమ్‌ను కైవసం చేసుకున్న భారత షట్లర్ నిర్ణాయక మూడో గేమ్‌లో ఆ పట్టుదల కొనసాగించడంలో విఫలమయ్యాడు. ఫలితం నిరాశపరిచినప్పటికీ వరుసగా ఫ్రెంచ్ ఓపెన్, ఆల్ ఇంగ్లండ్ టోర్నమెంట్లలో సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించడం ద్వారా లక్ష్యసేన్ బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్ ద్వారా ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాల్ని మెరుగుపర్చుకున్నాడు.

'పారిస్' మార్క్‌ను దాటిన రాంబాబు



న్యూఢిల్లీ: భారత రేస్ వాకర్ రాంబాబు పారిస్ 20 కిలో మీటర్ల రేసులో పారిస్ ఒలింపిక్స్ అర్హత టైమింగ్‌ను అందుకున్నాడు. స్లొవేకియాలో జరుగుతున్న టూర్ గోల్డ్ లెవల్ ఈవెంట్‌లో రాంబాబు మూడో స్థానంలో నిలిచాడు. ఈ ఈవెంట్‌ను 1 గంటా 20 నిమిషాల్లో రాంబాబు పూర్తి చేశాడు. పెరూ, ఈక్వెడార్ అథ్లెట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. పారిస్ క్వాలిఫయింగ్ టైమింగ్ 1 గంటా 20 నిమిషాల 10 సెకన్లుగా ఉంది. అయితే ఈ ప్రదర్శనతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాంబాబు నేరుగా ఒలింపిక్స్‌లో ఆడే అవకాశం లేదు. అతనికంటే ముందే ఆరుగురు భారత రేస్ వాకర్లు అర్హత టైమింగ్‌ను సాధించారు. ఒలింపిక్స్ నిబంధనల ప్రకారం దేశంనుంచి గరిష్ఠంగా ముగ్గురికే పాల్గొనే అవకాశం ఉంది.

కొత్త విజేత ఎవరో!

నేడు డబ్ల్యూపీఎల్ ఫైనల్
- ఢిల్లీతో బెంగళూరు టైటిల్ పోరు నేడు
- జోరు మీదున్న మంధాన సేన
- సమరోత్సాహంతో క్యాపిటల్స్



విజేత ట్రోఫీతో కెప్టెన్లు మెగ్ లానింగ్, స్మృతి మంధాన

న్యూఢిల్లీ: ఇంకొన్ని రోజుల్లో ఐపీఎల్... ఈ రోజేమో డబ్ల్యూపీఎల్ ఫైనల్... ముందున్న క్రికెట్ పండగకు నేడు జరిగే టైటిల్ పోరు ఏమాత్రం తీసిపోదు. ఎందుకంటే ఈ సీజన్‌లో అతివల మ్యాచ్‌లు ఆషామాషీగా సాగలేదు. కాబట్టి ఫైనల్ కూడా హోరాహోరీ ఖాయం. పైగా గత రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సారీ అలా వెళ్లడానికి సిద్ధంగా లేదు. అలాగని వరుస విజయాలతో డిఫెండింగ్ చాంపియన్‌ను చిత్తు చేసిన బెంగళూరును తక్కువ అంచనా వేయలేం. ఏదేమైనా మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) క్లైమాక్స్‌లో కొత్త విజేత కోసం గట్టి పోరు తప్పదు! ఈ సీజన్‌లో కొన్ని ఉత్కంఠభరిత మ్యాచ్‌లైతే రెగ్యులర్ ఐపీఎల్ (పురుషుల టోర్నీ)ను తలపించేలా భారత క్రికెట్ ప్రేక్షకుల్ని ఊర్రూతలూగించాయి. ఈ నేపథ్యంలో మెరుపులు మెరిపించేందుకు ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సై అంటే సై అంటున్నాయి.

ఉత్సాహంతో బెంగళూరు

డిఫెండింగ్ చాంపియన్ ముంబైని వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడించిన బెంగళూరు ఈ ఒక్క మ్యాచ్‌లో ఫైనలిస్టును ఓడిస్తే ఎంచక్కా టైటిల్ ఎగరేసుకుపోతుంది. కానీ టాపార్డర్ వైఫల్యం జట్టును కలవరపెడుతోంది. గత రెండు మ్యాచ్‌ల్లోనూ జట్టును గట్టెక్కించింది ఎలీస్ పెరీనే! బ్యాట్‌తో, బంతితో రాణిస్తున్న ఆమెకు కెప్టెన్ స్మృతి మంధాన, సోఫీ మోలినెక్స్, సోఫీ డివైన్‌ల నుంచి సహకారం లభిస్తే బెంగళూరు భారీ స్కోరు సాధిస్తుంది. లేదంటే బౌలర్లపైనే భారం పడుతుంది. ప్రధాన బౌలర్ రేణుకా సింగ్ ఈ మ్యాచ్‌లో సత్తా చాటాల్సిన అవసరముంది. శ్రేయాంక, ఆశ శోభన, పెరీ, మోలినెక్స్‌లు ఆశించిన మేర రాణిస్తుండటం జట్టుకు కలిసొచ్చే అంశం.

ఈ సారి ట్రోఫీ లక్ష్యంగా...

గతేడాది ముంబై జోరుతో రన్నరప్‌గా సరిపెట్టుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సారి ట్రోఫీనే లక్ష్యంగా ఈ టోర్నీలో ఆరంభం నుంచి శ్రమించింది. పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంతో నేరుగా ఫైనల్‌కు దూసుకొచ్చిన మెగ్ లానింగ్ సేన ఈ సారి భారీ స్కోర్లతో తమ బ్యాటింగ్ ప్రతాపాన్ని చూపించింది. తాజా ఫైనల్ ప్రత్యర్థి బెంగళూరుతో తలపడిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారీ స్కోర్లు చేసే గెలిచింది. లానింగ్, షఫాలీ, జెమీమా, క్యాప్సీ అంతా సూపర్‌ఫామ్‌లో ఉండటం వారి బ్యాటింగ్ లైనప్‌ను దుర్భేద్యంగా మార్చింది. బౌలింగ్‌లో మరిజన్, శిఖా పాండే, జెస్ జొనాసెన్‌లు ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నారు.

పిచ్–వాతావరణం

అరుణ్ జైట్లీ స్టేడియంలో గత మూడు మ్యాచ్‌లనూ బౌలర్లే శాసించారు. బౌలర్లకు కలిసొచ్చే వికెట్‌పై మెరుపుల కోసం బ్యాటర్లు శక్తికి మించి శ్రమించాలి. వేసవి మొదలవుతున్న వేళ వర్ష సూచనైతే లేదు.

తుది జట్లు (అంచనా)

ఢిల్లీ క్యాపిటల్స్: మెగ్ లానింగ్ (కెప్టెన్), షఫాలీ వర్మ, అలైస్ క్యాప్సీ, జెమీమా రోడ్రిగ్స్, మరిజన్ కప్, జెస్ జొనాసెన్, అరుంధతి, రాధా యాదవ్, మిన్నుమణి, తానియా, శిఖాపాండే.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: స్మృతి మంధాన (కెప్టెన్), సోఫీ డివైన్, ఎలీస్ పెరీ, దిశా కాసత్, రిచా ఘోష్, సోఫీ మోలినెక్స్, వేర్‌హమ్, శ్రేయాంక, ఆశ శోభన, శ్రద్ధ, రేణుకా సింగ్.

రా.గం.7.30 నుంచి 'స్పోర్ట్స్–18'లో ప్రత్యక్ష ప్రసారం

'ధోనికి రుణపడి ఉంటా'

అశ్విన్ భావోద్వేగం



చెన్నై: దాదాపు 13 ఏళ్ల క్రితం తనకంటూ ఎలాంటి గుర్తింపు లేని రోజుల్లో అండగా నిలిచి అవకాశాలు కల్పించిన మహేంద్ర సింగ్ ధోనికి తాను జీవితకాలం రుణపడి ఉంటానని భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. 100 టెస్టులు పూర్తి చేసుకోవడంతో పాటు 500 వికెట్ల మైలురాయిని దాటిన అశ్విన్‌ను శనివారం తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ) ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా తన కెరీర్‌ను మలుపు తిప్పిన 2011 ఐపీఎల్ ఫైనల్‌ను అశ్విన్ గుర్తు చేసుకున్నాడు. 'కొత్త బంతితో నన్ను క్రిస్ గేల్‌కు బౌలింగ్ చేసే అవకాశాన్ని ధోని కల్పించాడు. నాలుగో బంతికే నేను వికెట్ తీయగలిగా. ఇప్పటికీ చాలా మంది దాని గురించి మాట్లాడుకుంటున్నారంటే అందుకు ధోనినే కారణం. అతనికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటా. సాధారణంగా నేను మాట్లాడేప్పుడు పదాల కోసం ఎప్పుడూ తడబడను. కానీ ఈ రోజు నా పరిస్థితి భిన్నంగా ఉంది. టీఎన్‌సీఏ నాకు ఎంతో గౌరవం కల్పించింది కాబట్టే ఎప్పుడైనా క్లబ్ క్రికెట్ కూడా సిద్ధంగా ఉంటా. నేను రేపు చచ్చిపోయినా నా ఆత్మ ఈ స్టేడియంలోనే తిరుగుతూ ఉంటుంది' అని అశ్విన్ అన్నాడు. ఈ సన్మాన కార్యక్రమంలో అశ్విన్‌కు ప్రత్యేక జ్ఞాపికగా 'సెంగోల్' అందించడం, అతని పేరిట స్టాంప్ విడుదలతో పాటు రూ. 1 కోటి నగదు పురస్కారాన్ని కూడా అందించారు.

విజేత రష్మిక – వైదేహి జోడి



ఇండోర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) వరల్డ్ టూర్ – డబ్ల్యూ35 టోర్నీ డబుల్స్ విభాగంలో భారత జోడి శ్రీవల్లి రష్మిక భమిడిపాటి – వైదేహి చౌదరి విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో రష్మిక – వైదేహి జంట 6–3, 7–5 స్కోరుతో నాలుగో సీడ్ య సువాన్ లీ (చైనీస్ తైపీ) – సొహ్యున్ పార్క్ (కొరియా)ని ఓడించింది. మరో వైపు సింగిల్స్ విభాగంలో కూడా రష్మిక ఫైనల్‌కు చేరుకుంది. సెమీ ఫైనల్లో రష్మిక 6–3, 6–4తో ఏడో సీడ్ పొలినా లాట్‌సెంకో (రష్యా)పై గెలుపొందింది. ఫైనల్లో రెండో సీడ్ దలిలా జకుపొవిక్ (స్లొవేకియా)తో రష్మిక తలపడుతుంది.

పాండ్యాను ఒప్పించే ప్రయత్నం చేయలేదు!



అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ఎంతో అనుభవం ఉన్న హార్దిక్ పాండ్యా జట్టుకు దూరమైన లోటు కనిపిస్తుందని, అయితే అతను వెళ్లకుండా తాము ఒప్పించే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదని గుజరాత్ టైటాన్స్ హెడ్ కోచ్ ఆశిష్ నెహ్రా అన్నాడు. గత రెండు సీజన్లలో టైటాన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన హార్దిక్ ఈ సీజన్‌నుంచి ముంబై ఇండియన్స్ సారథిగా బరిలోకి దిగనున్నాడు. ఏ క్రీడలోనైనా కొన్ని అంశాలను పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోవాల్సిందేనని నెహ్రా అభిప్రాయ పడ్డాడు. 'మా జట్టుతో ఉండిపొమ్మని పాండ్యాను ఒప్పించే ప్రయత్నం నేను ఎప్పుడూ చేయలేదు. మరో ఇతర ఫ్రాంచైజీకి వెళితే అలా చేసేవాడినేమో కానీ గుజరాత్‌కు ముందు 5–6 సీజన్లు ఆడిన ముంబైకి అతను వెళ్లిపోయాడు. అతను అక్కడ మళ్లీ కొత్తగా ఏదైనా నేర్చుకుంటాడేమో. కెప్టెన్‌గా రాటుదేలేందుకు గిల్‌కు ఇది మంచి అవకాశం' అని నెహ్రా వ్యాఖ్యానించాడు.

కృష్ణప్రసాద్ – ప్రతీక్ జోడి పరాజయం

ఒర్లియాన్ (ఫ్రాన్స్): బీడబ్ల్యూఎఫ్ టూర్ –సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ ఒర్లియాన్స్ మాస్టర్స్‌లో భారత్ కథ ముగిసింది. చివరగా బరిలో నిలిచిన పురుషుల డబుల్స్ జోడి గారగ కృష్ణప్రసాద్ – కె.సాయిప్రతీక్ క్వార్టర్ ఫైనల్లో ఓటమిపాలైంది. డెన్మార్క్‌కు చెందిన ఏడో సీడ్ ఆండ్రియాస్ సొండర్‌గార్డ్ – జాస్పర్ టాఫ్ట్ జంట 21–17, 21–16 స్కోరుతో కృష్ణప్రసాద్ – ప్రతీక్‌పై విజయం సాధించింది. సింగిల్స్ విభాగంలో భారత్‌కు చెందిన మాళ్విక బన్సోద్, తాన్యా హేమంత్, సామియా ఫారుఖీ, కిరణ్ జార్జ్, మిథున్ మంజునాథ్, శంకర్ ముత్తుసామి ఆరంభ రౌండ్లలోనే వెనుదిరిగారు.

సినిమా



నాని


రెడీ... యాక్షన్

యాక్షన్ మోడ్‌లోకి వెళ్లనున్నారు హీరో నాని. 'అంటే.. సుందరానికీ..' చిత్రం తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ ఏడాది ఆగస్టు 29న ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల 18న హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించేందుకు నాని అండ్ కో రెడీ అవుతున్నారు. ఈ చిత్రంలో సూర్య పాత్రలో కనిపిస్తారు నాని. ఈ చిత్రంలో వారంలో మిగతా ఆరు రోజులు శాంతంగా ఉండి, ఆ రోజుల్లో జరిగే ఘటనలను పేపర్ మీద రాసు కుని, శనివారం మాత్రమే శత్రువులను వేటాడే సూర్య పాత్రలో నాని కనిపిస్తారు. ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఎస్‌జే సూర్య ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్.



హీరో వెంకటేశ్, నీరజ దంపతుల ద్వితీయ పుత్రిక హయవాహిని వివాహం ఈ నెల 15న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ఘనంగా జరిగింది. డాక్టర్ పాతూరి వెంకట రామారావు–అరుణ దంపతుల కుమారుడు డా. నిషాంత్‌తో కలిసి హయవాహిని ఏడడుగులు వేశారు. ఈ వివాహ వేడుకకు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఫ్యామిలీ స్టార్ పూర్తి



విజయ్ దేవరకొండ

'**ఫ్యా**మిలీస్టార్' సినిమాకు గుమ్మడికాయ కొట్టారు విజయ్ దేవరకొండ. 'గీతగోవిందం' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ పెట్ల కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ బాకూలో మొదలైంది. అక్కడి లొకేషన్స్‌లో విజయ్, మృణాల్‌లపై ఓ పాట చిత్రీకరించారు. ఈ పాటతో సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిందని మేకర్స్ వెల్లడించారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది.

నా కెరీర్‌లో క్లిష్టమైన పాత్ర అది!



సమంత

'ఏ మాయ చేశావె'తో కథానాయికగా కెరీర్ ఆరంభించిన సమంత ఈ పద్నాలుగేళ్లల్లో సవాల్ అనిపించే పాత్రలు చాలానే చేశారు. హీరోయిన్‌గా యాభై చిత్రాలు చేసిన ఆమె 'మహానటి', 'బేబీ', 'యశోద' తదితర చిత్రాల్లో చాలెంజింగ్ రోల్స్ చేశారు. కానీ, ఇన్నేళ్ల కెరీర్‌లో 'సిటాడెల్'లో చేసిన క్యారెక్టర్ తనకు చాలా క్లిష్టంగా అనిపించిందని ఓ ఇంటర్వ్యూలో సమంత పేర్కొన్నారు. 'సిటాడెల్' వెబ్ సిరీస్ గురించి సమంత మాట్లాడుతూ – ''నా కెరీర్‌లోనే 'సిటాడెల్'లో చేసిన రోల్ టఫ్ అనడానికి కారణం నేను శారీరకంగా బలహీనం (మయోసైటిస్ వ్యాధిని ఉద్దేశించి) గా ఉన్నప్పుడు ఆ షూటింగ్ జరిగింది. నా పరిస్థితి బాగాలేనప్పుడు షూటింగ్‌లో పాల్గొనాల్సి రావడం అనేది చాలా కష్టంగా అనిపించింది'' అన్నారు. ప్రియాంకా చోప్రా నటించిన అమెరికన్ వెబ్ సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌లో సమంత నటించారు. సమంత ఓ లీడ్ రోల్‌లో 'ఫ్యామిలీ మేన్' సిరీస్ తెరకెక్కించిన రాజ్, డీకే ఈ సిరీస్‌కి కూడా దర్శకులు. త్వరలో 'సిటాడెల్' స్ట్రీమింగ్ కానున్న నేపథ్యంలో.. ''నా దృష్టిలో ఈ సిరీస్ ఆల్రెడీ హిట్ అయినట్లే. ఎందుకంటే క్లిష్టమైన పరిస్థితుల్లో నటించాను. నేను చేయగలనని అనుకోలేదు. కానీ చేశాను. అందుకు గర్వంగా ఉంది'' అని కూడా సమంత అన్నారు.

గోదావరి గ్యాంగ్స్ రెడీ




విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం కొత్త విడుదల తేదీ ఖరారైంది. ఈ సినిమాను మే 17న రిలీజ్ చేయనున్నట్లు శనివారం యూనిట్ అధికారికంగా ప్రకటించింది. నేహా శెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో హీరోయిన్ అంజలి ఓ లీడ్ రోల్‌లో కనిపిస్తారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించారు. 1960లలో గోదావరి ప్రాంతంలో చీకటి ప్రపంచంలో సామాన్యుడి నుంచి అసామాన్యుడిగా ఎదిగిన ఓ వ్యక్తి నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. ఈ సినిమాను ఈ నెల 8న విడుదల చేయాలనుకున్నారు. కానీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కాకపోవడం వల్ల మే 17కి వాయిదా వేశారు.


తక్కువ అంచనా వెయ్యొద్దు!

నెగటివ్ క్యారెక్టర్స్‌లో తనదైన విలనిజాన్ని పండించిన సోనూ సూద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఫతే'. ఈ చిత్రానికి సోనూయే దర్శకత్వం వహించడంతో పాటు ఓ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. రచయిత కూడా సోనూనే కావడం విశేషం. పూర్తి స్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌ని 'వచ్చేస్తున్నా' అంటూ శనివారం విడుదల చేశారు సోనూ సూద్. సైబర్ క్రైమ్ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని టీజర్ స్పష్టం చేస్తోంది. కాగా.. టైటిల్‌కి ట్యాగ్‌లైన్‌గా 'నెవర్ అండర్‌ఎస్టిమేట్ ఎ నోబడీ' అని పెట్టారు. అంటే.. ఎవర్నీ తక్కువ అంచనా వేయొద్దు అని అర్థం. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ హీరోయిన్. భారత దేశానికి చెందిన వారితో పాటు పలువురు హాలీవుడ్ స్టార్స్ ఈ చిత్రంలో నటిస్తున్నారు. సైబర్ క్రైమ్‌లో ఎదురయ్యే సవాళ్ల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో యాక్షన్ సీన్స్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటాయని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.



సోనూ సూద్, జాక్వెలిన్

ఏది ఏమైనా... మిషన్ పాజిబుల్



టామ్ క్రూజ్

హాలీవుడ్‌లో 'మిషన్ ఇంపాజిబుల్' ఫ్రాంచైజీ సూపర్‌హిట్. ఈ ఫ్రాంచైజీల్లో హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్ చేసే యాక్షన్ విన్యాసాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటాయి. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీ నుంచి ఏడు సినిమాలు వచ్చాయి. తాజాగా ఎనిమిదో భాగం చిత్రీకరణ జరుపుకుంటోంది. 'మిషన్ ఇంపాజిబుల్'లోని ఐదు, ఆరు, ఏడు విభాగాలను డైరెక్ట్ చేసిన క్రిస్టోఫర్ మెక్వారీయే ఎనిమిదో భాగాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ సౌత్ ఈస్ట్ ఇంగ్లాండ్ లొకేషన్స్‌లో ప్రారంభమైంది. కొంత చిత్రీకరణ జరిగాక ఆ ప్రాంతంలోని ఎమ్ 25 అనే ఓ ప్రముఖ రోడ్డును తాత్కాలికంగా క్లోజ్ చేశారట. ఈ రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయని సమాచారం. కానీ 'మిషన్ ఇంపాజిబుల్ 8' షూటింగ్‌ను కొనసాగించాలంటే ఈ రోడ్డు ద్వారా లొకేషన్‌కు వెళ్లాలట. దీంతో ప్రత్యేకంగా హెలికాప్టర్స్‌ని ఏర్పాటు చేశారట. రోడ్డు మార్గం ద్వారా కాకుండా గగన మార్గాన టామ్ క్రూజ్ అండ్ టీమ్ లొకేషన్‌కు వెళ్తున్నారని హాలీవుడ్ టాక్. పోనీ.. ఈ రోడ్డు మరమ్మతు పూర్తయ్యేవరకూ ఆగి, ఆ తర్వాత షూటింగ్‌ను మళ్లీ ఆ లొకేషన్‌లో తిరిగి ఆరంభించానే ఆలోచన కూడా చేశారట. కానీ రోడ్డు రిపేర్‌కి చాలా టైమ్ పడుతుందని, హెలికాప్టర్స్‌తో లొకేషన్‌కి వెళ్లే ఖర్చుతో పోలిస్తే సినిమా ఆలస్యం కావడం వల్ల జరిగే నష్టమే ఎక్కువని క్రూజ్ అండ్ టీమ్ భావించిందని హాలీవుడ్ భోగట్టా. ఇలా 'మిషన్ ఇంపాజిబుల్' షూటింగ్‌ను ఏది ఏమైనా ఆగేదే లేదంటూ.. పాజిబుల్ చేశారు టామ్ క్రూజ్ అండ్ టీమ్. ఈ సినిమా 2025 వేసవిలో రిలీజ్ కానుంది.

లవ్ గురులా పరిష్కారాలు చెబుతాను

– విజయ్ ఆంటోని

''**మ**నందరిలో దాదాపు 95 శాతం మందికి ప్రేమ సమస్యలు ఉంటాయి. అమ్మాయిలను హ్యాండిల్ చేయడం అనేది అబ్బాయిలకు పెద్ద సమస్య. మా 'లవ్‌గురు' చూస్తే ప్రేమలో అమ్మాయిలను ఎలా హ్యాండిల్ చేయాలో అబ్బాయిలకు తెలుస్తుంది. నేను 'లవ్ గురు'లా పరిష్కారాలు చెబుతాను'' అని విజయ్ ఆంటోని అన్నారు. విజయ్ ఆంటోని, మృణాళినీ రవి జంటగా నటించిన రొమాంటిక్ ఫిల్మ్ 'లవ్ గురు'. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వంలో మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రం రంజాన్ సందర్భంగా ఏప్రిల్ 11న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''మా లవ్ గురు' సినిమా చూసిన తర్వాత పెళ్లి చేసుకున్నవారు, చేసుకోనివారు వారి జీవితాల్లోని మహిళలను మరింత అర్థం చేసుకోవడం ప్రారంభిస్తారు'' అన్నారు. ''లవ్ గురు' చిత్రం విజయ్ ఆంటోనీగారి 2.ఓ అనుకోవచ్చు'' అన్నారు వినాయక్. ''ఈ సినిమాలో లీల పాత్రలో కనిపిస్తాను'' అన్నారు మృణాళినీ రవి.



మృణాళిని, విజయ్ ఆంటోని

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ఈడీ కస్టడీకి కవిత

- ఏడు రోజుల కస్టడీకి అనుమతించిన ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు
- కవిత భర్త అనిల్, వ్యక్తిగత సిబ్బందికి ఈడీ నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు ఏడు రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది. తిరిగి ఈ నెల 23న మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి కోర్టులో హాజరుపర్చాలని ఈడీ అధికారులను ఆదేశించింది. కవితకు శనివారం ఉదయం ఈడీ కార్యాలయంలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ముందు హాజరుపర్చారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. కవిత అరెస్టు అక్రమమని ఆమె తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి కోర్టుకు చెప్పారు. సెప్టెంబర్ 15న సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తదుపరి విచారణ వరకూ కవితపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని ఈడీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని ఉల్లంఘించి కవితను అక్రమంగా అరెస్ట్ చేసిందని చెప్పారు. కవితను నిబంధనల మేరకే అరెస్టు చేశామని ఈడీ తరఫు న్యాయవాది జోసెబ్ హుస్సేన్ కోర్టుకు విన్నవించారు. కవితపై తీవ్ర చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. లిక్కర్ స్కాం కేసులో కవిత పాత్రపై ఆధారాలు ఉన్నాయని, ఆమె నుంచి కీలక అంశాలు రాబట్టేందుకు పది రోజులు ఈడీ కస్టడీకి ఇవ్వాలని కోరారు. కోర్టు ఏడు రోజుల కస్టడీకి అనుమతించింది. ఇదిలా ఉండగా, కవిత భర్త అనిల్‌కు, ఆమె వ్యక్తిగత సిబ్బంది ముగ్గురికి ఈడీ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. వారిని సోమవారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో విచారణకు రావాలని పేర్కొన్నట్టు సమాచారం.

కవిత ఆధారాలను ధ్వంసం చేశారు

ఎమ్మెల్సీ కవితను పది రోజుల కస్టడీకి ఇవ్వాలని ఈడీ రౌజ్ అవెన్యూ కోర్టులో పిటిషన్ వేసింది. 'స్కాం ప్రధాన సూత్రధారుల్లో కవిత ఒకరు. ఢిల్లీ లిక్కర్ పాలసీతో లబ్ధి పొందేందుకు రూ.100 కోట్ల ముడుపులు అందించారు. కొందరు మధ్యవర్తులతో ముడుపులు చెల్లించేందుకు కేజ్రీవాల్, సిసోడియాలతో పథకం వేశారు. ఈ ముడుపులకు బదులుగానే లిక్కర్ వ్యాపారంలో కవితకు వాటా దొరికింది. వీటికి ఆధారాలు ఉన్నాయి. ఆమె వాడిన ఫోన్, అధికారులకు అప్పగించిన ఇతర ఫోన్లలోని డేటాను తొలగించి ఫార్మాట్ చేశారు. ఆధారాలను ధ్వంసం చేయడానికే ఈ పని చేసినట్టు భావిస్తున్నా'మని ఈడీ పేర్కొంది.

ట్రోలింగ్.. 'సోషల్' కిల్లింగ్



- బలి తీసుకుంటున్న సామాజిక మాధ్యమాల వేధింపులు • ఒక్కో సందర్భం...ఒక్కో తరహా


సాక్షి, హైదరాబాద్ : సోషల్ మీడియా ట్రోలింగ్ ప్రాణాల మీదకు తెస్తోంది. ఒక్కో సందర్భంలో..ఒక్కో తరహా వేధింపులు తప్పడం లేదు. ఇందులో మహిళలే ఎక్కువగా బాధితులుగా ఉంటున్నారు. తాజాగా గీతాంజలి ఆత్మహత్యే ఇందుకు నిదర్శనం. ట్రోల్ చేసి పైశాచిక ఆనందం పొందేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

వర్చువల్‌లైఫ్ వేరు.. నిజజీవితం వేరు అని గుర్తించాలి


సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వాలని, గుర్తింపు పొందాలని ఈ మధ్య కాలంలో ఎక్కువగా రీల్స్, షార్ట్ వీడియోలు చేస్తున్నారు. అయితే, ఇలాంటి వీడియోలతో ప్రచారం ఎంత పొందుతారో, కొన్నిసార్లు ట్రోలింగ్‌కు గురవడం సహజమే అని గుర్తించాలి. పొగడ్తలకు పొంగిపోవడం కాదు..విమర్శలు వచ్చినప్పుడు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. వీటన్నింటికీ విరుగుడు సోషల్ మీడియాకు దూరంగా ఉండడమే అని వారు పేర్కొంటున్నారు. వ్యక్తిగతంగాను, కొన్నిసార్లు పార్టీలపరంగా టార్గెట్ చేసి ఇలాంటి తప్పుడు విమర్శలు, కామెంట్లు చేస్తున్నారన్నది మరవొద్దని వారు సూచిస్తున్నారు. ఫేక్ కంటెంట్ రాసినంత మాత్రాన మన చుట్టూ ఉండేవారి దగ్గర మనం తక్కువకాము అన్నది గుర్తించాలంటున్నారు.

కొన్ని రకాల 'సోషల్' వేధింపులు ఇలా....

ఈ తరహా సోషల్ మీడియా వేధింపులు యువతలో ఎక్కువగా ఉంటున్నాయి. అమ్మాయిలు, ఉద్యోగాలు చేస్తున్న మహిళలు సైబర్ బుల్లీయింగ్ తరహా వేధింపులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు.




సైబర్ బుల్లీయింగ్: చెప్పి బెదిరింపులకు గురి చేయడం. ఇది ఎక్కువగా యూఎస్, యూకేలో ఉంది. ఇది కూడా ఒక తరహా సైబర్ వేధింపులే. మన దగ్గర ఈ తరహా సైబర్ వేధింపులు ఎక్కువగా లోన్‌యాప్స్ మోసాల్లో చూస్తున్నాం. మేం చెప్పినంత డబ్బు చెల్లించకపోతే మిమ్మల్ని పోలీసులకు అప్పగిస్తాం..మా ఏజెంట్ మీ ఇంటికి వచ్చి పరువు తీస్తాడు..అంటూ బెదిరింపులకు దిగి ఆత్మహత్యలు చేసుకునేలా ఒత్తిడి చేస్తున్నారు.



ట్రోలింగ్: రాజకీయాల్లో ఉండేవారికి ఇవి తప్పడం లేదు. ప్రధానమంత్రి మొదలు అన్ని స్థాయిల్లోని రాజకీయనేతలు వీటి బారిన పడుతున్నారు. సినీతారలు, ప్రముఖ క్రీడాకారులు, ఇతర సెలబ్రిటీలకు సైతం ఇవి తలనొప్పిగా మారాయి.



స్వాటింగ్: తప్పుడు మెసేజ్‌ల ద్వారా దర్యాప్తు సంస్థల పేరు



రివేంజ్ పోర్న్: స్నేహితులుగా లేదా ప్రేమికులుగా ఒక రిలేషన్‌లో ఉన్నప్పుడు సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలను వారి రిలేషన్‌షిప్ బ్రేక్ అయిన తర్వాత బెదిరింపుల కోసం వాడడమే రివేంజ్ పోర్న్. మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు తయారు చేసి సోషల్ మీడియాలో పెడతామని అమ్మాయిలను వేధించడం, మానసికంగా కుంగదీయడం దీని కిందకే వస్తుంది.

ఈ జాగ్రత్తలు మరవొద్దు

- సోషల్ మీడియాలో అవసరానికి మించి మన వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలు షేర్ చేయకపోవడమే బెటర్.
- ఏ తరహా సోషల్ మీడియా వేధింపులకు గురవుతున్నామన్నది ముందుగా గుర్తించాలి. వాటికి సంబంధించి స్క్రీన్‌షాట్‌లు తీసి పెట్టుకోవాలి. ఇవి భవిష్యత్‌లో ఆధారంగా పనికొస్తాయి.
- వేధింపులు ఉన్నట్టు గమనిస్తే, సోషల్ మీడియా ఖాతాలకు దూరంగా ఉండటమే ఉత్తమం. వర్చువల్ ప్రపంచంలో ఎక్కడో కూర్చున్న అజ్ఞాత వ్యక్తులు చేసే కామెంట్లు పట్టించుకోవొద్దు.
- ఎవరైనా మన సోషల్ మీడియా ఖాతాల్లోని గ్రూపులలో అభ్యంతరకర మెసేజ్‌లు పెడితే, వాటిని వెంటనే డిలీట్ చేయాలి. వాటిని ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్‌లో రిపోర్ట్ చేసే ఆప్షన్ ఉంటుంది. వాటిని వినియోగించుకోవాలి.
- వేధింపులు మితిమీరితే 1930 నంబర్‌కు డయల్ చేసి సైబర్ క్రైం సెల్‌లో ఫిర్యాదు చేయాలి. ఠీఠీఠీ. ఛిyb ఛిటజీఝ్ఛ. జౌఠి. జీ పోర్టల్ ఫిర్యాదు చేస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదు చేయడం ఉత్తమం

సోషల్ మీడియా అనేది ప్రతి ఒక్కరి జీవితాల్లో ఓ భాగమైంది. విమర్శలు, వ్యక్తిగత దూషణలు వచ్చినప్పుడు మానసిక స్థైర్యం కోల్పోవద్దు. వెంటనే పోలీసులను సంప్రదించాలి.

– డా.ప్రసాద్ పాటిబండ్ల, సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణుడు, న్యూఢిల్లీ

సెల్‌ఫోన్ కోసం దారుణం

నానమ్మను కడతేర్చిన మనుమడు



కురువ నాగమ్మ



నిందితుడు వెంకటేష్

గోనెగండ్ల: సెల్‌ఫోన్ కొనుగోలుకు డబ్బులు లేకపోవడంతో నానమ్మ బంగారు నగలపై కన్నేసి ఆమెను హత్యచేసిన మనుమడు మృతదేహాన్ని ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టాడు. ఈ ఘటన కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం పెద్దమరివీడులో 13 రోజుల క్రితం చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురువ నాగమ్మ (80)కు పెద్దబజారి, చిన్నబజారి అనే ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడు ఉపాధి నిమిత్తం భార్య, కుమారుడు వెంకటేష్‌తో ఇటీవల గుంటూరుకు వలస వెళ్లారు. అప్పటికే చెడు వ్యసనాలున్న వెంకటేష్‌కు కొత్త సెల్‌ఫోన్ కొనుక్కోవాలనే కోరిక కలిగింది. ఇందుకోసం నానమ్మ నగలను ఎత్తుకెళ్లాలని స్కెచ్ వేశాడు. ఈ నెల 4న వెంకటేష్ తన నానమ్మ గొంతు నులిమి చంపేశాడు. రెండున్నర తులాల బంగారు నగలను తీసుకుని ఎమ్మిగనూరుకు వెళ్లి ఓ బంగారు షాపులో రూ.39 వేలకు విక్రయించాడు. రూ.25 వేలతో సెల్‌ఫోన్ కొనుగోలు చేసి గ్రామానికి వెళ్లాడు. అర్ధరాత్రి ఇంటి ఆవరణలో గొయ్యి తవ్వి మృతురాలిని పూడ్చిపెట్టి మరుసటి రోజు తిరిగి గుంటూరు వెళ్లిపోయాడు. అయితే, ఈనెల 13న ఇతర పనుల నిమిత్తం గ్రామానికి వచ్చిన మృతురాలి చిన్నకుమారుడు చిన్నబజారి కొడుకు గోపాల్ తన నానమ్మ కనిపించకపోవడంతో గ్రామంలో విచారించాడు. ఆ ప్రాంత వాసులు వారం నుంచి కనిపించడం లేదని చెప్పడంతో గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా.. వెంకటేష్ గ్రామానికి వచ్చి వెళ్లిన తరువాతే నాగమ్మ కనిపించడంలేదన్న అనుమానాలు వ్యక్తంకావడంతో పోలీసులు అతన్ని అదుపులో తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ట్రెనీ డీఎస్పీ భావన, సీఐ రామకృష్ణయ్యలు గ్రామానికి వెళ్లి పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తహసీల్దార్ పార్వతి సమక్షంలో బయటకు తీసి వైద్యుల ఆధ్వర్యంలో శవపరీక్ష చేశారు. ఈ దారుణానికి పాల్పడిన వెంకటేష్‌పై హత్యకేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

• తెలంగాణ

కొన ఊపిరితో ఉన్నాడు.. చచ్చాకే తలుపులు తీస్తా...

- హీటర్‌తో కొట్టి.. చున్నీతో ఉరివేసి కన్న తండ్రిని దారుణంగా కడతేర్చిన కుమారుడు
- మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో ఘటన



మృతుడు ప్రేమానందం (ఫైల్)

పాపన్నపేట (మెదక్): వేధింపులతో విరక్తి చెంది కన్న తండ్రినే కిరాతకంగా చంపాడు ఓ కుమారుడు. ఈ ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సంగం ప్రేమానందం (42), సుగుణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు సందీప్ సిద్దిపేటలో డిగ్రీ చదువుతుండగా, కూతురు 9వ తరగతి, చిన్న కుమారుడు ప్రవీణ్ 7వ తరగతి చదువుతున్నారు. ప్రేమానందం మద్యానికిఅలవాటు పడి, భార్యను అనుమానిస్తూ తరచూ కొడుతుండేవాడు. 10 రోజుల కిందట అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌లో పోలీసులు సైతం ప్రేమానందంకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అయినా వారి కుటుంబంలో సఖ్యత కుదరలేదు. బుధవారం మళ్లీ గొడవ జరగడంతో తల్లి సుగుణమ్మ, పెద్ద కుమారుడు సందీప్ కలిసి రోకలి బండతో ప్రేమానందం మోకాళ్లు విరగ్గొట్టి నడవడానికి రాకుండా చేసి తల్లిగారింటికి వెళ్లిపోయారు. అయితే శనివారం మళ్లీ సందీప్ ఇంటికొచ్చేసరికి ప్రేమానందం తన తండ్రి ప్రసాద్, పక్కింటి వారితో మాట్లాడుతున్నాడు. వెంటనే సందీప్ తాత ప్రసాద్‌ను, పక్కింటి వారిని ఇంట్లో నుంచి బయటకు పంపి తలుపులు గడియపెట్టాడు. లేవలేని స్థితిలో ఉన్న తండ్రి ప్రేమానందంను కరెంట్ హీటర్‌తో విచక్షణా రహితంగా కొట్టడం మొదలుపెట్టాడు. చుట్టు పక్కలవారు తలుపులు తీయమని బతిమిలాడినా 'కొన ఊపిరితో ఉన్నాడు.. ప్రాణం పోయాకే తలుపులు తీస్తానంటూ' ఆగ్రహంతో ఊగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత చున్నీతో ఉరి వేసి తండ్రిని హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు.

క్లుప్తంగా...

'పది' పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్న తరగతులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రాల్లోనూ ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ ఆదేశించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. అలాగే పదో తరగతి రెగ్యులర్, ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు జరిగే కేంద్రాల్లో జాతీయ సెలవులు, మతపరమైన సెలవు దినాల్లో మినహా మిగిలిన సెలవు దినాల్లో ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట తరగతులు నిర్వహించాలని సూచించారు.

ఏయూలో ఐసీసీఆర్ జోనల్ డైరెక్టర్

విదేశీ విద్యార్థులు ఏయూకి ప్రాధాన్యత ఇస్తున్నారంటూ కితాబు



వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమైన ప్రదీప్ కుమార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ జోనల్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ శనివారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ అత్యధిక శాతం మంది విదేశీ విద్యార్థులు ఏయూలో చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. ఇక్కడ కల్పిస్తున్న వసతులు, పటిష్ట బోధన విధానాలు తదితర అంశాలు వారిని ఆకర్షిస్తున్నాయని చెప్పారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి మాట్లాడుతూ విదేశీ విద్యార్థుల సంఖ్యను రెండు వేలకు పెంచడం లక్ష్యంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. వారి కోసం నూతన హాస్టల్స్‌ని సైతం అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఏయూకు విదేశీ విద్యార్థులను పంపే ప్రక్రియలో సహకారం అందిస్తున్న ఐసీసీఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఏయూ తరపున ప్రదీప్‌కుమార్‌ని సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు, అసోసియేట్ డీన్ ఆచార్య ఈశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఎమ్మెల్సీ కల్పలత కృతజ్ఞతలు



సాక్షి, అమరావతి: ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల చిరకాల కోరికను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మోడల్ స్కూల్స్‌ను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయడంతో పాటు రెగ్యులర్ బోధనా సిబ్బందికి 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు ఆమె శనివారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

19తో ముగియనున్న ఏపీ ఆర్‌సెట్ దరఖాస్తుల గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వర్సిటీల్లో పీహెచ్‌డీ సీట్ల భర్తీకి చేపట్టిన ఏపీ ఆర్‌సెట్ దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 19తో ముగియనున్నట్లు సెట్ కన్వీనర్ బి.దేవప్రసాద్‌రాజు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫుల్ టైమ్, పార్ట్‌టైమ్ కింద 1,900 సీట్లకు అడ్మిషన్లు కల్పించే అవకాశం ఉందన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఎంఎస్-2లో ద్రవపు ఉక్కు నేలపాలు



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

గాజువాక: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్‌ఎంఎస్)-2 లేడల్‌కు రంధ్రం పడటంతో ద్రవపు ఉక్కు నేలపాలైంది. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదు. విభాగంలోని కన్వర్టర్-3లో ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కన్వర్టర్ నుంచి ద్రవపు ఉక్కును లేడల్‌లో ఎల్‌పీ బేకు తరలిస్తుండగా లేడల్ మధ్యలో రంధ్రం పడింది. ఆ రంధ్రం వ్యాపించడంతో లేడల్‌లో ఉన్న సుమారు 150 టన్నుల ద్రవపు ఉక్కు నేల పాలైంది. దీంతో అక్కడ మంటలు వ్యాపించాయి. వెంటనే సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదం వల్ల కింద ఉన్న ట్రాక్ ధ్వంసం కాగా అక్కడ ఉన్న కేబుళ్లు కాలిపోయాయి. ఆ కన్వర్టర్ నుంచి ఉత్పత్తి ప్రక్రియ నిలిచి పోగా మిగిలిన రెండు కన్వర్టర్లలో ఉత్పత్తి కొనసాగింది. కన్వర్టర్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నానికి కన్వర్టర్‌ను పునరుద్ధరించే అవకాశముందని కార్మిక వర్గాల సమాచారం.

నాడు కత్తుల కొలిమి- నేడు పొత్తుల చెలిమి

ఆనాడు దుమ్మెత్తిపోసుకుని ఇప్పుడు దగ్గరవుతున్నారు

- ప్రధాని వైవాహిత జీవితంపై కూడా విమర్శలు
- నల్ల బెలూన్లు ఎగరవేసి ఇప్పుడు నిస్సిగ్గుగా స్వాగతాలు
- చంద్రబాబుకు పోలవరం 'ఏటీఎం' అని తీవ్ర విమర్శలు చేసిన ప్రధాని
- బాహుబలిలో భళ్లాల దేవుని పాత్రతో పోల్చిన వైనం
- ఇప్పుడు ఒకే వేదిక పంచుకోవడంపై టీడీపీని చీదరించుకుంటున్న ప్రజలు
- 'బాబు' ప్రయోజనాల కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధమేనని విమర్శల వెల్లువ



సాక్షి, అమరావతి: చాలా కాలం తర్వాత ప్రధాని మోదీ, తెలుగుదేశం పార్టీ చంద్రబాబు ఆదివారం నాడు ఉమ్మడిగా ఒకే వేదిక నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ సభలో ప్రధాని మోదీతో పాటు చంద్రబాబు ఏం మాట్లాడతారోనని రాజకీయ పరిశీలకులతో పాటు రాష్ట్రంలో చాలా మంది ఆసక్తితో ఉన్నారు. ఎందుకటే 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఎన్డీయే నుంచి నిష్క్రమించాక మోదీ రాష్ట్రానికి ఎన్నికల ప్రచారానికి వస్తే, చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో ఉండీ తన పార్టీ కార్యకర్తలతో నల్ల చొక్కాలు వేయించి గో బ్యాక్ అంటూ నినాదాలు చేయించారు. ప్రధాని పర్యటన సమయంలో టీడీపీ నేతలు నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసనలు తెలిపారు. ఆ సమయంలోనే ప్రధాని మోదీని ఉద్దేశించి చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేస్తే... దానికి బదులు ప్రధాని మోదీ సైతం తీవ్రంగానే ప్రతిస్పందించారు. ఆయన ఏమన్నారు.. ఈయన ఏమన్నారంటే...

2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రధాని మోదీనుద్దేశించి వివిధ సందర్భాల్లో చేసిన విమర్శలు

బీజేపీతో పొత్తు పెట్టుకోకుండా ఉంటే ఇంకా 15 సీట్లు వచ్చేవి

'రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల కోసం ఎన్డీయే నుంచి బయటకు వస్తే.. అది రాజకీయ ప్రయోజనాల కోసం అని మాట్లాడుతున్నారు. నిజంగా నేను రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం అనుకుని ఆనాడు బీజేపీతో పొత్తు పెట్టుకోకుండా ఉంటే.. ఇంకో 15 సీట్లు ఎక్కువ వచ్చేవి'
-మార్చి 29, 2018న రాష్ట్ర అసెంబ్లీలో చంద్రబాబు.

'దేశ రక్షణ రంగంలో అతి పెద్ద కుంభకోణంగా పేర్కొంటున్న రూ. 59,000 కోట్ల రఫెల్ ఒప్పందం, దానికి సంబంధించిన నివేదికలు ఉన్నాయి. ఇందులో నేరుగా ప్రధాని కార్యాలయ ప్రమేయం ఉండే అవకాశాలు ఉన్నాయి. దానిపై ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. మోదీ జీ, మీరు దేశాన్ని మోసం చేసినప్పుడు సత్యాన్ని ఎక్కువ కాలం దాచలేరు'
- ఫిబ్రవరి 8, 2019 తన ట్విట్టర్‌లో చంద్రబాబు

మీకూ, బ్రిటిష్ వాళ్లకూ తేడా లేదు. మీకంటే వాళ్లే నయం. కాటన్ దొర ఇచ్చిన నీళ్లయినా తాగుతున్నాం. నాలాంటి సీనియర్ నాయకుడు నల్ల చొక్కా వేసుకున్నారంటే వీళ్లు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారో అర్థం చేసుకోవాలి. 2002లో మోదీ, నిన్న అమిత్‌షా రాజకీయాల్లో వచ్చారు. నేను 1978లోనే ఎమ్మెల్యేనయ్యా. మోదీని సార్ అంటూ గౌరవిస్తే అమరావతికి మట్టి, నీరు ముఖాన కొట్టిపోయారు
- 2019 ఫిబ్రవరి 2న అసెంబ్లీలో అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు

'రాష్ట్రం కోసం 29 సార్లు తలవంచుకొని ఢిల్లీ వెళ్లా. కేంద్రం ముందు చేయి చాచా. ఎలాంటి కనికరం లేదు. ప్రజలుగా మీరు చెప్పండి'.
- 2018 జూన్ 9న నెల్లూరు సభలో చంద్రబాబు

'బీజేపీకి ఒకటే చెబుతున్నా, తెలుగుదేశంతో పెట్టుకుంటే ఖబడ్దార్. మీ కుట్రలు ఏ రాష్ట్రంలోనైనా చెల్లుతాయేమో. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సాగవు'.
- 2018లో శృంగవరపుకోటలో జరిగిన నవనిర్మాణ దీక్షలో చంద్రబాబు

'కేంద్రం సహకారం అందించినప్పటికీ పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి టీడీపీకి లేదు. పోలవరం ప్రాజెక్టు చంద్రబాబుకు ఏటీఎం లాంటిది. అందులో నుంచి డబ్బులు తీసుకోవడమే. ఈ రకంగా పోలవరం ప్రాజెక్టు అంచనాలు పెంచడం ద్వారా ఎవరికి మేలు చేయాలని యూ టర్న్ బాబు అనుకుంటున్నారన్నది మీ అందరికీ తెలుసు.'

'ఏపీలో పరిస్థితి బాహుబలి సినిమాలో భళ్లాలదేవుడి పాత్ర మాదిరిగా ఉంది. తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని తిరిగి దానిని కాపాడుకోవడం కోసం ఎలాంటి ప్రయత్నాలకైనా వెనుకాడడం లేదు. ఆంధ్రప్రదేశ్ హెరిటేజ్ (సంస్కృతి) మంచి పాలనతో రాష్ట్ర ప్రజలందరూ అభివృద్ధి చెందాలన్నది మా ఆలోచన అయితే... యూ టర్న్ బాబు నైజం మాత్రం తన సొంత హెరిటేజ్ (చంద్రబాబు కుటుంబీకుల వ్యాపార సంస్థ పేరు) కంపెనీ బాగుంటే చాలన్న తీరు'
- 2019 ఏప్రిల్ 1న రాజమండ్రిలో జరిగిన బీజేపీ ఎన్నికల సభలో ప్రధాని మోదీ.

దేశం కోసం గట్టి నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామంటే మాకెలాంటి బెరుకు లేదు.ఇవాళ ఇక్కడ ఉన్న నాయకులు(చంద్రబాబును ఉద్దేశించి) భయపడాలి. ఎందుకంటే వారు చేసిన అవినీతి వారిని ఎల్లప్పుడూ వెంటాడుతుంది. ఈ విషయం వారికి తెలుసు. అవినీతి చేయడంలో, ముఖ్యమంత్రిగా ఉంటూ తన కుటుంబ ప్రయోజనాల కోసమే పనిచేసి తప్పు చేశారని వారికి తెలుసు.
- 2019 మార్చి 2న విశాఖపట్నం సభలో ప్రధాని మోదీ.

'నేను ఎవరికీ భయపడేది లేదు, నరేంద్ర మోదీ, ఎన్డీయే ప్రభుత్వం ఇబ్బందులు పెడితే భయపడే పిరికి పందను కాను. ఒక్కో రాష్ట్రంలో ఉండే నాయకత్వాన్ని బలహీన పరచడానికి, ఇష్టమొచ్చినట్లు ఆడుకోవడం వీళ్లకు అలవాటైంది. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో సంక్షోభాలను చూశా. భయమనేది నా జీవితంలో లేదు'.
- 2018లో మార్చి 6 తేదీన విజయవాడలో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో చంద్రబాబు.

'విభజన హామీలను నాలుగు బడ్జెట్‌లలో పట్టించుకోలేదు. చివరి బడ్జెట్‌లోనూ పెట్టలేదు. ఈ రాష్ట్రం ఒకటి ఉందన్న ఆలోచన లేదా? ఎప్పుడైనా మిత్రపక్షంగా రండి. కూర్చుందాం అని అన్నారా? మీరు ఒక్కరే దేశాన్ని కాపాడతారా? ఏం మీకొక్కరికే దేశ భక్తి ఉందా?
-2018 మార్చి 7న సమావేశంలో చంద్రబాబు.

'భార్యనే చూసుకోని వాడు, దేశాన్ని ఏం చూసుకుంటాడు'.
- అసెంబ్లీలో చంద్రబాబు తన ప్రసంగంలో చేసిన తీవ్ర వ్యాఖ్యలివి.

'నరేంద్ర మోదీ కరుడుకట్టిన ఉగ్రవాది. మంచివాడు కాదు'.
- 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీ నేతల సమావేశంలో చంద్రబాబు.

ప్రధాని మోదీ వివిధ సందర్భాల్లో చంద్రబాబును ఉద్దేశించి మాట్లాడిన మాటలు

'లోకేశ్ తండ్రి చంద్రబాబు నాకు సంపదను సృష్టించడం తెలియదన్నారు. అవును నిజమే. నాకు సొంత ఆస్తులు పెంచుకోవడం రాదు. కానీ అమరావతి నుంచి పోలవరం వరకు తన ఆస్తులు పెంచుకోవడం కోసం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. సొంత ఆస్తులు పెంచుకునే ఆశ నాకు లేదు. ఎప్పుడైనా ఒక ముఖ్యమంత్రి వాస్తవాలను వదిలిపెట్టి అసత్యాలు మాట్లాడుతున్నారంటే ఆయన ప్రజల మద్దతు కోల్పోయారని అర్థం. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆ వ్యక్తి ఏదో పెద్ద తప్పు చేశారనే అర్థం'

'ప్రజలారా మీరే చెప్పండి. ఎన్టీఆర్ వారసత్వాన్ని తీసుకున్నాయన ఆయన కలలను సాకారం చేస్తానని మాటిచ్చారా లేదా? ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తానని హామీ ఇచ్చారా లేదా? ఈ రోజు ఆయన ఎన్టీఆర్‌కు గౌరవమిస్తున్నారా? సోదర సోదరీమణులారా మీకు ఈ విషయం అర్థమవుతుంది. కానీ ఆయనలాంటి సీనియర్ నాయకుడికి ఎందుకు అర్థం కావడం లేదు. ఇదంతా యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్టీఆర్ ఏపీకి కాంగ్రెస్ నుంచి విముక్తి కావాలనుకున్నారు. అప్పట్లో ఏపీని అవమానించిన కాంగ్రెస్‌ను దుష్ట కాంగ్రెస్ అని ఎన్టీఆర్ అన్నారు. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి (చంద్రబాబు) అదే కాంగ్రెస్‌తో దోస్తీ కట్టారు'

'చంద్రబాబుకు ఏమైంది. ఆయన నాకంటే చాలా సీనియర్‌నని మళ్లీ మళ్లీ గుర్తు చేస్తుంటారు. మీరు (చంద్రబాబు) సీనియర్. అందువల్లే గౌరవమిచ్చే విషయంలో ఎప్పుడు తక్కువ చేయలేదు. అవును మీరు సీనియర్. కూటములు మార్చడంలో. కొత్త కూటములు కట్టడంలో. మీ సొంత మామకు వెన్నుపోటు పొడవడంలో. ఈ రోజు ఎవరిని తిడతారో రేపు వారి ఒళ్లోనే కూర్చోవడంలో.

'కేంద్ర ప్రభుత్వం ద్వారా నేను చేపట్టిన పథకాలపై చంద్రబాబు తన స్టిక్కర్ వేసుకొని ప్రచారం చేసుకుంటున్నారు. అద్భుతమైన అమరావతి నిర్మాణమంటూ వ్యక్తిగత అభివృద్ధిలో బిజీ అయిపోయారు. చంద్రబాబు చేస్తున్నది అమరావతి నిర్మాణం కాదు.. కూలిపోతున్న తన పార్టీ నిర్మాణం'.

- 2019 ఫిబ్రవరి 10న గుంటూరు సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలివి.

రొయ్య రాతల గొయ్యిలో రామోజీ

రొయ్య ఉత్పత్తి, ఎగుమతుల్లో దేశంలోనే ఏపీ నెం.1

- ఐదేళ్లలో 6.94లక్షల టన్నులు పెరిగిన రొయ్యల ఉత్పత్తి
- ఏటా రూ.20 వేల కోట్ల విలువైన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతి
- 57 నెలల్లో రూ.3306 కోట్ల విద్యుత్తు సబ్సిడీ చెల్లింపు
- బాబు ఎగ్గొట్టిన రూ.340 కోట్లు చెల్లించిన ప్రభుత్వం
- వరుసగా రెండేళ్ల పాటు బెస్ట్ మెరైన్ స్టేట్‌గా నిలిచిన ఏపీ
- అయినా ఈనాడు ఏడుపుగొట్టు రాతలు



రొయ్య ఎగరలేదు.. రైతు ఎదగలేదు!

సాక్షి, అమరావతి: గతంలో ఎన్నడూ లేని విధంగా గత 57 నెలలుగా రొయ్య రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. ప్రతీ కౌంట్‌కు ప్రకటించిన గిట్టుబాటు ధర ప్రతీ రైతుకు దక్కేలా కృషి చేయడమే కాదు.,. పెంచిన ఫీడ్ ధరలను 3 సార్లు ఉపసంహరించుకునేలా ఈ ప్రభుత్వం చేసింది. ఆక్వాజోన్ పరిధిలో పదెకరాల్లోపు అర్హత ఉన్న ప్రతీ రైతుకు యూనిట్ రూ.1.50కే విద్యుత్తును అందిస్తోంది. ఫలితంగా ఐదేళ్లలో రొయ్యల ఉత్పత్తితో పాటు ఎగుమతులూ భారీగా పెరిగాయి. రొయ్యల ఉత్పత్తి బాబు ఐదేళ్ల పాలనలో 1.74 లక్షల టన్నులకు మాత్రమే పెరిగితే.. సీఎం జగన్ ప్రభుత్వంలో గత ఐదేళ్లలోనే ఏకంగా 6.94 లక్షల టన్నులకు పెరిగింది. బాబు హయాంలో జాతీయ స్థాయిలో రొయ్యల ఉత్పత్తి 67 శాతం ఉండగా, ప్రస్తుతం 77.55 శాతానికి పెరిగింది. ఇవేమీ రాజగురువు రామోజీకి మాత్రం కన్పించడం లేదు. ఆక్వా రంగానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నప్పటికీ, అదే పనిగా విషం కక్కుతూనే ఉన్నారు. తాజాగా 'రొయ్య ఎగరలేదు..రైతు ఎదగలేదు' అంటూ అబద్ధాలను అచ్చేశారు.. వాస్తవాలు ఏమిటంటే..

రామోజీ వక్రభాష్యాలకు హద్దూపద్దూ లేదు. చంద్రబాబు సాధించలేని ప్రగతిని సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి సాధిస్తే ఓర్వలేనితనం, కడుపుమంట నిలువెల్లా రామోజీకి కంటగింపుగా మారాయి.. ప్రభుత్వం అన్ని వర్గాలకు జగన్ ప్రభుత్వం ఏ మంచి చేసినా, అది మంచే కాదని వక్రీకరణే పనిగా పెట్టుకుని పవిత్రమైన జర్నలిజానికే కళంకం తెస్తున్నారు. ఆక్వారంగంలో జగన్ సాధించిన నీలి విప్లవ పురోగమనం జాతీయ స్థాయిలోనే అబ్బురపరిచే ఫలితాలనిస్తుంటే...ఆ అభివృద్ధిని రామోజీ ఓర్వలేక పోతున్నారు.. చేపలు, రొయ్యల ఉత్పత్తులు బాబు హయాంలో 39 లక్షల టన్నులుంటే , అది జగన్ పాలనలో 51 లక్షల టన్నులకు పెరగడం ఈనాడుకు కనిపించలేదు. జాతీయ స్థాయిలో చూసినా బాబు పాలన నాటికి ఉన్న రొయ్యల ఉత్పత్తి అయిదింతలు పెరిగినా, అదీ రామోజీకి గొప్పగా అనిపించదు. ఎగుమతుల్లో ఏటా సగటున 5.12 శాతం వృద్ధి రేటు నమోదవుతున్నా అదీ తనకు నచ్చదు. ఇలా... జగన్ ప్రభుత్వం ఏ రంగంలో చూసినా అన్నీ నూరుశాతం ప్రగతిని సాధించినవే కనిపిస్తున్నాయి. దీనికి భిన్నంగా పాలనలో తనదంటూ ముద్ర ఏర్పరుచుకోలేక నిస్సహాయుడిగా మిగిలిపోయిన చంద్రబాబును గొప్పగా ప్రాజెక్టు చేయడానికి రామోజీ పడరాని పాట్లు పడుతున్నారు... వాస్తవాలకు ఈనాడు ఎంత మసిబూసి మారేడు కాయ చేయాలనుకన్నా , నిజాలను దాచేసి అబద్ధాలను అచ్చేయాలనుకున్నంత మాత్రాన సత్యాలు అసత్యాలుగా మారిపోవుకదా... ఆక్వా రంగంలో జగన్ ప్రభుత్వ విజయాలు, చంద్రబాబు వైఫల్యాలు ఇవిగో...

ఆరోపణ : పెరగని రొయ్యల ఉత్పత్తి

వాస్తవం..: రాష్ట్రంలో 1.46 లక్షల హెక్టార్లలో మంచినీటి, 54 వేల హెక్టార్లలో ఉప్పునీటి కల్చర్ విస్తీర్ణం ఉండగా, 1.75 లక్షల మంది రైతులు ఆక్వాసాగు చేస్తున్నారు. ఈ-ఫిష్ ద్వారా ఆక్వా సాగును గుర్తిస్తూ, వారికి అందాల్సిన అన్నిసంక్షేమ ఫలాలను అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. 2018-19లో 39 లక్షల టన్నులు ఉన్న రొయ్య/మత్స్య ఉత్పత్తులు 2022-23కు వచ్చేసరికి ఏకంగా 51 లక్షల టన్నులకు పెరిగింది. మంచినీటి రొయ్యలు 4.55 లక్షల టన్నుల నుంచి 9.56 లక్షల టన్నులకు, ఉప్పునీటి రొయ్యలు 5.28 లక్షల టన్నుల నుంచి ఏకంగా 7.15 లక్షల టన్నులకు పెరిగాయి. ఇలా ఐదేళ్లలో సముద్ర, మంచినీటి, ఉప్పునీటి రొయ్యల ఉత్పత్తి 11.09 లక్షల టన్నుల నుంచి 18.50 లక్షల టన్నులకు పెరిగింది.

ఆరోపణ : ఎగుమతులు పెరగలేదు

వాస్తవం..: ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు చంద్రబాబు హయాంతో పోల్చుకుంటే గణనీయంగా పెరిగాయి. 2018-19లో రూ.13,855 కోట్ల విలువైన 2.61 లక్షల టన్నులు ఎగుమతులు జరిగితే.. 2022-23లో ఏకంగా రూ.19,847 కోట్ల విలువైన 3.28 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఎగుమతులు జరిగాయి. జీవీఏ చూసుకుంటే రూ.48 వేల కోట్ల నుంచి ఏకంగా రూ.68 వేల కోట్లకు పెరిగింది. ఏటా సగటున 5.12 శాతం వృద్ధిరేటు నమోదవుతోంది. గ్రోత్ రేట్ ఐదేళ్లలో జాతీయ స్థాయిలో 19.37 శాతం ఉంటే, ఏపీలో 25.59 శాతంగా నమోదవుతోంది. నాణ్యమైన ఉత్పత్తుల విషయంలో ప్రభుత్వ ప్రత్యేక చర్యల కారణంగా నాలుగేళ్ల క్రితం 86 శాతం ఉన్న యాంటీబయోటిక్స్ రెసిడ్యూల్స్ ఇప్పుడు 26 శాతానికి తగ్గాయి. దీంతో ఆక్వా ఉత్పత్తుల్లో నాణ్యత పెరిగి, ఎగుమతులు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

ఆరోపణ : సిండికేట్‌గా మారి దోపిడీ

వాస్తవం..: నాణ్యమైన సీడ్, ఫీడ్ సరఫరాకు ప్రభుత్వం ఐదేళ్లుగా ఎన్నో చర్యలు చేపట్టింది. ఆక్వా కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చిన అప్సడా చట్టం ద్వారా. కంపెనీలు, సరఫరాదారులను రైతులకు జవాబుదారీతనంగా నిలిచేలా చేసింది. బాబు హయాంలో ఐదేళ్ల పాటు సాగిన వారి దోపిడీకి జగన్ పాలనలో అడ్డుకట్ట పడింది. అంతర్జాతీయంగా ముడిపదార్థాల ధరలు 28 శాతం మేర పెరగడం వల్ల ఆ మేరకు రొయ్య మేత ధర 21.36 శాతం (రూ.72 నుంచి రూ.91.50లకు) మేర పెరిగింది. ఐదేళ్లలో 3 సార్లు కంపెనీలు పెంచిన ఫీడ్ ధరలను వెనక్కి తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగా మేత ఖర్చుల భారం రైతులపై టన్నుకు రూ.860 పడకుండా అడ్డుకుంది.

ఆరోపణ : నియంత్రణా ...అదెక్కడ?

వాస్తవం..: రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పన కోసం గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ప్రభుత్వం కృషి చేసింది. ప్రతీ 15 రోజులకోసారి అంతర్జాతీయ మార్కెట్‌లో రొయ్యల ధరల హెచ్చు తగ్గులను 'అప్సడా' ద్వారా సమీక్షిస్తూ ప్రతీ రైతుకు, ప్రతీ రొయ్యకు ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. 100 కౌంట్ రొయ్యకు రూ.210 ప్రభుత్వం నిర్ణయిస్తే, రూ.245 చొప్పున, 30 కౌంట్ రొయ్యకు రూ.380 చొప్పున నిర్ణయిస్తే రూ.470కు కొనుగోలు చేస్తోంది. ఈ స్థాయి ధరలు దేశంలో మరే రాష్ట్రంలోనూ లేవని రైతులే చెబుతున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రతీ ఆక్వా రైతుకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానిది.ఆక్వా కల్చర్ వ్యాపార కార్యకలాపాల పర్యవేక్షణ, నియంత్రణ, ప్రోత్సాహానికి వీలుగా ప్రభుత్వం ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ-2020. ఏపీ ఫిష్ ఫీడ్ (క్వాలిటీ కంట్రోల్) యాక్ట్-2020లను అమలులోకి తీసుకొచ్చింది. ఇవే నేడు ఆక్వా రైతులకు రక్షణ కవచాలుగా నిలిచాయి. నాణ్యమైన సీడ్, ఫీడ్ సరఫరా కోసం తీర ప్రాంత జిల్లాల్లో 35 ఇంటిగ్రేటెడ్ ఆక్వాల్యాబ్స్ ఏర్పాటుతో ఇన్‌పుట్ టెస్టింగ్, వ్యాధి నిర్ధారణ సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

ఆరోపణ: రాయితీ విద్యుత్తుకు మంగళం

వాస్తవం..: పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 57 నెలలుగా యూనిట్ రూ.1.50 చొప్పున విద్యుత్తు సరఫరా చేసింది. ఆక్వాజోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు సాగుచేసే 3.34 లక్షల ఎకరాలకు ఆక్వా సబ్సిడీ అందిస్తున్నారు. ఈ ఫిష్ సర్వే ద్వారా రాష్ట్రంలో 4.68 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుండగా, ఇందులో జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు ఆక్వా సాగు చేసే వారికి సాయంగా 3.34 లక్షల ఎకరాలకు సబ్సిడీ విద్యుత్తు వర్తింప చేస్తున్నారు. మొత్తం 66,993 కనెక్షన్లలో 54,072 కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. జోన్ పరిధిలో ఉన్న కనెక్షన్లలో 95 శాతం మంది ఆక్వా సబ్సిడీ పొందుతున్నారు. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.340 కోట్ల బకాయిలతో పాటు ఈ 57 నెలల్లో రూ.3,306 కోట్లు ఆక్వా సబ్సిడీ కింద ఈ ప్రభుత్వం ఖర్చుచేసింది.

ఆరోపణ : ఆక్వా రైతులకు ఆదరణేది?

వాస్తవం..: స్థానిక వినియోగం పెంచడమే లక్ష్యంగా ఫిష్ ఆంధ్రా బ్రాండింగ్‌తో డొమెస్టిక్ మార్కెటింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాకొకటి చొప్పున 26 ఆక్వా హబ్‌లు, నాలుగు వేల మినీ అవుట్‌లెట్స్, 351 డెయిలీ, 149 సూపర్, 62 లాంజ్ యూనిట్లు ఏర్పాటు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు అన్నీ కలిపి 2,500 యూనిట్లను ఏర్పాటు చేశారు. ఆర్బీకేల్లో నియమించిన 732 ఫిషరీస్ అసిస్టెంట్స్ ద్వారా మత్స్యకారులు, మత్స్య రైతులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపైన శిక్షణ ఇవ్వడమే కాక, పంట సాగు వేళ అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. నాణ్యమైన సీడ్, ఫీడ్ సప్లిమెంట్స్, మందులు, వలలు, ఇతర ఇన్‌పుట్స్ పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా డొమెస్టిక్ ఫిష్ మార్కెటింగ్ స్కోచ్ అవార్డుతో పాటు 2021-22, 2023-24 సంవత్సరాలకు రాష్ట్రానికి బెస్ట్ మెరైన్ స్టేట్ అవార్డులు. దక్కాయి. ఇవేమీ రామోజీకి కన్పించడం లేదు.

సీఎం జగన్ వెంటే ఆక్వా రైతులు

- చంద్రబాబును వారు నమ్మే స్థితిలో లేరు
- ముఖ్యమంత్రి ప్రజాదరణ చూసి ఓర్వలేకే ఎల్లోమీడియా రెచ్చిపోతోంది
- 2019 ఫలితాలే 2024లో రిపీట్ కాబోతున్నాయి
- ఈనాడుపై అప్సడా వైస్ చైర్మన్ రఘురాం ఫైర్



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఆక్వా రైతులందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా ఉన్నారని ఏపీ ఆక్వాకల్చర్ అథారిటీ కో-వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం స్పష్టంచేశారు. ముఖ్యమంత్రికి ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే ఎల్లో మీడియా రెచ్చిపోతోందన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి కుదేలయ్యారంటూ ఈనాడులో వచ్చిన కథనాన్ని శనివారం ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. ఎల్లో మీడియాను అడ్డంపెట్టుకుని చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఆక్వా రైతులే కాదు రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆయన్ను నమ్మే పరిస్థితి లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఆక్వా రైతుల సంక్షేమం కోసం చంద్రబాబు ఏనాడు ఆలోచించలేదన్నారు. 100 కౌంట్ రూ.100లకు పడిపోయినా పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు పన్నుల మీద పన్నులు వేసి ఆక్వా రంగం కుదేలయ్యేలా చేశారన్నారు. కానీ, నేడు ఆక్వా రైతులపై పైసా భారం పడకుండా అన్ని విధాలుగా అండగా నిలిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని రఘురాం చెప్పారు. అలాగే, ఆక్వా జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు రైతుకు యూనిట్ విద్యుత్ రూ.1.50లకు ఇవ్వడమే కాక.. పెంచిన ఫీడ్, సీడ్ ధరలను తగ్గించారన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న ఆక్వాజోన్ విధానాన్ని సరిచేయడమే కాక, చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.340 కోట్ల విద్యుత్ సబ్సిడీని బకాయిలను చెల్లించడంతో పాటు ఈ 57 నెలల్లో ఏకంగా రూ.3,400 కోట్ల విద్యుత్ సబ్సిడీని జగన్ సర్కార్ భరించిందన్నారు. గతంలో నాసిరకం సీడ్, ఫీడ్ పంపిణీ చేసినా ప్రాసెసింగ్ ఆపరేటర్లు, ఫీడ్ తయారీదారులను కనీసం ప్రశ్నించే అవకాశం కూడా ఉండేది కాదన్నారు.

అప్సడా చట్టంతో ఆక్వా రైతులకు రక్షణ..

ఇక ఆక్వా కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు అప్సడా చట్టంతో పాటు సీడ్, ఫీడ్ చట్టాలను తీసుకొచ్చి ఆక్వా రైతులకు రక్షణగా నిలిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని రఘురాం చెప్పారు. ప్రాసెసింగ్ ఆపరేటర్లు, ఫీడ్ తయారీదారులు రైతులతో ప్రతీ 15 రోజులకోసారి సమావేశాలు ఏర్పాటుచేసి వారిలో జవాబుదారీతనం తీసుకొచ్చామన్నారు. కౌంట్ ధరలు తగ్గకుండా సమీక్షించడమే కాదు, సీడ్, ఫీడ్ ధరలు పెరగకుండా ఎప్పటికప్పుడు నియంత్రించగలిగామన్నారు. ఆక్వా రైతులకు కలగా మిగిలిన బీమా సౌకర్యాన్ని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి పైలెట్ ప్రాజెక్టుగా అప్సడా ద్వారా అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. స్థానిక వినియోగం పెంచడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో ప్రాన్స్ ఫెస్టివల్స్ నిర్వహించడంతోపాటు ఆక్వా హబ్స్‌కు అనుబంధంగా 2,500కు పైగా రిటైల్ అవుట్‌లెట్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. 2009లో దివంగత సీఎం వైఎస్సార్‌ను ఓడించేందుకు చంద్రబాబు నాయకత్వంలో విపక్షాలన్నీ ఏకమై మహా కూటమిగా తలపడితే ఫలితం ఏమొచ్చిందో అదే ఫలితం 2024 ఎన్నికల్లోనూ రిపీట్ అవుతుందని రఘురాం స్పష్టంచేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.